అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

గురువారం 24-8-2017

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 3 సంచిక : 237 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar, Mahaboobnagar, Warangal | www.navatelangana.com | 12 + 16 పేజీలు వెల : 5.00

పక్కా ప్రణాళికతోనే

దభోల్కర్, పన్సారే హత్యలపై హైకోర్టు



ముంబయి : ప్రముఖ హేతువాదులు నరేంద్ర దభోల్కర్, గోవింద్ పన్సారేల హత్యలు పక్కా ప్రణాళికతో జరిగినవేనని, నేరస్థులకు సంస్థాగత మద్దతు కూడా ఉందని బాంబే హైకోర్టు వ్యాఖ్యానించింది. నేరస్థులను పట్టుకోవడానికి ప్రస్తుతం జరుపుతున్న పరిధిదాటి దర్యాప్తు నిర్వహించాలని దర్యాప్తు అధికారులను ఆదేశించింది. ఈ రెండు హత్యలకు స్పష్టమైన సంబంధమున్నదని జస్టిస్ ఎస్‌సి ధర్మాధికారి, వైభవ్ కంకన్‌వాడి నేతృత్వంలోని ధర్మాసనం వ్యాఖ్యానించింది. 'ఈ హత్యల వెనుక కుట్ర దాగి ఉంది. కొన్ని సంస్థలు నిందితులకు ఆర్థికంగా సహాయం చేయడంతోపాటు వారికి మద్దతుగా నిలుస్తున్నాయి. ఇవి పక్కా ప్రణాళికతో జరిగినవేనని నివేదికలు స్పష్టం చేస్తున్నాయి' అని న్యాయమూర్తి ధర్మాధికారి వ్యాఖ్యానించారు. వీరిద్దరి హత్య కేసులపై సీఐడీ, సీబీఐ సమర్పించిన నివేదికల ఆధారంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. 2013లో జరిగిన దభోల్కర్ హత్య కేసులో సారంగ్ అకోల్కర్, వినయ్ పవార్‌లను సీబీఐ దోషులుగా గుర్తించింది. కాగా, వారి జాడ ఇంకా తెలియరాలేదు. ప్రస్తుతం జరుగుతున్నదానికి భిన్నంగా దర్యాప్తు కొనసాగించాలని సీబీఐని కోర్టు ఆదేశించింది. 'రెండు హత్యలకు పరస్పర సంబంధముంది. నిందితులకు సమాజంలోని కొన్ని సంస్థల మద్దతుంది. సీఐడీతో సమన్వయం చేసుకోండి. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించండి, బ్యాంక్ లావాదేవీలను పరిశీలించండి, ఏటీఎం నగదు ఉపసంహరణలు, రైల్వే బుకింగ్స్ తనిఖీలు చేయండి, సమీప సరిహద్దు రాష్ట్రాలకు నిందితులు పారిపోయి ఉంటారు' అని న్యాయమూర్తి చెప్పారు. 'నేటి కాలంలో దీర్ఘకాలం దాక్కుని ఉండటం సాధ్యం కాదు' అన్నారు. ఈ ...9లో

భారత్‌పై స్వైన్‌ఫ్లూ పంజా



ఈఏడాది 1,094 మంది మరణాలు

- గతేడాది కంటే నాలుగురెట్లు అధికం..
- మహారాష్ట్రలో అత్యధికం(437)హెచ్1ఎన్1 ఇన్‌ఫెక్షన్
- బీజేపీ పాలిత రాష్ట్రాల్లో వ్యాధి స్వైర విహారం

న్యూఢిల్లీ: భారత్‌పై స్వైన్‌ఫ్లూ పంజా విసురుతోంది. మోడీ హయాంలో వైద్యరంగానికి పెద్దపీట వేస్తున్నామని చెబుతుంటే.. ఈఏడాది స్వైన్‌ఫ్లూ బారినపడి 1,094 మంది చనిపోయారని కేంద్ర ఆరోగ్యమంత్రిత్వశాఖ బుధవారం ఓ ప్రకటనలో వెల్లడించింది. గతేడాదిలో నమోదైన స్వైన్‌ఫ్లూ మరణాలతో పోలిస్తే ఇది నాలుగు రెట్లు ఎక్కువని కూడా ఆరోగ్యమంత్రిత్వ శాఖ తెలిపింది. దేశవ్యాప్తంగా ఆగస్టు 20 వరకు ...9లో


కార్పొరేట్ లోగుట్టు

బయటపడుతున్న డొల్లతనం



- 'బడా' మేలుకే సర్కారు 'రద్దు' నిర్ణయం
- ప్రజల్లో గొప్పలు చెప్పుకొనేందుకు ప్రచారం
- షెల్ కంపెనీల రద్దుతో సాక్ష్యాలు కనుమరుగు

నవతెలంగాణ, వాణిజ్య విభాగం: దేశంలో నల్లధన నియంత్రణ చర్యల్లో భాగంగా దాదాపు లక్షకు పైగా డొల్ల కంపెనీలను రద్దు చేసినట్టుగా సర్కారు ప్రచారం చేసుకుంటోంది. ప్రచారం వెనుక అసలు వాస్తవాలు ఇప్పుడు క్రమంగా వెలుగులోకి వస్తున్నాయి. 71వ స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా ఎర్రకోట సాక్షిగా ప్రధాని మోడీ తన ప్రసంగంలో డొల్ల కంపెనీల రద్దు విషయాన్ని ప్రస్తావించి.. తాను దేశానికి ఎంతో మేలు చేస్తున్నట్టుగా ప్రచారం చేసుకోవడాన్ని అకౌంటింగ్ నిపుణులైన కొందరు సీనియర్ చార్టర్డ్ అకౌంటెట్లు ఆక్షేపిస్తున్నారు. తమ వ్యాపారానికి సంబంధించి అక్రమ లావాదేవీల కోసం బడా కార్పొరేట్ సంస్థలు ఏర్పాటు చేసే ఫేక్ కంపెనీలే డొల్ల కంపెనీలని వారు వివరిస్తున్నారు. నకిలీ బిల్లులు, ఉగ్రవాదులకు మామూళ్లు, భారీ చందాలు, రాజకీయ పార్టీలకు ఇచ్చే విరాళాల నిమిత్తమే వీటిని సృష్టిస్తారని వారు చెబుతున్నారు. బడా కంపెనీలు ఈ లావాదేవీలన్నింటిని డొల్ల కంపెనీల లెక్కల్లో చూపుతాయని వారు చెబుతున్నారు. అక్రమ లావాదేవీల అనంతరం ఆధారాలు లేకుండా వాటి రికార్డులను కంపెనీలు మాయం చేస్తాయని వారు చెబుతున్నారు. అటువంటి లక్ష వరకు షెల్ కంపెనీలను మూసి వేయడం ద్వారా సర్కారు ఏమంత ఘనకార్యమేమి చేయలేదని వారు పెదవి విరుస్తున్నారు. ఈ కంపెనీలను రద్దు చేయడంతో వాటి కార్యకలాపాలకు సంబంధించిన ఆధారాలన్నీ తుడిచి పెట్టుకు పోతాయన్నది వారి వాదన. రద్దు నిర్ణయంతో అవి జరిపిన అక్రమ లావాదేవీలన్నీ మరుగున పడ్తాయని. ఎలాంటి ఆధారాలు మిగలకుండా పోవడంతో వాటి గురించి విచారించే అధికారం న్యాయస్థానాలకూ లేకుండా పోతుందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సర్కారు రద్దు చేసినవాటిలో మోడీ, అతని పార్టీకి దాదాపు రూ.45 కోట్లమేర విరాళాలిచ్చిన బడా బాబాలకు చెందిన డొల్ల కంపెనీలు ముందు వరుసలోనే ఉండొచ్చని వారు అభిప్రాయపడుతున్నారు. డొల్ల కంపెనీల రద్దు అంశం చూస్తే జరిగిన నేరాల్ని కప్పి పుచ్చే ప్రయత్నంలో భాగంగా ఆడుతున్న రాజకీయ క్రీడగా అగుపిస్తోందని ఒక సీనియర్ చార్టర్డ్ అకౌంటెంట్ సామాజిక మాద్యమాల వేదికగా తన ...9లో



నేరెళ్లపై న్యాయం చేయండి

దళితులపై పోలీసుల దమనకాండ



- బాధ్యులపై ఇప్పటి వరకు చర్యల్లేవు..
- స్వతంత్ర విచారణకు ఆదేశించండి
- బాధితులకు నష్టపరిహారం ఇప్పించండి : రాష్ట్రపతి జోక్యం కోరిన అఖిపక్షం, జేఏసీ నేతలు

9లో



రాష్ట్రపతిని కలిసిన డి.రాజా, కోదండరామ్, ఉత్తమ్, ఎల్.రమణ, చాడ, సంపత్, తదితరులు

గులాబీ గేమ్

ముందు ఫిరాయింపుదారులతో రాజీనామా చేయించండి

- ప్రతిసవాల్ విసురుతున్న ప్రతిపక్షాలు
- టీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై సీఎం సీరియస్



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ఇటీవలకాలంలో అధికార టీఆర్ఎస్‌పార్టీలో రాజీనామాల డిమాండ్లు ఎక్కువగా వినిపిస్తున్నాయి. 'మీరు రాజీనామా చేయండి. మేం రాజీనామా చేస్తాం. ప్రజాక్షేత్రంలోనే తేల్చుకుందాం. ఎన్నికల్లో ప్రజలు ఎవరిని గెలిపిస్తారో చూసుకుందాం' అని టీఆర్ఎస్‌పార్టీకి చెందిన పలువురు ఎమ్మెల్యేలు సవాళ్లు విసురుతున్నారు. ఇప్పటికిప్పుడు ఎన్నికలం జరిగితే టీఆర్ఎస్‌పార్టీకి 106 సీట్లు వస్తాయని సర్వేలో తేలిందని పార్టీ అధినేత, సీఎం కేసీఆర్ చెప్పడంతో ఆ పార్టీ ఎమ్మెల్యేలకు మరింత ధీమా పెరిగినట్లయింది. దీంతో రెట్టించిన ఉత్సాహంతో కాంగ్రెస్‌పార్టీ, మిగతా పార్టీలకు సవాళ్లు విసురుతున్నారు. ఒకేసారి రాజీనామాలను ఆమోదింప చేసుకుందామని చెప్పేంత వరకు నాయకులు వెళ్లడం గమనార్హం. రాజీనామాలకు సిద్ధంగా ఉన్నా, ముందుగా పార్టీ మారిన ఫిరాయింపుదారులతో రాజీనామాలు ఇప్పించి, ఆమోదింపజేయిస్తే బాగుంటుందని ప్రతిపక్షాలు ప్రతీసవాల్ విసిరాయి.. దీంతో టీఆర్ఎస్‌పార్టీకి దిమ్మతిరిగినట్లయింది. వాస్తవానికి ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే 106 సీట్లు గెలుస్తామని సీఎం కేసీఆర్ చెప్పినా, ఎన్నికలకు వెళ్లే ధైర్యం టీఆర్ఎస్‌పార్టీకి లేదని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడ్డారు. దీనికి సంబంధించి 2014 ఎన్నికల్లో అత్యధికులు తెలంగాణ సెంటిమెంట్‌తోనే గెలిచినవారే ఉన్నారు. వారిలో చాలామందికి వచ్చే ఎన్నికల్లో గెలిచే అవకాశం లేదని తెలుస్తోంది. సొంతంగా చేయించుకున్న సీఎం కేసీఆర్ సర్వేలోనూ అదే తేలింది. సుమారు 30 నుంచి 40 మంది ఎమ్మెల్యేల పట్ల ప్రజల్లో వ్యతిరేకత ఉందని తెలిసింది. వారితోనూ సీఎం ...9లో



ప్రజా సంక్షేమమే ధ్యేయం : కవిత

- నిజామాబాద్ జిల్లాలో మన ఊరు- మన గ్రామం
- పలు కాలనీల సందర్శన
- అభివృద్ధి పనులకు నిధులు కేటాయించిన ఎంపీ

6లో

విజయన్‌పై సీబీఐ ఆరోపణల్లో నిజం లేదు

స్పష్టం చేసిన కేరళ హైకోర్టు

వివరాలు 2లో



ఓబీసీ ఉపవర్గీకరణపై కమిషన్

- 12 వారాల్లోగా రిపోర్టు...కేంద్రక్యాబినెట్ నిర్ణయం

న్యూఢిల్లీ: ఇతర వెనుకబడిన తరగతుల(ఓబీసీ) ఉపవర్గీకరణపై కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక కమిషన్‌ను ఏర్పాటు చేయనున్నది. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో చేరే ఓబీసీ నిరుద్యోగులకు ఉపవర్గీకరణ వల్ల ప్రయోజనం చేకూరనున్నదని జైట్లీ తెలిపారు. ఓబీసీలో ఉన్న వివిధ కులాలకు అందాల్సిన బెనిఫిట్స్‌పై కొత్తగా నియమించబోయే కమిషన్ అంచనా వేయనున్నది. ఓబీసీ ఉప వర్గీకరణపై కమిషన్ ఏర్పాటు చేయాలని బుధవారం కేంద్ర క్యాబినెట్ సమావేశం నిరయించినంది. ఆర్టికల్ 340 ప్రకారం ఉపవర్గీకరణపై కమిషన్‌ను ఏర్పాటు చేశామని జైట్లీ చెప్పారు.. కమిషన్‌కు చైర్మెన్‌ను నియమించిన ...9లో



ప్రజాభిప్రాయం రణరంగం

కాంగ్రెస్, టీఆర్ఎస్ బాహాబాహి

- పెద్దపల్లిలో రెండు గంటలు యుద్ధ వాతావరణం
- కుర్చీలు, బెంచీలతో కార్యకర్తల పరస్పర దాడి
- పోలీసుల లాఠీచార్జి..కాంగ్రెస్ నాయకుల అరెస్ట్
- ఏ సభలో చూసినా టీఆర్ఎస్ కార్యకర్తల హడావిడే

9లో



ఇలా రాజీనామాలు చేసుకుంటూ పోతే మన క్యాబినెట్‌లో ఒక మంత్రికూడా మిగలరేమో..!!

రైతును ముంచారు

"క్వింటాల్ మిర్చిని రూ.5000 కనీస మద్దతు ధరకు కొనుగోలు చేస్తాం. మార్కెట్ జోక్యం ధరను అనుసరించి దీనిని కనీస ధరగా నిర్ణయించాం. సరుకు నాణ్యతలో తేడా ఉండి అంతటి ధర పలకకపోతే అలాంటి రైతులకు క్వింటాల్‌కు రూ.1250 బోనస్‌గా చెల్లిస్తాం. తెలంగాణలోని 33,700 మెట్రిక్ టన్నుల మిర్చిని కొనుగోలు చేస్తాం" ఇదీ కేంద్ర వ్యవసాయ సంక్షేమ శాఖ ఉత్తర్వు. కానీ, క్షేత్రస్థాయిలో అంతా భిన్నం. కేంద్ర, రాష్ట ప్రభుత్వాల పట్టింపుల వల్ల ఈ ఉత్తర్వు అమల్లోకి రాలేదు. దీంతో మిర్చి రైతులకు కనీస మద్దతు ధర దక్కలేదు. ఫలితంగా మిర్చి రైతులు రూ.100 కోట్లు నష్టపోయారు. ప్రత్యేక కౌంటర్లలో మిర్చి అమ్ముకుందామన్న రైతుకు నిరాశే మిగిలింది. ఆ మిర్చి వర్షాలకు తడిసి రంగుమారిపోయింది. ఆ పంటను అడ్డికి పావుసేరు లెక్క రూ.1700 నుంచి 2500లోపు అమ్ముకున్నారు. అటు పంటకు మద్దతు ధర దక్కక...ఇటు పంట నాణ్యత దెబ్బతిని కనీస ధర దక్కక రైతు పరిస్థితి రెంటికి చెడ్డ రేవడిలా మారింది. 9లో

రాష్ట్రంలో మిర్చిపంటకు అమలు చేయని మద్దతు ధర 100కోట్లు



అమెరికాలో ట్రంప్ వ్యతిరేక నిరసనలు

- అరిజోనాలోని ఫినిక్స్ కన్వెన్షన్ సెంటర్ బయట ఉద్రిక్తత 2లో

చిన్నారిపై లైంగిక దాడి

ఆలస్యంగా వెలుగుచూసిన దారుణం 3లో

ఎవరికీ చెప్పొద్దని టాకీస్ యజమాని బెదిరింపు

దళిత బాలిక చేత మలం ఎత్తించాడు

- పెత్తందారుడి దౌర్జన్యం
- మధ్యప్రదేశ్ ఛతర్‌పూరపూర్‌లో ఘటన

భోపాల్ : పాఠశాలకు వెళ్లిన ఆరేండ్ల దళిత బాలిక ఇంటర్వెల్ సమయంలో బహిరంగంగా మల విసర్జన చేసింది. అది చూసిన పెత్తందారు పప్పుసింగ్ కోపం నషాళానికెక్కింది. ఆ బాలికను పిలిచి గట్టిగా మందలించాడు. భయపెట్టాడు. అంతటితో ఆగకుండా ఆ చిన్నారి చేతులతోనే మలాన్ని ఎత్తించాడు. ఛతర్‌పూర్‌లోని గోధోరా గ్రామంలో సర్కారు పాఠశాల ఉన్నది. అందులో చదివే చిన్నారిపై పెత్తందారుడు పై విధంగా అగ్రవర్ణప్రతాపాన్ని చూశాడు. ఈ ఘటన అనంతరం ఏడుస్తూ... ఆ చిన్నారి ఇంటికి వెళ్లింది. స్కూలు వద్ద జరిగిన విషయాన్ని తండ్రికి చెప్పింది. ఆ పేదతండ్రి వెంటనే పప్పు సింగ్ వద్దకు వెళ్లి నిలదీశాడు. చిన్నామ్మాయి చేత ఆవిధంగా చేయించటానికి నీకు మనసు ఎలా వచ్చిందని ప్రశ్నిస్తే..నవ్వుతూ నిలబడ్డాడు. సమాధానమివ్వలేదు. బాలికను మానసిక క్షోభకు గురిచేసిన ఆ పెత్తందారుడిపై పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు ఎస్సీ,ఎస్టీ యాక్ట్ కింద కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

'గోప్యత'పై నేడు సుప్రీం తీర్పు!

న్యూఢిల్లీ : 'గోప్యత' హక్కుపై సుప్రీం కోర్టు గురువారం తుది తీర్పు ఇవ్వనున్నది. రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కుగా 'గోప్యత'ను పరిగణించాలా? లేదా? అనే విషయమై తీర్పునిస్తుంది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జె.ఎస్. ఖేహర్ నేతృత్వంలోని 9మంది సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం ఆగస్టు2న దీనిపై తీర్పును రిజర్వు చేసింది. అంతకుముందు మూడు వారాలపాటు, ఆరు రోజులు దీనిపై పెద్ద ఎత్తున వాదోపవాదాలు జరిగాయి.

కర్ణన్ పిటిషన్‌ను కొట్టేసిన హైకోర్టు

న్యూఢిల్లీ : కోర్టు ధిక్కరణ వ్యవహారంలో జైలు జీవితం గడుపుతున్న కోల్‌కతా హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ సిఎస్ కర్ణన్ దాఖలు చేసిన పిటిషన్‌ను ఢిల్లీ హైకోర్టు కొట్టివేసింది. కోర్టు ధిక్కరణల చట్టం చెల్లుబాటు అంశమై కర్ణన్ తరపు న్యాయవాది.. హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. కాగా దీనిని చీఫ్ జస్టిస్ గీతా మిట్టల్, న్యాయమూర్తి హరిశంకర్‌లతో కూడిన ధర్మాసనం బుధవారం తిరస్కరించింది. ప్రస్తుత, రిటైర్డు న్యాయమూర్తులు కొందరు అవినీతిపరులంటూ కర్ణన్ గతంలో సంచలన ఆరోపణలు చేసిన సంగతి తెలిసిందే.

త్వరలో రూ.200 నోటు



న్యూఢిల్లీ : రూ.200 నోటుపై కొన్ని నెలలుగా వినిపిస్తున్న ఊహాగానాలకు తెరపడింది. 'అవును.. నిజమే.. రూ.200 నోట్లు త్వరలోనే మార్కెట్లోకి రాబోతున్నాయి' అని కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ బుధవారం అధికారికంగా వెల్లడించింది. రూ.200 నోట్లను ముద్రించాలని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఆర్బీఐ) ఈ ఏడాది మార్చిలో ఓ ప్రతిపాదనను కేంద్రం ముందు ఉంచింది. కాగా దీనికి ఆర్థికశాఖ ఆమోదంలభించింది. కర్నాటకలోని మైసూరులో రూ.200నోట్ల ముద్రణ ప్రక్రియ కొనసాగుతున్నదని అధికారిక వర్గాలువెల్లడించాయి. రూ.100 నుంచి రూ.500 మధ్య ఇంతవరకు ఎలాంటి కరెన్సీ నోటు రాలేదు. ఇప్పుడు కొత్తగా రూ.200 నోట్లు వస్తుండడంతో జనం ఒకింత ఆసక్తితో ఉన్నారు.

50 మంది విద్యార్థులకు అస్వస్థత

- పాఠశాల సమీపంలో అమోనియా గ్యాస్ లీక్

చింద్వారా : ఒక పాఠశాల సమీపంలో ఉన్న శీతల గిడ్డంగి నుంచి అమోనియా గ్యాస్ లీకవడంతో దాదాపు 50 మంది విద్యార్థులు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. మధ్యప్రదేశ్‌లోని చింద్వారా జిల్లా నర్సింగ్‌పూర్ రోడ్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ ఘటన జరిగినప్పుడు దాదాపు 800 మంది విద్యార్థులు పాఠశాలలో ఉన్నట్టు సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. జిల్లా కలెక్టర్ జెకె జైన్ ఈ ఘటనపై దర్యాప్తుకు ఆదేశించారు.

యూపీలో మరో రైలు ప్రమాదం

- పట్టాలు తప్పిన 'కైఫియత్' ఎక్స్‌ప్రెస్
- 70 మందికి పైగా గాయాలు
- ట్రక్కును ఢీకొట్టడంతో దుర్ఘటన



లక్నో : ఉత్తరప్రదేశ్‌లో నాలుగు రోజుల్లోనే రెండో రైలు ప్రమాదం. ట్రక్కును ఢీకొట్టిన ఘటనలో కైఫియత్ ఎక్స్‌ప్రెస్ రైలు పట్టాలు తప్పింది. రాష్ట్రంలోని ఔరైయా జిల్లాలో చోటు చేసుకున్న ఈ దుర్ఘటనలో 70మందికి పైగా తీవ్రంగా గాయపడ్డారు. అజామ్‌గఢ్ నుంచి ఢిల్లీ వెళ్తున్న కైఫియత్ బుధవారం తెల్లవారుజామున 2.50 గంటలకు పాటా, అచల్డ స్టేషన్ల మధ్యలో ప్రమాదానికి గురైంది. కాపలా లేని సిగ్నల్ వద్ద రైలు రావడానికి కొద్దిసేపటి ముందు ఇసుక లోడుతో వెళ్తున్న లారీ ట్రాక్‌పై బోల్తా పడింది. కాగా ట్రక్కును రైలు ఢీకొట్టడంలో 9 బోగీలు పట్టాలు తప్పాయి. సహాయక చర్యలు ప్రారంభించిన పోలీసులు, రెస్క్యూ అధికారులు.. క్షతగాత్రులను సమీపంలోని ఆస్పత్రులకు తరలించారు. ఈ ప్రమాదంతో రైళ్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. శనివారం ముజఫర్‌నగర్‌లో ఉత్కల్ ఎక్స్‌ప్రెస్ రైలు పట్టాలు తప్పిన సంగతి తెలిసిందే. ఈ దుర్ఘటనలో 24 మంది మృతి చెందగా, 150 మందికి పైగా గాయాలయ్యాయి.

రాజీనామాకు సిద్ధపడ్డ రైల్వే మంత్రి

రెండు రైల్వే ప్రమాద ఘటనలకు బాధ్యత వహిస్తూ.. రైల్వే శాఖ మంత్రి సురేశ్ ప్రభు రాజీనామాకు సిద్ధపడ్డట్టు సమాచారం.. రైలు ప్రమాద ఘటనలపై ప్రధాని మోడీతో సురేశ్ ప్రభు బుధవారం ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ క్రమంలోనే మంత్రి పదవికి రాజీనామా చేస్తానని సురేశ్ వెల్లడించగా.. వేచి చూడాలని మోడీ సర్ది చెప్పినట్టు తెలుస్తున్నది. రైలు ప్రమాద ఘటనలకు పూర్తి బాధ్యత వహిస్తానని సురేశ్ ప్రభు ట్విట్టర్‌లో పేర్కొన్నారు.

రైల్వే బోర్డు చైర్మెన్ రాజీనామా

భారత రైల్వే బోర్డు చైర్మెన్ అశోక్ మిట్టల్ బుధవారం తన పదవికి రాజీనామా చేశారు. కాగా ఈయన స్థానంలో అశ్వనీ లోహాని నియమితులయ్యారు. లోహాని ప్రస్తుతం ఎయిరిండియా చైర్మెన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్‌గా పని చేస్తున్నారు. వాస్తవానికి మిట్టల్ పదవీకాలం ఇదివరకే ముగిసింది. అయితే రైల్వే బోర్డు చరిత్రలోనే తొలిసారిగా.. మిట్టల్ పదవీకాలాన్ని రెండు సంవత్సరాల పాటు పొడగిస్తూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది.

గప్‌చిప్‌గా పెట్రో వడ్డన

- నెలన్నరలో లీటరు పెట్రోల్‌పై రూ.5 పెంపు
- డీజిల్‌పై రూ.3.79 బాదుడు
- మున్ముందు ఇంకా పెరిగే అవకాశాలు

న్యూఢిల్లీ : దేశంలో పెట్రో ధరలను ఇంతకుముందు 15 రోజులకోసారి సవరించేంది. రేట్లను సరి చేసినప్పుడల్లా పెట్రోల్ ధర లీటరుపై రూపాయి వడ్డిస్తేనే భారీగా పెరిగిందనే భావన ఉండేది. ఇప్పుడేమో పెట్రో ధరలను ఏ రోజుకారోజు సవరిస్తున్నారు. ఈ విధానం వల్ల వాహనదారులపై భారం తగ్గుతుందంటూ ఇటు కేంద్రప్రభుత్వం, అటు చమురు కంపెనీలు ప్రజలను మభ్యపెట్టాయి. తీరా చూస్తే నెలన్నర రోజుల్లో(జులై 1 నుంచి ఈనెల 15 వరకు) పెట్రోలు ధర లీటరుకు రూ.5, డీజిల్ ధర రూ.3.79 పెరగడం వాహనదారులను మరింత కలవరానికి గురి చేస్తున్నది. 'మనీ భాస్కర్' అనే సంస్థ వెల్లడించిన రిపోర్టు ప్రకారం. ఢిల్లీలో గతనెల 1న లీటరు పెట్రోలు ధర రూ.63.9 ఉండగా.. ఈనెల 14కు అది రూ.68.8కి చేరుకున్నది. మరోవైపు ఈనెల 1 నుంచి 14 వరకు పెట్రోలు ధర మూడు రూపాయల మేర పెరిగింది. జులై 1న లీటరు డీజిల్ ధర రూ.53.5 ఉండగా ఈనెల 14 నాటికి రూ.57.29కి చేరింది. అయితే.. పెట్రోలు, డీజిల్ ధరలు మున్ముందు భారీగా పెరిగే అవకాశాలున్నాయని నిపుణులు అంచనా వేస్తున్నారు. హైదరాబాద్‌లో బుధవారం పెట్రోల్ ధర లీటరుకు రూ.72.85, డీజిల్ ధర రూ.62.03గా ఉన్నది.

విజయన్‌పై సీబీఐ ఆరోపణల్లో నిజం లేదు : కేరళ హైకోర్టు



తిరువనంతపురం : కేరళ ముఖ్యమంత్రి పినరయ్ విజయన్‌పై సీబీఐ చేసిన అవినీతి ఆరోపణల్లో వాస్తవం లేదని రాష్ట్ర హైకోర్టు స్పష్టం చేసింది. ఇంతకుముందు సీబీఐ ప్రత్యేక కోర్టు కూడా ఈ ఆరోపణల్లో పసలేదని నిర్ధారించింది. అయినా సీబీఐ పట్టు విడవకుండా హైకోర్టును ఆశ్రయించింది. ఇక్కడ కూడా సీబీఐకి ఎదురుదెబ్బ తగిలింది. ఇక లావా లిన్ కేసుగా ప్రచారంలో ఉన్న కేసులో వాస్తవాలు ఇలా ఉన్నాయి. 1996 నుంచి 1998 వరకు విజయన్ రాష్ట్ర మంత్రిగా వ్యవహరించారు.

ఆ సమయంలో లావాలిన్ కేసు కుట్ర జరిగిందనేది సీబీఐ ఆరోపణ. విజయన్ మంత్రిగా ఉన్న సమయంలో 1940, 1964లో పనిచేయడం ప్రారంభించిన మూడు హైడ్రోఎలక్ట్రిక్ పవర్ స్టేషన్లు - పల్లివాసల్, పనియార్, సెంగులం -ప్రాజెక్టులను నవీకరించడానికి మంత్రి ప్రతిపాదించారు. అందుకు కేరళ విద్యుత్ బోర్డు కూడా అంగీకరించింది. అయితే ఈవ్యవహారంలో రూ. 374కోట్ల మేరకు అవినీతి జరిగిందని సీబీఐ ఆరోపించింది. ఈవ్యవహారంలో జరిగిన కుట్రలో విజయన్ ప్రమేయం ఉన్నదనేది సీబీఐ ఆరోపణ. అయితే కేవలం మంత్రిగా ఉన్న రెండు సంవత్సరాల స్వల్ప వ్యవధిలో కుట్రలో భాగస్వామ్యం ఉన్నదనడానికి ఆధారాలు కనిపించడం లేదని కోర్టు అభిప్రాయపడింది. జస్టిస్ పీ ఉబైద్ నేడు ప్రకటించిన తీర్పులో విద్యుత్ బోర్డుకు చెందిన అధికారులు కె.వి. రాజగోపాల్, కస్తూరి రంగ అయ్యర్, ఆర్ సదాశివన్‌లపై చర్యలు తీసుకోవాల్సిందిగా కోర్టు ఆదేశించింది.

నిజం నిరూపితమైంది : సీపీఐ(ఎం)

లావాలిన్ కేసు రాజకీయంగా ప్రేరేపితమైనదిగా తమ పార్టీ చెబుతూనే ఉందని, హైకోర్టు తీర్పుతో ఇది నిజమని నిరూపించబడిందని సీపీఐ(ఎం) పేర్కొంది. కేరళ ముఖ్య మంత్రి పినరయ్ విజయన్‌పై చేసిన ఆరోపణలో పసలేదని, ఆయనను ఈ కేసులో నిర్దోషిగా పేర్కొంటూ రాష్ట్ర హైకోర్టు ఇచ్చిన తీర్పు పట్ల సీపీఐ(ఎం) పొలిట్ బ్యూరో హర్షం వ్యక్తం చేసింది. సీపీఐ(ఎం) నాయకుడిని, పార్టీని అప్రతిష్ట పాల్జే యాలని ప్రయత్నించారని విమర్శించింది.

'శశికళ హోసూర్ ఎమ్మెల్యే నివాసాన్ని సందర్శించారు'

బెంగళూరు : బెంగళూరులోని పరప్పన అగ్రహార సెంట్రల్ జైలులో శిక్ష అనుభవిస్తున్న ఏఐఏడీఎంకే తాత్కాలిక ప్రధాన కార్యదర్శి వి.కె.శశికళపై కర్ణాటక డీఐజీ మరో ఆరోపణల బాంబు విసిరారు. శశికళ జైలుకు సమీపంలోని హోసూర్ ఎమ్మెల్యే నివాసాన్ని సందర్శించినట్టు గత శనివారం సీబీఐకి సమర్పించిన నివేదికలో పేర్కొన్నారు. ఇందుకు తగిన ఆధారాలు తన వద్ద ఉన్నాయని తెలిపారు. జైలు ప్రవేశ మార్గాలలోని గేట్1, గేట్2లకు మధ్య అమర్చిన సిసి కెమెరాలు ఈ విషయాన్ని ధృవీకరించుకోవచ్చునన్నారు. శశికళ జైలులో రాజభోగాలు అనుభవిస్తున్నారంటూ అంతకు ముందు కూడా రూప ఆరోపించారు. ఆమె వ్యక్తిగత అవసరాల కోసం ప్రత్యేక సెల్‌ను, సందర్శకులను కలుసుకునేందుకు ప్రైవేటు గదిని, వంటల కోసం ప్రత్యేక కిచెన్‌ను ఏర్పాటు చేసుకున్నారని గతంలో జైళ్ళ శాఖ డీఐజీగా పనిచేసిన రూప ఆరోపించారు. కోర్టు అనుమతిగాని, రాష్ట్ర ప్రభుత్వం అనుమతి గాని లేకుండా ఆమె ప్రత్యేక సౌకర్యాలు పొందేందుకు జైలు అధికారులు సహకరించారని పేర్కొన్నారు. శశికళకు ఏర్పాటు చేసిన ప్రత్యేక సౌకర్యాలపై హోం మంత్రి, హోం శాఖ కార్యదర్శులకు వాస్తవ సమాచారమివ్వకుండా వారిని తప్పు దోవ పట్టిస్తున్నారని రూప తన నివేదికలో పేర్కొన్నారు.

జునైద్ కుటుంబానికి సీపీఐ(ఎం) సహాయం



న్యూఢిల్లీ : కదులుతున్న రైలులో దాడికి పాల్పడి.. రైలు నుంచి తోసేసిన ఘటనలో మృతిచెందిన జునైద్ కుటుంబానికి సీపీఐ(ఎం) బాసటగా నిలిచింది. హర్యానాలోని కటవాలి గ్రామంలో జునైద్ నివాసంలో సంఘీభావ సమావేశం జరిగింది. సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యురాలు బృందాకరత్, పార్టీ హర్యానా రాష్ట్ర కార్యదర్శి సురింద్ర మాలిక్ నేతృత్వం లోని పార్టీ ప్రతినిధుల బృందం రూ. 5 లక్షల చెక్కులు రెండింటిని జునైద్ తల్లిదండ్రులు జలాలుద్దీన్, సైరాలకు అందజేసింది. సీపీఐ(ఎం) కేరళ రాష్ట్ర కమిటీ తరపున ఈ చెక్కులను అందచేశారు. గత నెలలో విజయన్ ఢిల్లీలో పర్యటించిన సందర్భంగా సందర్భంగా జునైద్ కుటుంబసభ్యులు ఆయనను కలిశారు.

గ్రామంలో అమ్మాయిలకు ఒక పాఠశాల ప్రారంభించాలని, దానికి జునైద్ పేరు పెట్టాలని కోరుకుంటున్నట్టు ఆ సమయం లో విజయన్‌కు సైరా తెలియచేశారు. జునైద్ లాంటి వారిని కొట్టి చంపుతున్న చీకటి శక్తులపై పోరాటానికి, వారిని ఎదుర్కోవడానికి తమ పార్టీ కట్టుబడి ఉందని ఈ సందర్భంగా బృందాకరత్ పునరుద్ఘాటించారు. ఈ కేసులో అరెస్టయిన ఆరుగురిలో నలుగురు ఇప్పటికే బెయిల్‌పై విడుద లయ్యారని, న్యాయం అన్యాయానికి గురవుతోందని విమర్శించారు.

జునైద్ కుటుంబానికి హర్యానా పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, అతని హత్యకు కారణమైన బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడుతుందని సురేందర్ మాలిక్ అన్నారు. గ్రామ స్థులందరూ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



అమెరికాలో ట్రంప్ వ్యతిరేక నిరసనలు

- అరిజోనాలోని ఫినిక్స్ కన్వెన్షన్ సెంటర్ బయట ఉద్రిక్తత
- ఆందోళనకారులపై బాష్పవాయుగోళాలు ప్రయోగించిన పోలీసులు

వాషింగ్టన్ : అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పాల్గొన్న అరిజోనా ర్యాలీకి నిరసన సెగ తాకింది. ఈనెల 12న చార్లొట్టెవిల్లేలో పాదచారులపైకి కారు దూసుకెళ్లిన ఘటనలో ఒకరు మృతి చెందగా, మరో 19 మంది తీవ్రంగా గాయపడ్డ సంగతి తెలిసిందే.

ఈఘటనను ఉద్దేశించి ట్రంప్ చేసిన వ్యాఖ్యలు పెను దుమారం రేపాయి. బాధిత కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేయడం విస్మరించి ఈ ఘటనలో ఇరువర్గాల తప్పుందని వ్యాఖ్యానించారు. అమెరికాలోని శ్వేతజాతీయులకు ట్రంప్ మద్దతిస్తున్న విమర్శలు వెల్లువెత్తాయి. చార్లొట్టెవిల్లే ఘటన జరిగి 12రోజులైన తర్వాత ట్రంప్ తాజాగా అరిజోనా ర్యాలీలో పాల్గొన్నారు. ట్రంప్ ప్రసంగాన్ని అడ్డుకునేందుకు నిరసనకారులు ప్రయత్నించారు. ఈక్రమంలో పోలీసులకు, నిరసనకారులకు మధ్య తోపులాట జరిగింది. ఆందోళనకారులను చెదరగొట్టేందుకు బాష్పవాయుగోళాలు ప్రయోగించినట్టు పోలీస్ అధికారులు తెలిపారు. పోలీసుల చర్యలను, ట్రంప్ విధానాలను వ్యతిరేకిస్తూ ప్రజలు నినాదాలు చేసినట్టు స్థానిక మీడియా సంస్థలు ప్రకటించాయి. ఆందోళనకారులు తమపై గాజు బాటిళ్లు, రాళ్లు రువ్వినందుకే బాష్పవాయుగోళాలు ప్రయోగించినట్టు అరిజోనా పోలీస్ అధికార ప్రతినిధి జొనాథన్ హోవార్డ్ తెలిపారు. ఆందోళనకారులు ట్రంప్ మద్దతుదారులు ప్రయాణిస్తున్న వాహనాలపై దాడులకు పాల్పడ్డారని హోవార్డ్ ఆరోపించారు. అంతకుముందు, ఫినిక్స్ కన్వెన్షన్ సెంటర్‌లో ట్రంప్ మాట్లాడారు. చార్లొట్టేలో జరిగిన హింసాత్మక ఘటనను మీడియా వక్రీకరించిందని మండిపడ్డారు. అక్రమ వలసదారులను నియంత్రించేందుకు అమెరికా-మెక్సికో సరిహద్దులో గోడ నిర్మించి తీరుతామని ఉద్ఘాటించారు. గోడ నిర్మాణానికి డెమొక్రట్లు అడ్డుపడుతున్నారని అన్నారు. దేశ ప్రయోజనాల దృష్ట్యా నిర్మించనున్న సరిహద్దు గోడ కోసం ప్రజల సహకారం అవసరమన్నారు. తప్పుడు ధ్రువీకరణ పత్రాలతో అమెరికాలో ఆశ్రయం పొందిన శరణార్థులకు సహకరించినట్టు న్యాయాధికారి జోఅర్బైయోపై మోపిన అభియోగాలు రుజువయ్యాయి. యూఎస్ న్యాయస్థానం ఆయనకు అక్టోబర్‌లో శిక్ష ఖరారు చేయనుందన్నారు. కాగా, అరిజోనాలో జరిగిన ర్యాలీలో జోఅర్బైయో పాల్గొనకపోవడం పట్ల విమర్శలు వెల్లువెత్తాయి.

సొంత పార్టీ నుంచే ట్రంప్‌పై విమర్శలు

అమెరికా అధ్యక్ష ఎన్నికల ప్రచారంలో జోఅర్బైయో చురుగ్గా పాల్గొన్నారు. అరిజోనాలో ట్రంప్ గెలుపులో ఆయన కీలక పాత్ర పోషించారు. అయితే, జోఅర్బైయో అవినీతి అక్రమాలకు పాల్పడినట్టు పలు కేసులు నమోదయ్యాయి. జోఅర్బైయోను కాపాడేందుకు ట్రంప్ సర్కార్ ప్రయత్నిస్తోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో అరిజోనాలో ర్యాలీ నిర్వహించకపోవడమే ఉత్తమమని ఫొయినిక్స్ మేయర్ గ్రెగ్ స్టాంటన్ వైట్‌హౌస్‌కు సమాచారం అందించారు. మేయర్ సూచనలను పరిగణలోకి తీసుకోకుండా వైట్‌హౌస్ వర్గాలు ర్యాలీ నిర్వహించడం పట్ల విమర్శలు వినిపిస్తున్నాయి. రిపబ్లికన్ పార్టీలో లుకలుకలు ప్రారంభమయ్యాయని డెమొక్రట్లు ఆరోపిస్తున్నారు.

రక్కాలో కొనసాగుతున్న యూఎస్ సంకీర్ణదళాల దాడులు

- 78కి చేరిన మృతుల సంఖ్య



డమాస్కస్ : సిరియాలోని రక్కా నగరంలో అమెరికా సంకీర్ణదళాలు వైమానిక దాడులకు పాల్పడుతున్నాయి. మిలి టెంట్ల చొరబాట్లులేని ప్రాంతాల్లోనూ దాడులకు పాల్పడు తుండటంతో స్థానిక ప్రజలు బెంబేలెత్తుతున్నారు. ప్రాణ భయంతో రక్కా ప్రాంతాన్ని వదిలిపెట్టి ఆశ్రయం కోసం ఇతర ప్రాంతాలకు తరలివెళున్నారు. తాజాగా, రక్కాలోని క్రీడా మైదానంలో చిన్నారులు ఆడుకుంటుండగా అమెరికా సంకీర్ణదళాలు వైమానికదాడికి పాల్పడ్డాయి. ఈ దాడిలో ఓ బాలుడు తీవ్రంగా గాయపడ్డారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రుని పరిస్థితి విషమంగా ఉన్నదని వైద్యులు తెలిపారు. కాగా, యూఎస్ సంకీర్ణదళాలు రక్కాకు సమీపంలోని ప్రాంతాల్లో తెల్లభాస్వరాన్ని ప్రయోగిస్తున్నాయని స్థానికులు తెలిపారు. సిరియా స్టేట్ మీడియా సంస్థ తెలిపిన వివరాల ప్రకారం...బుధవారం నాటికి అమెరికా సంకీర్ణదళాల వైమానిక దాడుల్లో 78మంది పౌరులు మృతి చెందారు. అమెరికా సంకీర్ణదళాలు నిర్వహిస్తున్న అమానుష దాడుల పట్ల ఐక్యరాజ్య సమితి ఆందోళన వ్యక్తం చేస్తోంది. సంకీర్ణదళాలు మానవ హక్కులను ఉల్లంఘిస్తున్నాయని తెలిపింది. రక్కా ప్రాంతంలో నివసిస్తున్న పౌరులను కాపాడేందుకు అస్సద్ సర్కార్ తక్షణ చర్యలు చేపట్టాలని సూచించింది. అమెరికా సంకీర్ణదళాలు మూడు నెలల్లో నిర్వహించిన వైమానిక దాడుల్లో 300 మంది పౌరులు మృతిచెందారని తెలిపింది.

హాంకాంగ్‌లో 'హాతో' తుఫాను బీభత్సం



విక్టోరియా: హాంకాంగ్‌లో హాతో తుఫాను బీభత్సం సృష్టిస్తోంది. తుఫాను కారణంగా పెను గాలులు వీస్తుండటం, భారీ వర్షం కురుస్తుం డటంతో అక్కడి వాతావరణం భీకరంగా మారి పోయింది. తుఫాను కారణంగా ముగ్గురు చని పోయినట్టు అధికారులు ధ్రువీకరించారు. విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దీంతో, ప్రజలు అంధకారంలోనే ఉండిపోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. తుఫాను ధాటికి హాంకాంగ్‌లో వైమా నిక సేవలను నిలిపివేశారు. దాదాపు 100కు పైగా విమానాల రాకపోకలను రద్దు చేశారు. స్కూళ్లు, ఆఫీసులు మూతబడ్డాయి. ఫైనాన్షియల్ మార్కెట్లలో ట్రేడింగ్ కూడా నిలిచిపోయింది. హాంకాంగ్‌లోని ప్రముఖ విక్టోరియా హార్బర్‌లో హాతో తుఫాను ఏర్పడింది. గంటకు 155 కిలోమీటర్ల వేగంతో పెనుగాలులు వీస్తున్నాయి. తుఫాను కారణంగా పెద్దపెద్ద అలలు ఎగిసి పడుతు న్నాయి. దీంతో, భారీ వరదలు సంభ వించే అవకాశముందని అక్కడి వాతావరణ శాఖ హెచ్చ రికలు జారీ చేసింది. తీర ప్రాంతానికి సమీపంలోని నివాస ప్రాంతాల్లో ఇప్పటికే అనేక ఇండ్లు ధ్వంసమయ్యాయి. ఈనేపథ్యం లో స్థానిక ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు.



సౌదీ సంకీర్ణదళాల వైమానిక దాడుల్లో 60 మంది మృతి

సనా : సౌదీ సంకీర్ణదళాలు యెమెన్‌లోని ఓ హోటల్‌పై వైమానిక దాడులకు పాల్పడ్డాయి. ఈ దాడుల్లో 60 మంది మృతి చెందారు. మరో 13 మంది తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను స్థానిక ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మృతుల సంఖ్య పెరిగే అవకాశముందని అధికారులు తెలిపారు. స్థానిక తనిఖీ కేంద్రానికి సమీపంలో ఈ దాడులు చోటుచేసుకున్నాయి. ఘటనాస్థలంలో 35 మృతదేహాలను గుర్తించినట్టు రెడ్‌క్రాస్ సంస్థ ప్రతినిధి హుస్సేన్ అల్-తవిల్ తెలిపారు. సౌదీ సంకీర్ణదళాలు ఈ ఏడాది 5,676 వైమానిక దాడులు నిర్వహించినట్టు అంతర్జాతీయ మానవ హక్కుల సంస్థ తెలిపింది. గతేడాది సంకీర్ణదళాలు 3,936 దాడులు నిర్వహించినట్టు పేర్కొన్నది.

సిరియాలో ఉగ్రస్థావరాలపై రష్యా వైమానిక దాడులు

డమాస్కస్ : సిరియాలోని డిర్-ఎ-జోర్ నగరంలోని ఉగ్రస్థావరాలను లక్ష్యంగా చేసుకుని రష్యా బాంబుల వర్షం కురిపించింది. రష్యా యుద్ధ విమానాలు నిర్వహించిన మెరుపు దాడిలో దాదాపు 200 మంది మిలిటెంట్లు హతమయ్యారు. ఈ మేరకు రష్యా సైన్యం అధికారిక ప్రకటన విడుదల చేసింది. సిరియా సేనలకు సహకారంగా రష్యా.. డిర్-ఎ-జోర్ నగరంలోని ఐఎస్ స్థావరాలను ధ్వంసం చేసి ఉగ్రవాదులను మట్టుబెట్టినట్టు తెలిపింది. ఈ నెలలో జరిపిన దాడుల్లో ఇప్పటివరకూ 800 మంది ఉగ్రవాదులు హతమయ్యారని పేర్కొన్నది. అంతర్యుద్ధం జరుగుతున్న ప్రాంతాలకు మిలిటెంట్లు ప్రవేశించకుండా అడ్డుకుంటున్నామని తెలిపింది. మోసుల్, రక్కా నగరాలపై అమెరికా, రష్యా సేనలు పట్టు సాధించిన అనంతరం డిర్-ఎ-జోర్ నగరానికి పెద్ద ఎత్తున ఉగ్రవాదులు తరలివచ్చారు.

మలేషియాలో ప్రవాస భారతీయునికి జీవితఖైదు

సింగపూర్: మాదక ద్రవ్యాల అక్రమ రవాణా కేసులో భారతీయ సంతతికి చెందిన ఓ వ్యక్తికి సింగపూర్ న్యాయస్థానం జీవిత ఖైదు విధించింది. ప్రాసిక్యూషన్ తెలిపిన వివరాల ప్రకారం..భారతీయ సంతతికి చెందిన మలేషియన్ శరవణన్ చందారం(30) 2014 నవంబరులో 10 ప్యాకెట్ల నిషేధిత మాదకద్రవ్యాలను తన కారు సీటు కింద దాచిపెట్టుకుని ప్రయాణిస్తుండగా పోలీసులు అరెస్ట్ చేశారు. అతని వద్ద దాదాపు 1.38 కిలోల గంజాయి, 3.29 గంజాయి సంబంధిత మత్తు పదార్థాలు లభ్యమయ్యాయి. కేసు విచారణలో భాగంగా శరవణన్ తరపు న్యాయవాది 'పొట్లాల్లో గంజాయి ఉన్నట్టు శరవణన్‌కు తెలియదు. ఓ వ్యక్తి పొగాకు పొట్లాలుగా చెప్పి వాటిని అతనికి అందించాడు' అని వాదించగా.. మాదకద్రవ్యాల సరఫరాకు సంబంధించి అనుమానాస్పద పరిస్థితులు స్పష్టంగా ఉన్నప్పటికీ అతను గుర్తించలేకపోయాడని ప్రాసిక్యూషన్ తరపు న్యాయవాది వాదించారు. వివరాలన్నీ పరిశీలించిన సింగపూర్ న్యాయస్థానం అతనికి జీవిత ఖైదు విధించింది. దీంతోపాటు కొరడా దెబ్బలు తినాలని ఆదేశించింది.

చిన్నారిపై లైంగిక దాడి

నవతెలంగాణ-మహేశ్వరం

అభం శుభం తెలియని రెండేండ్ల చిన్నారిపై ఓ యువకుడు లైంగిక దాడికి పాల్పడ్డాడు. చిన్నారి తల్లిదండ్రుల అమాయకత్వాన్ని ఆసరా చేసుకున్న థియేటర్ యజమాని విషయాన్ని బయటకు చెప్పొద్దని బెదిరించాడు. కానీ, ఆస్పత్రిలో వైద్యులు లైంగికదాడిని నిర్ధారించడంతో ఆలస్యంగా వెలుగుచూసింది. వివరాలిలా ఉన్నాయి.. తుక్కుగూడ శ్రీప్రేమ సినిమా థియేటర్‌లో నాగర్‌కర్నూల్ జిల్లా తాండూర్ మండలానికి చెందిన లక్ష్మయ్య దంపతులు పనిచేస్తున్నారు. థియేటర్ వెనుక భాగంలో ఉన్న గదుల్లో నివాసం ఉంటున్నారు. ఆగస్టు 13న రాత్రి పక్క గదిలో ఉంటున్న మహబుబ్‌నగర్‌కు చెందిన నరసింహా(19) లక్ష్మయ్య కు మార్తె(2)ను తన గదిలోకి తీసుకెళ్లి లైంగిక దాడి చేశాడు. చిన్నారికి తీవ్ర రక్తస్రావం కావడంతో తల్లిదండ్రులు టాకీస్ యజమాని సంతోష్‌లాల్ తివారీకి చెప్పారు. ఆ తర్వాత స్థానికంగా లక్ష్మి ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన డాక్టర్లు చిన్నారిపై లైంగికదాడి జరిగిందని, ఉస్మానియా ఆస్పత్రికి తీసుకుపోవాలని సూచించారు. దాంతో చిన్నారి తల్లిదండ్రులు థియేటర్ యజమానిని బతిమలాడారు. ఆస్పత్రికి తీసుకుపోతాను కానీ, లైంగికదాడి జరిగిందని ఎవరికీ చెప్ప కూడదని, కట్టెపుల్ల కుచ్చుకుందని చెప్పాలని బెదిరించాడు. చేసేదేమీ లేక వారు ఒప్పుకోవడంతో ఉస్మానియా ఆస్పత్రికి తీసుకొచ్చాడు. అక్కడి నుంచి నీలోఫర్ ఆస్పత్రికి తరలించగా, చిన్నారిపై లైంగికదాడి జరిగిందని వైద్యులు నిర్ధారించారు. దాంతో పది రోజుల తరువాత దారుణం వెలుగుచూసింది.

తుక్కుగూడలో రాస్తారోకో

లైంగిక దాడి నిందితుడు నర్సింహాతో పాటు థియేటర్ యజమాని సంతోష్‌లాల్ తివారీని వెంటనే అరెస్టు చేయాలని బుధవారం తుక్కుగూడలో సీపీఐ(ఎం), కాంగ్రెస్, సీఐటీయూ, ఐద్వా ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా మహేశ్వరం ఎంపీపీ పి.స్నేహ, వైస్ ఎంపీపీ ఎం.స్వప్న, సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఈఎస్ఎన్ రెడ్డి, మహిళ సంఘం నాయకురాలు అనురాధ, బి.దత్తునాయక్, కవిత తదితరులు మాట్లాడారు. నిందితులపై నిర్భయ కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

30 మంది విద్యార్థినులకు అస్వస్థత

పాలు తాగిన అనంతరం ఘటన

- జ్యోతిబా బీసీ గురుకులంలో..
- విద్యార్థులకు ఎంఎల్ఏ, డీఎంఅండ్‌హెచ్ఓ పరామర్శ



నవతెలంగాణ-అశ్వారావుపేట

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేటలోని జ్యోతిబా బీసీ గురుకులంలో 30 మంది విద్యార్థినులు బుధవారం అస్వస్థతకు గురయ్యారు. వీరికి భద్రాచలం ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. వీరిలో ఐదుగురు తీవ్ర అస్వస్థతకు గురైనట్టు వైద్యులు తెలిపారు.

ప్రభుత్వం అశ్వారావుపేటలో ఈ విద్యా సంవత్సరం గురుకుల పాఠశాల ఏర్పాటు చేసింది. ఇక్కడ 50 మంది విద్యార్థినులకుగాను బుధవారం 47 మంది ఉన్నారు. వీరికి రోజు మాదిరిగానే కాంట్రాక్టర్ సరఫరా చేసే తిరుమల కంపెనీకి చెందిన ప్యాకెట్ పాలను ఉదయం ఏడు గంటలకు అందించారు. పాలు తాగిన బాలికలు సుమారు 30 మంది ఊపిరి పీల్చుకోవడం కష్టంగా ఉందని, నడవలేని సితిలో సిబ్బందికి తెలిపారు. వార్డెన్ ఖతీజా, సిబ్బంది కలిసి విద్యార్థినులను ప్రభుత్వ ఆస్పత్రికి, మరికొందరిని ఓ ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. ప్రయివేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న స్ఫూర్తి, బిందుప్రియ, రుషిత, ఇందు, కావ్యలను డీఎంఅండ్‌హెచ్ఓ దయానంద్‌స్వామి పరీక్షించి వెంటనే భద్రాచలం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించాల్సిందిగా ఆదేశించారు. ఘటనపై డీఎంహెచ్ఓ మాట్లాడుతూ.. పాలు సరిగా వేడి చేయకపోవడం వల్లనో లేక కలుషిత నీరు పాలల్లో కలవడం వల్లనో ఇలా జరిగి ఉండొచ్చని అన్నారు. ఈ విషయాన్ని తహసీల్దార్ ఎలవర్తి వెంకటేశ్వర్లు రాతపూర్వకంగా జిల్లా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతుకు నివేదించారు.

పాఠశాల సిబ్బందిపై ఎంఎల్ఏ ఆగ్రహం

విషయం తెలుసుకొన్న ట్రైకార్ చైర్మన్, స్థానిక ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు వెంటనే అశ్వారావుపేట ప్రయివేటు ఆస్పత్రికి వచ్చారు. విద్యార్థినులను పరామర్శించి వారి ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్నారు. అనంతరం వసతి గృహానికి చేరుకొని వంటగదులను, తరగతి గదులను పరిశీలించారు. స్టోర్‌రూమ్‌లో పాడై పోయిన కూరగాయాలను చూసి ప్రిన్సిపాల్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. రిజిస్టర్‌లో సంతకాలు సరిగా లేకపోవడంతో వెంటనే కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వంట మనిషి 10 లీటర్ల పాలలో నాలుగు చెంచాల బూస్ట్ వేస్తున్నామని చెప్పడంతో ఎమ్మెల్యే ఆశ్చర్యానికి గురయ్యారు. మెనూ సరిగా అమలు చేయకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అంగన్‌వాడీల శ్రమను గుర్తించాలి

- సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి జయలక్ష్మి

నవతెలంగాణ-కంఠేశ్వర్

అంగన్‌వాడీ టీచర్లు, మినీవర్కర్ల శ్రమను గుర్తించి ప్రభుత్వ టీచర్లతో సమానంగా వేతనాలు ఇవ్వాలని అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జయలక్ష్మి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో బుధవారం అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జయలక్ష్మి మాట్లాడుతూ... ప్రభుత్వం అంగన్‌వాడీ కార్యకర్తలను టీచర్లుగా మార్చినా గౌరవం ఇవ్వడం లేదని, ఉద్యోగ భద్రత కల్పించడం లేదని అన్నారు. వయసు పైబడిన వారికి రిటైర్మెంట్ బెనిఫిట్స్ టీచర్లకు రూ.2 లక్షలు, ఆయాలకు రూ.లక్ష ఇవ్వాలని, అంగన్‌వాడీ టీచర్లు, మినీవర్కర్లుకు ప్రభుత్వ టీచర్లతో సమానంగా వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రిటైర్డ్ అయినవారికి చివరి జీతంలో సగం జీతం పెన్షన్‌గా ఇవ్వాలని, జీవో నెం.14ను ఉపసంహరించుకోవాలని కోరారు. ఐసీడీఎస్ రక్షణ కోసం రాబోయే కాలంలో పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రమేశ్‌బాబు, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు దేవగంగు, స్వర్ణ, చంద్రకళ, హేమమాలిని, వాణి, యమున, సునంద, జరీన పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జయలక్ష్మి

వీఆర్ఎస్... వైరస్ కంటే ప్రమాదకరం..



పీర్‌లెస్ ఉద్యోగులను ఉద్దేశించి మాట్లాడుతున్న నాబార్డు ఎంప్లాయిస్ అసోసియేషన్ నాయకులు కైలాసపతి

ఖర్చు తగ్గింపు పేరుతో ఉద్యోగుల్ని సాగనంపటం దారుణం

- సౌత్ సెంట్రల్ జోన్ ఆఫీసు వద్ద పీర్‌లెస్ ఉద్యోగుల ఆందోళన
- ఐక్యంగా తిప్పికొడతామని ప్రతిన

నవతెలంగాణ-హైదరాబాద్

స్వచ్ఛంద ఉద్యోగ విరమణ (వీఆర్ఎస్) అనేది వైరస్ కంటే ప్రమాదకరమైందని ఆలిండియా నాబార్డు ఎంప్లాయిస్ అసోసియేషన్ నాయకులు కైలాసపతి వ్యాఖ్యానించారు. సరళీకృత ఆర్థిక విధానాల నేపథ్యంలో ఇది ఒక సంస్థ నుంచి మరో సంస్థకు శరవేగంగా వ్యాపిస్తున్నదని చెప్పారు. ఇదే క్రమంలో 85 ఏండ్లుగా ఖాతాదారుల మన్ననలను అందుకుంటున్న పీర్‌లెస్ సంస్థలోని ఉద్యోగులను కూడా వీఆర్ఎస్ పేరుతో ఇంటికి సాగనంపేందుకు యాజమాన్యం కుట్రలు పన్నుతున్నదని చెప్పారు. ఇలాంటి చర్యలను ఐక్యంగా తిప్పికొట్టాలని ఆయన పిలుపునిచ్చారు.

వీఆర్ఎస్ పథకాన్ని వ్యతిరేకిస్తూ బుధవారం హైదరాబాద్‌లోని పీర్‌లెస్ సౌత్ సెంట్రల్ జోన్ ఆఫీసు వద్ద ఆ సంస్థ ఉద్యోగులు.. 'మధ్యాహ్న భోజన సమయంలో ఆందోళన' నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలిండియా పీర్‌లెస్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయు) సీనియర్ నాయకులు కె.నాగలక్ష్మి అధ్యక్షతన జరిగిన సభలో కైలాసపతి ముఖ్య అతిథిగా మాట్లాడుతూ... యాజమాన్యం వీఆర్ఎస్ పేరిట అత్యంత దుర్మార్గంగా ఉద్యోగులను ఇంటికి సాగనంపేందుకు కుట్రలు పన్నుతున్నదని విమర్శించారు. 2000 సంవత్సరంలో 70 శాతం మందిని ఇదే విధంగా ఇంటికి పంపిందని తెలిపారు. మిగిలిన 30 శాతం మంది ఉద్యోగులు రేయింబవళ్లు కష్టపడి నష్టాల్లో ఉన్న కంపెనీని లాభాలబాట పట్టించారని చెప్పారు. మరోవైపు ఇదే కంపెనీకి ప్రస్తుతం రూ.1,700 కోట్ల నికర ఆస్తులున్నాయని తెలిపారు. ఇలాంటి అంశాలన్నింటినీ విస్మరించి ఇప్పుడు ఖర్చు తగ్గింపు పేరిట ఉద్యోగులను బయటకు పంపేందుకు ప్రయత్నించటం దారుణమని అన్నారు. ఇలాంటి ప్రయత్నాలను విరమించుకోవాలని ఆయన పీర్‌లెస్ యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. బ్యాంకులు ఎల్ఐసీలాంటి సంస్థలతో సహా పీర్‌లెస్ లాంటి సంస్థలు కూడా యూనియన్ల కృషితోటే తమ ఉనికిని నిలబెట్టుకుంటున్నాయని తెలిపారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి సివిఎ కుమార్ మాట్లాడుతూ.. పీర్‌లెస్ సంస్థపై ఆర్‌బిఐ ఆంక్షలు విధించగా.. దాన్ని సవాల్ చేస్తూ తమ సంఘం కలకత్తా హైకోర్టులో న్యాయపోరాటం చేస్తున్నదని తెలిపారు. ఈ అంశాన్ని పరిగణనలోకి తీసుకోని యాజమాన్యం పొదుపు చర్యల పేరిట ఉద్యోగులకు నష్టదాయకమైన చర్యలకు పూనుకుంటున్నదని విమర్శించారు. నాగలక్ష్మి మాట్లాడుతూ.. సంస్థ భవిష్యత్ కోసం అహర్నిషలూ కృషి చేస్తున్న ఉద్యోగుల మెడపై యాజమాన్యం కత్తిని వేలాడదీయటం దుర్మార్గమని అన్నారు. ప్రస్తుతం ప్రవేశపెట్టిన వీఆర్ఎస్ పథకాన్ని మెజార్టీ ఉద్యోగులు తిరస్కరిస్తున్నారని, దీనితో యాజమాన్యం ఉద్యోగులను భయభ్రాంతులకు గురిచేసే ప్రయత్నం చేస్తున్నదని వివరించారు. యాజమాన్యం ఉద్యోగులపట్ల అనుసరిస్తున్న ఇలాంటి బెదిరింపులు తాటాకు చప్పుళ్లవంటివని అన్నారు. ఇలాంటి వాటికి ఎట్టిపరిస్థితుల్లోనూ బెదరబోమని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్‌బీఐ నాయకులు సుందర్, పీర్‌లెస్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు రాధారాణి, టివిజికె రాజు, కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

మట్టి గణపతులనే పూజించండి

- సత్యనారాయణరెడ్డి



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

పర్యావరణ పరిరక్షణ కోసం మట్టి గణపతులనే పూజించాలని రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి కార్యదర్శి సత్యనారాయణరెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం సచివాలయంలో మట్టి వినాయకులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతుగా చేయూతను అందజేయాలని కోరారు. రసాయనాలతో కూడిన గణపతుల వల్ల కాలుష్యం పెద్ద ఎత్తున పెరిగిపోతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. గణపతుల నిమజ్జనం అనంతరం కొన్ని రోజుల వరకు వాటి వ్యర్థాలను తొలగించలేని పరిస్థితి ఉంటుందని చెప్పారు. రసాయనాల వల్ల చెరువులు, కుంటలు కలుషితం అవుతున్నాయన్నారు. కాలుష్యాన్ని వెదజల్లే పరిశ్రమలపై నిరంతరం నిఘా కొనసాగుతోందని తెలిపారు.

సంపాదకీయం

తలాఖ్ తీర్పు



మూడు సార్లు వెంట వెంటనే తలాఖ్ చెప్పి విడాకులిచ్చే ప్రక్రియ ఏకపక్షం, రాజ్యాంగ విరుద్ధమంటూ అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన మెజార్టీ తీర్పు స్వాగతించదగినది! దేశ జనాభాలో ఎనిమిది శాతానికి పైగా ఉన్న ముస్లిం మహిళలకు ఈ తీర్పుతో కొంత మేరకైనా భరోసా లభిస్తుంది. షరియత్ నిబంధనలను అడ్డగోలుగా ధిక్కరించే వారి జోరుకు కళ్లెం పడుతుంది. జీవితంలో అత్యంత ముఖ్యమైన వైవాహిక బంధాన్ని మూడు మాటలు చెప్పి ఏకపక్షంగా తెంచుకోవడం అత్యంత ఘోరమైన అంశం. అందునా ఈ ప్రక్రియలో మహిళల అభిప్రాయానికి ఇసుమంత విలువైనా లేకపోవడం, అసలు వారి మాట వినక పోవడం అత్యంత అన్యాయం. ఇటీవల సెల్‌ఫోన్లు, వాట్సప్‌లు, స్కైప్‌ల ద్వారా కూడా తలాఖ్ చెప్పి విడాకులిచ్చేస్తున్నా రంటే.. పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు! ఈ కారణం చేతనే ముస్లిం మహిళల్లో మూడుసార్లు వెంట వెంటనే తలాఖ్ చెప్పే పద్ధతి పట్ల తీవ్రమైన వ్యతిరేకత నెలకొంది! భారతీయ ముస్లిం మహిళా ఆందోళన్ సంస్థతో పాటు సైరాబానో, ఇష్రత్ జహాన్, గుల్షన్ పర్వీన్, ఆఫ్రీన్ రహమాన్, అతియాసబ్రీ తదితర మహిళలు సుప్రీంకోర్టును ఆశ్రయించారన్నా, వారికి ఐద్వా వంటి ప్రగతిశీల మహిళా సంఘాల మద్దతు లభించిందన్నా, ఈ విధానంలో ఉన్న అమానవీయతే కారణం. సుప్రీం కోర్టు తాజా తీర్పు వీరందరి సమిష్టి పోరాట ఫలితమే!


> **సమాజంలో అణగారిపోతున్న మహిళలే దీనికి సమిధలవుతున్నారు. మతాలతో సంబంధం లేకుండా నానాటికీ పెరుగుతున్న ఈ తరహా ధోరణి పట్ల అభ్యుదయ వాదులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మత దురాచారాలను తిరస్కరించడం ఎంత ముఖ్యమో, మానవ సంబంధాలను నట్టేట కలుపుతున్న ఈ తరహా విధానాలపైనా సమిష్టిగా పోరాటం చేయడం అంతే ముఖ్యం!**

మతపరమైన భావోద్వేగాలతో కూడుకున్న సున్నితమైన అంశం కావడంతో సుప్రీం తీర్పుపై ఉత్కంఠ నెలకొంది. దీనికి తగ్గట్టుగానే ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం సైతం ఏకోన్ముఖంగా తీర్పు ఇవ్వలేకపోయింది. జస్టిస్ కురియన్, జస్టిస్ లలిత్, జస్టిస్ నారిమన్ ఇచ్చిన మెజార్టీ తీర్పులో మూడు సార్లు తలాఖ్ చెప్పడాన్ని రాజ్యాంగ విరుద్ధమని స్పష్టంగా ప్రకటించారు. మైనార్టీ తీర్పు ఇచ్చిన ప్రధాన న్యాయమూర్తి జెఎస్ ఖేహార్, ఎస్. అబ్దుల్ నజీర్ దీనికి భిన్నమైన గళం వినిపించారు. రాజ్యాంగంలో మతస్వేచ్ఛను పేర్కొన్న ఆర్టికల్ 25ను, న్యాయ వ్యవస్థ నిగ్రహావసరాన్ని వివరించిన ఆర్టికల్ 142ను ప్రస్తావిస్తూ, వీరు ఆరునెలల్లో చట్టం తీసుకురావాలని కేంద్ర ప్రభుత్వానికి నిర్దేశించారు. అయితే, మెజార్టీ తీర్పు ఇచ్చిన న్యాయమూర్తులు దీనిని తోసి పుచ్చడంతో 'మూడుసార్లు వెంట వెంటనే తలాఖ్ చెప్పడాన్ని రద్దు చేస్తున్నాం' అంటూ ప్రధాన న్యాయమూర్తి తీర్పును ప్రకటించారు.

మతం పేరుతో సాగుతున్న ఛాందస పద్ధతులను రూపు మాపడంలో కోర్టు తీర్పులు, ప్రభుత్వ చట్టాలది పరిమితమైన పాత్రే అనడానికి ఉదాహరణలు ఎన్నో ఉన్నాయి. చట్టం చేసి ఎన్నో ఏండ్లు గడిచినా సమాజంలో ఇంకా వేళ్లూనుకుని ఉన్న వరకట్న దురాచారమే దీనికి ప్రత్యక్ష ఉదాహరణ! తలాఖ్ రద్దుకూ ఈ గతి పట్టకూడదంటే ప్రజలను చైతన్య పరచడం చాలా అవసరం. తరతరాలుగా ఎదుర్కొంటున్న అవమానాలు, పడుతున్న బాధలతో ముస్లిం మహిళా సమాజంలో తలాఖ్ పట్ల వ్యతిరేకత నెలకొన్నప్పటికీ దాన్ని క్షేత్ర స్థాయికి తీసుకు వెళ్లి, ముస్లిం మహిళలను ఏకోన్ముఖం చేయగలిగే ఉద్యమం కావాలి. ముస్లిం సమాజంలో అంతర్గతంగా సంస్కరణోద్యమం ఎంతో అవసరం. పొరుగున అనేక దేశాలు ఈ దారుణ కృత్యం నుండి ఎలా విముక్తి సాధించాయో వివరించాలి. మహిళల హక్కుల పట్ల సమాజంలో సానుకూల భావజాలాన్ని వ్యాపింపజేయాలి. దీనికి భిన్నంగా సాగితే, అది మరో తీవ్రమైన సమస్యకు దారి తీసే ప్రమాదం ఉంది! నరేంద్ర మోడీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం ఈ దిశలో చిత్తశుద్ధితో కృషి చేస్తుందనుకోవడం అత్యాశే. మైనార్టీల హక్కులపై దాడి చేస్తూ, మెజార్టీ ప్రజల ఓటు బ్యాంకు కోసం వెంపర్లాడే విధానాలే ఈ సందేహాలకు కారణం. సుప్రీం కోర్టు తీర్పును ఆసరాగా తీసుకుని 'ఒకే ప్రజ.. ఒకే చట్టం' వంటి వివాదాస్పద అంశాలను మోడీ సర్కారు ముందుకు తెచ్చినా ఆశ్చర్యపడాల్సిన అవసరం లేదు. తలాఖ్‌పై న్యాయ సమీక్ష జరపాలని సుప్రీంను కోరడం వెనుకా ఇటువంటి విభజన రాజకీయాలున్నాయన్న విమర్శలు ఈ సందర్భంగా ప్రస్తావనార్హం. హిందూ మహిళల పట్ల ఆర్ఎస్ఎస్ ఛాందస ధోరణి అనుసరిస్తూ, మరోవైపు ముస్లిం మహిళల పట్ల ప్రేమ ఒలకబోయటమే ఇక్కడ గమనించాలి. చట్టసభల్లో మహిళా రిజర్వేషన్ బిల్లును సైతం నిరాకరించటం కూడా గమనార్హం. మరోవైపు ముస్లిం మహిళలు, మహిళా సంఘాల పోరాటంతో సుప్రీం కోర్టు ఇచ్చిన తాజా తీర్పును కూడా మోడీ ఖాతాలోకి వేయడానికి ఆయన వందిమాగధులు చేస్తున్న ప్రయత్నాలు కూడా కేంద్ర సర్కారు చిత్తశుద్ధిని ప్రశ్నించేవే!

ఆర్థిక సరళీకరణ విధానాల కారణంగా కుటుంబ వ్యవస్థ చిన్నాభిన్నమౌతోంది. పెరిగిన భారం, ఒత్తిడి కారణంగా చిన్న చిన్న కారణాలతో విడాకులు తీసుకుంటున్న వారి సంఖ్య గణనీయంగా పెరుగుతోందని ఇటీవలి సర్వేలు పేర్కొంటున్నాయి. సమాజంలో అణగారిపోతున్న మహిళలే దీనికి సమిధలవుతున్నారు. మతాలతో సంబంధం లేకుండా నానాటికీ పెరుగుతున్న ఈ తరహా ధోరణి పట్ల అభ్యుదయ వాదులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మత దురాచారాలను తిరస్కరించడం ఎంత ముఖ్యమో, మానవ సంబంధాలను నట్టేట కలుపుతున్న ఈ తరహా విధానాలపైనా సమిష్టిగా పోరాటం చేయడం అంతే ముఖ్యం!

ముఖ్యమంత్రులు సామంతులు కాదు.. రాష్ట్రాలు కేంద్రం జాగీర్లు కావు..



తెలకపల్లి రవి

స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా త్రిపుర ముఖ్యమంత్రి మూడుసార్లు సీనియర్, నిరాడంబరతకు మారుపేరు మాణిక్ సర్కార్ ప్రసంగ ప్రసారానికి ప్రసార భారతి అడ్డు తగిలింది. ఆయన ప్రసంగాన్ని చెప్పినట్టు మార్చాలని లేదా తొలగించాలని నిర్దేశించింది. ఒక ముఖ్యమంత్రినే అంత తేలిగ్గా కొట్టిపారేస్తూ ప్రసార భారతి వ్యవహరించిందంటే కేంద్ర ప్రభుత్వ ఆశీస్సులతో ఆదేశాలతోనే ఇలా చేసిందని స్పష్టమవుతోంది. మన్ కీ బాత్ పేరుతో ప్రధాని మోడీ నచ్చినట్టు అప్పటికప్పుడు మాట్లాడేందుకు అవకాశమిచ్చే ప్రసార భారతి చారిత్రాత్మకమైన స్వాతంత్ర్య దినోత్సవాన

> **అవకాశవాదులు నిబద్ధత లేని నీతిబాహ్య ముఖ్యమంత్రులూ ఎలాంటి విన్యాసాలైనా చేయొచ్చుగాని వాస్తవంలో ఇప్పుడు రాష్ట్రాల హక్కుల కోసం బీజేపీయేతర ప్రభుత్వాలన్నీ సంఘటితం కావలసిన అవసరం స్పష్టంగా కనిపిస్తుంది. లేకపోతే కేంద్రం రాజ్యాంగ దుర్వినియోగం, బీజేపీ రాజకీయ మాయోపాయాలు మరింత ముదిరిపోయి ముప్పుగా మారతాయి.**

ఒక ముఖ్యమంత్రికి ఆ అవకాశం ఇవ్వకపోవడం అంటే స్వతంత్ర పోరాట విలువలను పరిహసించడమే.. కాంగ్రెస్ నాయకత్వంలోని ముఖ్యమంత్రులు స్వాతంత్ర్యం రావడానికి పూర్వమే కేంద్రంలోని బ్రిటిష్ ప్రభుత్వ ప్రతినిధులుగా వున్న గవర్నర్ల ఆదేశాలు పాటించడానికి తిరస్కరించి రాజీనామాలు కూడా చేశారు. మన రాజ్యాంగానికి ప్రజాస్వామ్యం లౌకికతత్వం ఫెడరలిజం మూడు మూల సూత్రాలు. ఇప్పటికే భావ ప్రకటనా స్వేచ్ఛ మతసామరస్యం దాడికి గురవుతున్నాయి. ప్రజల తీర్పుతో ఏర్పడిన రాష్ట్ర ప్రభుత్వాల హక్కులను హరించే మూడవ దాడి మరింత ప్రమాదకరమైంది. వాటిని ఎన్నుకున్న కోట్లమంది ప్రజల హక్కులను హరించడమే.

టీమిండియా డ్రీమిండియానే

ప్రధాని మోడీ ఎప్పుడూ టీమ్ ఇండియా అంటూ క్రీడా భాషలో మాట్లాడుతుంటారు. నిజానికి ముఖ్యమంత్రులందరూ తన జట్టులో వున్నట్టు దానికి తానే కెప్టెన్ అయినట్టు అనుకోవడం అశాస్త్రీయం. వారు వారి రాష్ట్రాల కెప్టెన్లు. రాజ్యాంగం దేశాన్ని రాష్ట్రాల సమాఖ్యగా అభివర్ణించింది. 168వ అధికరణం వాటి పరిధిలో పాలన చేయడానికి శాసనసభలను సృష్టించింది. కేంద్ర రాష్ట్రాల మధ్య అధికారాలను స్పష్టంగా విభజించింది. దేశమంతటికీ సంబంధించిన రక్షణ విదేశీ వ్యవహారాలు కరెన్సీ, సమాచార సంబంధాలు, సుప్రీం కోర్టు, ఎన్నికల సంఘం, వంటివాటిని కేంద్రానికి అప్పగించి తక్షణ ప్రజా పరిపాలన శాంతిభద్రతల వంటివన్నీ రాష్ట్రాల చేతుల్లోనే వుంచింది. పార్లమెంటులో రాజ్యసభ ద్వారా రాష్ట్రాలకు ప్రాతినిధ్యం కల్పించింది. ఏ చట్టమైనా రాజ్యసభకూడా చర్చించి సూచనలు చేయొచ్చు. ఆర్థికేతర బిల్లులను తిరస్కరించవచ్చుకూడా. రాష్ట్రపతిని ఎన్నుకోవడంలోనూ రాష్ట్రాల సభలకు హక్కు వుంటుంది. అంతర్ రాష్ట్ర మండలిలో అన్ని రాష్ట్రాలూ చర్చించుకోవడానికి వీలుండేది. ఇవన్నీ కూడా జాతీయ వ్యవస్థలో రాష్ట్రాల భాగస్వామ్యాన్ని చెబుతాయి.

దీర్ఘకాలం పాలన చేసిన కాంగ్రెస్ రాష్ట్రాల హక్కులకు భంగం కలిగించి అనేక విధాల సంక్షోభాలు సృష్టించిన మాట నిజం. ఈ కుట్రకు తొలిగా బలైంది కేరళలో నంబూద్రిపాద్ ప్రభుత్వమే. కేరళ బెంగాల్‌లతో మొదలైన ఈ కుట్రలు తర్వాత ఇతర చోట్లకూ పాకి రాష్ట్రాలలో రాజకీయ సంక్షోభాలు పెరిగాయి. 1967లో వరుసగా రాష్ట్రాలలో కాంగ్రెసేతర ప్రభుత్వాలు ఏర్పడితే 1977 నాటికి కేంద్రంలోనే జనతా ప్రభుత్వం ఏర్పడింది. పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ ఓడిపోయిన రాష్ట్రాలలో శాసనసభలను రద్దు చేయడం ఆ క్రమంలోనే చూడాలి. అయితే అసలైన సంఘర్షణ 1980లో ఆమె మళ్లీ అధికారంలోకి వచ్చాకే మొదలైంది. ఆ దశకంలో అస్సాం, పంజాబ్, కాశ్మీర్‌లలో రాజకీయ కుట్రలూ కల్లోలాలూ రగిలాయి. ఏపీ, కర్ణాటక వంటి చోట్ల తెలుగుదేశం జనతా ప్రభుత్వాలు ఏర్పడ్డాయి. అఖండమైన మెజార్టీతో గెలిచిన ఎన్టీఆర్‌ను కూడా కేంద్రం కుట్రతో కూలదోయడం పెద్ద సంఘర్షణకు దారితీసి ఎన్నడూ లేని విధంగా ఆయన ప్రభుత్వాన్ని పునః ప్రతిష్టించవలసి వచ్చింది. అప్పుడే బెంగాల్‌లో జ్యోతిబాసు, కర్ణాటక రామకృష్ణ హెగ్డే, ఫరూక్ అబ్దుల్లా, ఎన్టీఆర్ తదితరుల చొరవతో వరుసగా ముఖ్యమంత్రుల సమావేశాలు జరిగాయి. పరిస్థితి గమనించిన కేంద్రం కూడా సర్కారియా కమిషన్ నియమించి రాష్ట్రాల హక్కులకు కొన్ని చర్యలు ప్రకటించింది.

బీజేపీ స్వభావమే అది

ఈ మొత్తం ప్రక్రియలో బీజేపీ పాత్ర లేదు. ఆనాడు కాంగ్రెసేతర లౌకిక పక్షాలే సమావేశమవుతుండేవి. స్వాభావికంగా బీజేపీ కేంద్రీకృత పాలన, అధ్యక్ష తరహా దేశంలో వంద రాష్ట్రాల ఏర్పాటు వంటి విధానాలు కోరుకుంటుంది. రాజ్యాంగం తిరగదోడేందుకు వాజ్‌పేయి ప్రభుత్వం ఒక సమీక్షా సంఘాన్నే నియమించింది. నిరసనల తర్వాత ఆ కమిషన్ సిఫార్సులు సూచనలు మాత్రమేనని సవరణ చేసింది. ఆ ప్రభుత్వ హయాంలో బీహార్ వంటి చోట్ల తప్పులు చేయబోతే నాటి రాష్ట్రపతి నారాయణన్ అడ్డుపడ్డారు. రాష్ట్రాలలోని అధికారాన్ని కూడా బీజేపీ మత రాజకీయాలకు ఉపయోగించింది. ఉత్తరప్రదేశ్‌లో వున్న రాష్ట్రాధికారాన్ని ఉపయోగించి అయోధ్య బాబరీ మసీదు కూల్చివేతకు అవకాశమిచ్చింది. వాజ్‌పేయి వుండగా గుజరాత్‌లో ఇదే మోడీ ప్రభుత్వ పరోక్ష ఆశీస్సులతో భయానకమైన జాతి హత్యాకాండకు పాల్పడింది. అంటే కేంద్రంలోనూ రాష్ట్రాలలోనూ కూడా బీజేపీకి రాజ్యాంగ విలువలపైన ఇసుమంత నమ్మకం లేదు. మోడీ ముఖ్యమంత్రిగా చేసి వచ్చినా సరే రాష్ట్రాల హక్కుల రక్షణ కంటే రాజకీయ ఆధిపత్య సాధనే ఏకైక సూత్రంగా పెట్టుకున్నారు. రాజకీయ కోణంలో తన అధ్యక్షుడు అమిత్ షాను ప్రయోగిస్తూ మరోవైపున కేంద్రం అధికారాన్ని రాష్ట్రాలపై రుద్దడం ప్రారంభించారు. ఉత్తరాఖండ్, అరుణాచల్ ప్రదేశ్‌లలో కాంగ్రెస్‌నుంచి ఫిరాయింపులను ప్రోత్సహించి అక్రమ మార్గంలో పెత్తనం చేజిక్కించుకోవడంలో కాంగ్రెస్‌ను మించిపోయారు. అవన్నీ సుప్రీం కోర్టులో బెడిసికొట్టినా సరే మొన్నటి అసెంబ్లీ ఎన్నికల తర్వాత గోవాలోనూ మిజోరాంలోనూ అధికారంలోకి రావడానికి అదే అనుచిత పద్ధతులకు పాల్పడ్డారు.. అయినా దెబ్బతిన్న చోట సీబీఐని లేదా ఇతర అధికారాలను ఉపయోగించి ప్రత్యర్థులపై వేట సాగిస్తున్నారు.



రాష్ట్రాలపై ద్విముఖ దాడి

మోడీ అధికారంలోకి రాగానే ప్రణాళికా సంఘాన్ని రద్దు చేసి రాష్ట్రాలకు నిధుల కేటాయింపును తమ గుప్పిట్లోకి తెచ్చుకున్నారు. నోట్లరద్దు వంటి అతి పెద్ద నిర్ణయంలో కూడా ముఖ్యమంత్రులను విశ్వాసంలోకి తీసుకోలేదు. జీఎస్‌టీ విషయంలో రాష్ట్రాలు ప్రతిపక్షాలు కూడా సహకారం అందించినా సరే తుది పన్ను రేట్లు నిర్ణయించేప్పుడు సంప్రదిస్తామన్న హామీని వమ్ము చేశారు. తమిళనాడులో జయలలిత అనారోగ్యాన్ని, మరణాన్ని అవకాశంగా తీసుకుని అన్నాడిఎంకె వర్గాలను అదుపులోకి తెచ్చుకున్నారు. (అక్కడ డిఎంకె కాంగ్రెస్‌తో వుంది గనక అన్నా డిఎంకెతో పొత్తు తప్పదు మరి) ఆంధ్రప్రదేశ్‌కు విభజన సమయంలో ఇచ్చిన ప్రత్యేక హోదా హామీని ఇతర కేటాయింపులను ప్రహసనంగా మార్చి వేయడమే గాక ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ప్రధాని ఇంటర్వ్యూ కూడా గగనమయ్యే పరిస్థితి తీసుకొచ్చారు. (ఇంకో వైపున వైసీపీని కూడా లోబర్చుకునే ప్రయత్నాలు జరిగాయి.) తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ మొదటినుంచి అన్నా డిఎంకె ఎంజీఆర్ తరహాలో కేంద్రంతో మంచిగా వుండాలనే సూత్రాన్ని పాటిస్తూ మోడీని పొగడ్డంలో బీజేపీనే మించిపోయినా కేటాయింపుల విషయంలో ఫిర్యాదులున్నాయి. కేరళలో పినరాయి విజయన్ ప్రభుత్వాన్ని చిక్కుల్లో పెట్టేందుకు గవర్నర్‌ను, సంఘ పరివార్‌ను కూడా ఉపయోగిస్తున్నారు. అక్కడ ఆరెస్సెస్ సీపీఐ(ఎం) ఘర్షణలను ఏకగ్రీవంగా చిత్రిస్తూ శాంతి భద్రతలకే భంగం చేస్తున్నారు. కేంద్ర మంత్రి అరుణ్‌జైట్లీ స్వయంగా పర్యటించి బెదిరింపు వాతావరణం సృష్టించారు. ఆగష్టు 15న స్వయంగా ఆరెస్సెస్ అధినేత మోహన్ భగవత్ నిబంధనలకు విరుద్ధంగా కేరళలో ఒక పాఠశాలలో జాతీయ పతాకం ఎగరేసి జనగణమనకు బదులు వందేమాతరం ఆలపించి వచ్చారు. త్రిపురలోనూ అటు బీజేపీలోకి ఫిరాయింపులు ఇటు ముఖ్యమంత్రినే అవమానించే ఘటనలు జరుగుతున్నాయి. ఇక ఎంతో సున్నితమైన కాశ్మీర్ అదుపు తప్పి పోవడానికి కారణమవడమే గాక రాజ్యాగంలో ఆ రాష్ట్రానికి ఇచ్చిన ప్రత్యేక నిబంధనలను కూడా తోసిపుచ్చుతున్నారు. తాము ప్రభుత్వంలో భాగస్వాములుగా వున్నా ఒక్కరోజు కూడా పాలనజరగని అప్రజాస్వామిక వాతావరణం రావడానికి కారణమైనారు. పరిమిత రాష్ట్రప్రతిపత్తి మాత్రమే వున్న ఢిల్లీ ప్రభుత్వాన్ని అడుగడుగునా వెంటాడుతూ దాదాపు మంత్రులందరినీ ఏదో ఒక కేసులో ఇరికించారు. హిమచల్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి వీరభద్ర సింగ్‌నూ పాత కేసుల్లో వేటాడ్డమే గాక శాంతి భద్రతల వైఫల్యం పల్లవి కూడా ఎత్తుకున్నారు. బీహార్‌లో తమతో వచ్చిన నితీశ్ కుమార్‌ను వదిలేసి లాలూ కుటుంబంపై కేసులనే నడిపిస్తున్నారు. మధ్యప్రదేశ్‌లో మూడు పర్యాయాలుగా కొనసాగుతున్న ముఖ్యమంత్రి శివాజీ సింగ్ చౌహాన్‌ను భయంకరమైన వ్యాపాం కుంభకోణంలో కనీసంగా విచారించకపోగా ముఖ్యమంత్రిగా కొనసాగుతారని ప్రత్యేకంగా ప్రకటించి భరోసా ఇచ్చారు. రాజస్థాన్ ముఖ్యమంత్రి వసుంధరా రాజేను కూడా లలిత్ మోడీ కేసులో ఇలాగే కాపాడారు. ఈ జాబితా ఇంకా చాలా వుంది.

రాష్ట్రపతి ఎన్నికల్లో ఓట్ల కోసం ఇతర ప్రభుత్వాల పట్ల వ్యూహాత్మకంగా మెతకవైఖరి చూపించిన బీజేపీ ఇప్పుడు ఆ అవసరం తీరాక ఎలా ప్రవర్తిస్తుందో తెలంగాణ రాజకీయాలు చూస్తే తెలుస్తుంది. ఈ ఒత్తిడికారణంగానే బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తాను అమిత్‌షాకు తప్ప ప్రధాని మోడీకి వ్యతిరేకం కాదని ప్రకటించారు. లోగడ కేసీఆర్ కూడా షాపైనే దాడి చేయడం మనకు తెలుసు. నితీశ్ మరోసారి ఎన్‌డీఏలో పునఃప్రవేశించారు. అవకాశవాదులు నిబద్ధత లేని నీతిబాహ్య ముఖ్యమంత్రులూ ఎలాంటి విన్యాసాలైనా చేయొచ్చుగాని వాస్తవంలో ఇప్పుడు రాష్ట్రాల హక్కుల కోసం బీజేపీయేతర ప్రభుత్వాలన్నీ సంఘటితం కావలసిన అవసరం స్పష్టంగా కనిపిస్తుంది. లేకపోతే కేంద్రం రాజ్యాంగ దుర్వినియోగం, బీజేపీ రాజకీయ మాయోపాయాలు మరింత ముదిరిపోయి ముప్పుగా మారతాయి. ■

మెయిల్ @ నవతెలంగాణ



జి. తిరుపతయ్య

పంద్రాగస్టు... జాతీయ పతాక

మదర్సాలలో పంద్రాగస్టునాడు జాతీయ జెండా ఎగురవేయాలనీ, జాతీయ గీతం ఆలపించాలని ఆ కార్యక్రమాన్ని వీడియో తీసి ప్రభుత్వానికి పంపించాలనీ యూపీ ముఖ్యమంత్రి యోగీ ఆదేశాలిచ్చారు. మదర్సాలన్నీ ప్రభుత్వ ఆధీనంలో నడుస్తున్నాయా? లేక ప్రభుత్వ సాయంతో(ఎయిడెడ్) నడుపబడుతున్నాయా? లేక ప్రభుత్వమేమైనా స్థలాలు కేటాయించి సహాయపడుతున్నాదా? వీటన్నిటికీ ఒకే సమాధానం ప్రభుత్వానికి సంబంధం లేకుండా ప్రయివేటుగానే ఈ మదర్సాలు నడుపబడుతున్నాయి. ప్రయివేటుగా నడుపబడుతున్నప్పటికీ, ఒక వేళ రాష్ట్ర విద్యాశాఖ పరిధిలో అనుమతులు పొంది నడిచినట్లయితే అన్ని స్కూళ్ళలానే వారూ నిబంధనలు పాటించాలి. ఒక వేళ ఈ మదర్సాలన్నీ ఒక ట్యుటోరియల్ లాగానో లేదా ఇంటి దగ్గర చెప్పే ట్యూషన్స్ లాగానో జరిగితే ఇదే తరహా మిగతా వాటికి వర్తించిన నిబంధనలే వర్తింపజేయాలి. దేశం మొత్తం మీద నిర్బంధంగా జాతీయ గీతాలాపన పాఠశాలల్లో మాత్రమే జరుగుతున్నది, ఇది అవసరం కూడా ఎందుకంటే జాతీయ భావన చిన్నతనాన అబ్బాలి. మిగాతా అన్ని రకాల ప్రయివేటు ప్రభుత్వ విద్యా సంస్థలు మొదలుకుని యూనివర్సిటీల దాకా ఎక్కడా జాతీయ గీతాలాపన రోజువారీ జరుగడం లేదు. కానీ పంద్రాగస్టు, గణతంత్ర దినోత్సవంనాడు మాత్రం విధిగా జరపడం ఆనవాయితీ. ఇలాంటి ఆనవాయితీ ఉన్నప్పుడు అన్ని సంస్థలను వదిలిపెట్టి కేవలం మదర్సాలకు ఆదేశాలివ్వటం వెనుక మతలబేమిటి? సరైన వివరణలు లేకుండా అకస్మాత్తుగా మదర్సాలపై విరుచుకు పడితే ప్రజలకు తప్పుడు సంకేతాలు వెళుతున్నాయి. ఇలా ఆదేశాల వల్ల మదర్సాలు దేశానికి వ్యతిరేకంగా పనిచేస్తున్నాయా! అనే అనుమానాన్ని రేకెత్తించి ప్రజల్లో ద్వేషపూరిత వాతావరణాన్ని నెలకొల్పుతున్నాయి.

హిందూ ధార్మిక సంస్థలు వేదపాఠశాలలు నిర్వహిస్తున్నాయి. సిక్కులు, క్రైస్తవులు జైనులు మొదలగు వారందరూ తమ తమ ఆచారాల ప్రకారం ప్రయివేటుగా బోధనలు జరుపుకుంటున్నారు. ఈ పాఠశాలలన్నింటిలోనూ జాతీయ జెండాలు ఎగురవేస్తున్నారా? రోజూ వేదమంత్రాలతో పాటు జాతీయ గీతాలాపన జరుగుతున్నదా? తనకొక నియమం ఇతరులకొకటా? రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్(ఆర్ఎస్ఎస్) శాఖలు నిర్వహిస్తున్నది, మానసిక శారీరక వ్యాయామాలను బోధిస్తూ ఉంటుంది, ప్రతి రోజూ వారు ప్రత్యేకంగా రూపొందించుకున్న ధ్వజ ప్రణామం, ప్రత్యేకంగా రాసుకున్న గీతాలాపన చేస్తారు. దీనికి రాజ్యాంగ అనుమతి ఉన్నదా?

జనగణమన, వందే మాతరం పాడటం దేశభక్తికి నిదర్శనం కాదు. నిజమైన దేశ భక్తుడు తన చట్టాలకు లోబడి అన్ని పన్నులు చెల్లిస్తాడు, చట్టాలను, రాజ్యాంగాన్ని గౌరవిస్తున్నట్టు తన విధుల ద్వారా తెలియజేస్తాడు, అవకాశవాదానికి ఎప్పుడూ దూరంగా ఉంటాడు, అవినీతికి హేయభావనకూ అవకాశమివ్వడు. ఈ కోవల్లోకి వచ్చేవారు చాలామంది వున్నారని ప్రధాని ఉపన్యాసాల్లో చెబుతుంటారు. రాష్ట్రాల అధికారంలో పాలుపంచుకునేందుకు హర్యానా, అరుణాచల్ ప్రదేశ్ మొదలుకుని బీహార్ వరకు వలసలను ప్రోత్సహిస్తూ మొన్న జరిగిన రాజ్యసభ ఎన్నికల్లో బహిరంగంగా ఎమ్మెల్యేలను వశపర్చుకోవడాలు నిజమైన దేశద్రోహం, అట్టాంటివారికి జాతీయగీతం వినిపించాలి. చెప్పేది భ్రష్టాచార్‌ని రూపు మాపాలనీ చేసేది పూర్తి భ్రష్టాచారమే. అందుకే ద్వేషాలు రేపే ఉద్దేశాలు దీర్ఘకాలంలో చాలా ప్రమాదం..

సెల్: 9951300016


ప్రజావాణి

సేవా కార్యకర్తలను గుర్తించాలి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు క్రీడారంగా నికే అధిక ప్రాధాన్యతనిస్తున్నాయి. క్రీడారంగంలో దేశానికి, రాష్ట్రానికీ మంచిపేరు తెస్తే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు లక్షల్లో నగదు ప్రోత్సాహంతో పాటు, ప్రభుత్వంలో భాగస్వామ్యం అయ్యేలా ఆయా రాష్ట్రాల వారు రాష్ట్రస్థాయి కేడర్ ఉద్యోగం ఇస్తున్నారు. అలాగే గ్రామీణస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి, దేశస్థాయికి అవసరమయ్యేలా సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తూ, ప్రభుత్వాలు ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరిస్తూ, నేటి సమాజానికి అవసరమయ్యే సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్న సామాజిక కార్యకర్తలకు కూడా ప్రభుత్వం అరుదైన గౌరవం ఇవ్వాలి. కేంద్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్న వారిని గ్రామీణ స్థాయిలో గుర్తించి అవార్డు అందజేయాలి. సామాజిక సేవలో అరుదైన గౌరవం లభించిన వారికి ఆయా రాష్ట్రాలు మంచి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలి. సామాజిక కార్యకర్తలను ప్రభుత్వంలో భాగస్వాములు చేసుకోవాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు తెలియజేస్తున్నాం.

గుండమల్ల సతీష్‌కుమార్, సంస్థాన్ నారాయణపురం.

డా॥ దేవులపల్లి రామానుజరావుకి శతజయంతి నివాళి




మోతుకూరు నరహరి

> **1943లో హైదరాబాద్‌లో ఆంధ్ర సారస్వత పరిషత్తు స్థాపన జరిగిన ఏడే వరంగల్‌లో సాహితీరంగ ప్రవేశం చేసిన రామానుజరావు 1944లో ఆంధ్ర సారస్వత పరిషత్తు కార్యవర్గ సభ్యులై, 1947లో ఉపాధ్యక్షులై, తరువాత కార్యదర్శులై ఆ తరువాత అధ్యక్షులై చివరి శ్వాసదాకా ఆ సంస్థను అన్నీ తానై నడిపించారు. 1953లో ఆలంపురంలో డా॥ సర్వేపల్లి రాధాకృష్ణ పండితుల సముఖంలో జరిగిన పరిషత్తు సభలకు రామానుజరావే కీలక పాత్రధారి.**

'పోయినోళ్ళు అందరూ మంచోళ్ళు' అని ఆత్రేయన్నారు గాని నిజానికి కొందరే మంచోళ్లు. అలాంటి వారిలో అగ్రశ్రేణిలో ఉండే రామానుజరావు వంటి వారిని కేవలం స్మరించుకోవడమే కాదు వారి ఆశయాలను ఆచరణలో పెట్టే ప్రయత్నాలు చేయాలి. వారి కృషిని కొనసాగించాలి. 'సమయం లేదు' అనేమాట విస్తృతంగా వింటున్నాం. ఎవరికైనా 24 గంటలే. మన సమయాన్ని, కాలాన్ని మనం నియంత్రించుకోవాలి. రకరకాల ప్రలోభాల, అర్థం పర్థం లేని ప్రభావాల ప్రవాహాల్లో పడి కొట్టుకుపోకుండా మనకు మనమే నిలదొక్కుకుని, లక్ష్యాలను నిర్ణయించుకుని, వాటిని సాధించడానికి అహరహం కృషి చేయాలి. అందుకు అక్షరదీపం, రామానుజరావు శతజయంతి ప్రత్యేక సంచిక వంటి పుస్తకాలు, బహుముఖీన కృషీవలుడైన వీటి కథా నాయకుడు పథప్రదర్శకులుగా, స్ఫూర్తివంతంగా తోడ్పడుతారు. ఈ సదవకాశాన్ని ఉపయోగించుకోవడం యువతరం బాధ్యత.

శాంతినికేతనంలో రవీంద్రనాథ్ టాగూర్‌కి ప్రత్యక్ష శిష్యులైన రాయప్రోలు వారితోపాటు రాజకీయాల్లోనూ అగ్రశ్రేణిలో కొనసాగిన డా॥ బెజవాడ గోపాలరెడ్డితో దీటుగా పని చేసిన వారు రామానుజరావు. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమిలో ఉర్దూకు కూడా అవకాశం కల్పించడమే కాక ఉర్దూ సాహితీ, సాంస్కృతిక సంస్థల్లోనూ నాయకత్వ స్థానంలో ఉండి పని చేయడం, చేయించడం రామానుజరావుకే చెల్లింది. తెలుగు - సంస్కృత సాహిత్యాల్లో దిగ్దంతులైన పుట్టపర్తి నారాయణా చార్యులు, మధునాపంతుల సత్యనారాయణశాస్త్రి, వేలూరి శివరామశాస్త్రి, కాళోజీ సోదరులు, రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ వంటి వారితో పాటు గుర్రం జాషువా వంటివారి అభిమానాన్ని కూడా చూరగొన్న వారు రామానుజరావు. గడియారం రామకృష్ణశర్మ రామానుజరావు కుడిభుజం. కులం, మతం, ప్రాంతం, భాష, యాస పేరుతో సమాజం, సాహితీవేత్తలు చీలికలు, పీలికలవుతున్న ఈ తరుణంలో రామానుజరావు కార్యరంగం ఎంత విస్తృతమైందో, వైరుధ్యపూరితం కాక వైవిధ్యభరితమో చూస్తే ఆశ్చర్యం వేస్తుంది; ఆనందం వెల్లివిరుస్తుంది. ఈ విధంగా విభిన్న రాజకీయ, సాహిత్య ధోరణులకు చెందిన అగ్రశ్రేణి నాయకులను సాహిత్య, సాంస్కృతిక రంగాల్లో కలిపి పనిచేయించిన, చేసిన అసాధారణులు రామానుజరావు. కేంద్ర ప్రభుత్వం ఉస్మానియా విశ్వవిద్యాలయాన్ని స్వాధీనం చేసుకొని హిందీ విశ్వవిద్యాలయంగా మార్చడానికి చేసిన ప్రయత్నాన్ని ఎదుర్కొని జనబలంతో గెలిచిన వారి వ్యక్తిత్వం నేటి భావితరాలకు నిరంతర స్ఫూర్తిదాయకంగా ఉంటుంది. తెలుగువారి ఐక్యతను ఆకాంక్షించిన, అందుకు కృషి చేసిన రామానుజరావు తన ఆశయానికి భిన్నంగా 'గోలకొండ పత్రిక' నడుస్తున్నందుకు దాని నుండి ఏమాత్రం గుంజాటన లేకుండా తప్పుకోవడం - దానిలో వందల సంఖ్యలో సంపాదకీయాలు రాసి కూడా - రామానుజరావు సూత్రబద్ధ వైఖరికి నిదర్శనం.



నాకు, తమ్ముడు చంద్రశేఖర్ కు మాత్రమే తెలిసిన ఒక విశేషం చెప్పితీరాలి. ఆంధ్రప్రదేశ్ శాసనసభలో 1956 నుంచి 1967 దాకా ప్రతిపక్ష కమ్యూనిస్టు పార్టీ నాయకులుగా పనిచేసిన పుచ్చలపల్లి సుందరయ్య 1964 నుంచి 1977 దాకా సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శిగా కలకత్తాలో ఉన్నారు. దేశంలో అత్యవసర పరిస్థితి ముగిసిన తరువాత 1978లో జరిగిన శాసనసభ ఎన్నికల్లో తిరిగి మన రాష్ట్ర శాసనసభకు ఎన్నికయ్యారు. ఆరోజుల్లో వారు తరచుగా పుస్తకాలు కొనడానికి సారస్వత పరిషత్తు పుస్తక విక్రయశాలకు వచ్చేవారు. ఒకసారి వచ్చి కొన్ని పుస్తకాలను ఎంపిక చేసుకున్నారు. వారి రాకను గమనించిన నేను రామానుజరావుకి ఆవిషయం చెప్పి వారిని పరస్పరం పరిచయం చేశాను. "వారు తెలియకపోవడం ఏమిటి?" అని ఇద్దరూ అన్నారు ఏకకాలంలో. ఇద్దరూ రాజ్యసభ సభ్యులుగా పనిచేసినవారే. సుందరయ్య తాము ఎంపిక చేసుకున్న పుస్తకాలకు డబ్బు ఇవ్వడానికి "బిల్లు ఇవ్వండి" అన్నారు అక్కడి ఉద్యోగిని. "మీ వంటి వారు డబ్బులు ఇవ్వడం ఏమిటి? ఇవి మీకు మా కానుక" అన్నారు రామానుజరావు. "నేను ఉచితంగా తీసుకోను. వీరైతే ఇతరులకు తగ్గించినట్టే తగ్గించి బిల్లు ఇవ్వండి" అన్నారు సుందరయ్య. రామానుజరావు కాస్త బాధపడ్డట్టు గమనించిన సుందరయ్య "రామానుజరావుగారూ! మీరు చేస్తున్నది పుస్తకాల వ్యాపారం కాదనీ, సాహిత్య సేవ, ప్రచారం అనీ నాకు తెలుసు. మీరు బాధపడవద్దు. పుస్తకాలు ఉచితంగా ఇస్తూపోతే కొత్త పుస్తకాలు వేయడానికి డబ్బు ఎట్లా? అందుకని డబ్బు తీసుకొండి. ఇది నా ఆర్థిక సహకారం అనుకోండి. కొత్త కొత్త పుస్తకాలు వేస్తూ మీ కృషిని కొనసాగించండి. నా సహకారం మీకు ఎప్పుడూ ఉంటుంది" అన్నారు. దానితో రామానుజరావు ప్రసన్న చిత్తులయ్యారు. సుందరయ్య డబ్బు ఇచ్చి పుస్తకాలు తీసుకుని రామానుజరావు నుంచి వీడుకోలు తీసుకొని వెళ్ళిపోయారు. అదీ ఆ ఇద్దరు మహానుభావుల వ్యక్తిత్వం, ఔన్నత్యం, పరస్పర గౌరవం. సాహిత్యం పట్ల వారికి గల ఆసక్తి, నిబద్ధత, ముందుచూపు. రామానుజరావుతో సన్నిహితంగా, వారి గొడుగుకింద రెండు దశాబ్దాలు (1974-93) పని చేయగలగడం నాకు ఆనందప్రదమైన, అనుభవపూర్ణమైన కాలం. వారి 70వ జన్మదినపు కానుకగా 1986లో చైతన్య సాహితీ సమాఖ్య వారు వెలువరించిన విలువైన 'అక్షరదీపం' గ్రంథాన్ని 2015లో మిత్రులు కొండా లక్ష్మీకాంతరెడ్డి ద్వితీయ ముద్రణ చేసినప్పుడు ఆ కృషిలోను, ఇప్పుడు రామానుజరావు శతజయంతి ప్రత్యేక సంచిక ప్రచురణలోనూ యథాశక్తిగా పాలుపంచుకోగలగడం నాకు సంతృప్తి కలిగించిన, వారిని స్మరించుకునే అవకాశం కలిగిన సందర్భాలు.

బహు భాషావేత్తలూ, ఉన్నత విద్యావంతులూ అయిన రామానుజరావు ఏనాడూ ఆధిక్య ప్రదర్శనను చేసేవారు కారు. వారు వ్యాసకర్త, సాహిత్య విమర్శకులు, గోలకొండ దినపత్రికా సంపాదకీయ రచయితలూ అయినా ప్రధానంగా కవితా హృదయం కలవారు. అందుకు వారి 'పచ్చతోరణమే' నిలువెత్తు నిదర్శనం. మహాకవి దాశరథి కృష్ణమాచార్యులవారు చెప్పినట్లుగా రామానుజరావుకి "ఉచ్ఛ్వాసంబైనను, నిశ్వసించుటయినన్ సర్వంబు సాహిత్యమే".

రామానుజరావు ఈనాడు భౌతికంగా మనమధ్య లేకపోయినా వారి సాహిత్య సేవ, యశఃకాయం మనందరి మధ్య - తెలుగునేల అంతటా - సుదీర్ఘకాలం వరకు వ్యాపించే ఉంటాయి. "జయంతి తే సుకవినో - రస సిద్ధాః కవీశ్వరాః - నాస్తితేషాం యశం కాయే- జరామరణజం భయం". తెలుగు సాహిత్య దీపధారి, వైతాళికుడు డా.దేవులపల్లి రామానుజరావుకి వారి శతజయంతి సందర్భంగా నివాళి, కైమోడ్పు.

సెల్: 8464980540

తలాక్..తలాక్..తలాక్... ఏండ్ల నుంచి ముస్లిం మహిళల కుటుంబ జీవితాలను చిద్రం చేస్తున్నది. మరో అభిప్రాయానికి తావు లేకుండా ముమ్మార్లు తలాక్ చెప్పి, బంధాలను వదిలించుకుని మగవాళ్ళు హాయిగా కాలం గడుపుతున్నారు. మతాన్ని అడ్డుపెట్టుకుని ఇష్టం వచ్చినట్టు విడాకులు ఇచ్చేస్తున్నారు. దీన్ని సవాలు చేస్తూ మొదటి సారి ముస్లిం మహిళలు బయటకు వచ్చారు. తమ గొంతు విప్పారు. చివరకు సుప్రీంకోర్టు తలుపుతట్టారు. కోర్టు స్పందించింది. ఏండ్ల పోరాటం ఫలించింది. ట్రిబుల్ తలాక్ చెల్లదంటూ తీర్పు ఇచ్చింది. ఆరునెలల్లో దీనిపై పార్లమెంటులో చట్టం తేవాలని ప్రభుత్వానికి సూచించింది. కోర్టుతీర్పుపై మహిళల స్పందనలు ఎలా ఉన్నాయో తెలుసుకుందాం...

పోరాటం ఫలించింది

ఇకపై చెల్లదు



ఉత్తరాఖండ్ ఉద్దమ్‌సింగ్‌నగర్ జిల్లాకు చెందిన షయారా బానో 2002లో అలహాబాద్‌కు చెందిన రియల్‌ఎస్టేట్ వ్యాపారి రిజ్వాన్ అహ్మద్‌ను వివాహం చేసుకుంది. భర్త ఈమెను నిరంతరం వేధించేవాడు. అదనపు కట్నం కోసం హింసించేవాడు. 2015 అక్టోబర్‌లో పుట్టింట్లో ఉన్న ఆమెకు ఉత్తరం ద్వారా మూడు సార్లు తలాక్ చెప్పి ఇద్దరు పిల్లల్ని బలవంతంగా తీసుకెళ్ళిపోయాడు. ఇలా విడాకులు ఇవ్వడానికి వ్యతిరేకంగా బానో సుప్రీంకోర్టు తలుపు తట్టారు.

❀❀❀

ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన గుల్షన్ పర్వీన్‌కు 2013లో వివాహం అయ్యింది. ఈమెకు రెండేండ్ల కుమారు ఉన్నాడు. భర్త పర్వీన్‌ను ఇనుమరాడ్డుతో కొట్టి హింసించేవాడు. ఓసారి ఈమె పుట్టింట్లో ఉండగా పది రూపాయల స్టాంప్ పేపర్‌పై భర్త పంపించిన తలాక్‌నామాను సవాల్ చేస్తూ యూపీలోని సుప్రీంకోర్టును ఆశ్రయించారు.

❀❀❀

2014లో సయ్యద్ ఆల వార్సీని జైపూర్‌కు చెందిన ఆఫ్రీన్ రెహ్మాన్ పెండ్లి చేసుకున్నారు. పెండ్లయిన రెండు నెలల తర్వాత కట్నం కోసం అత్త మామల వేధింపులు మొదలయ్యాయి. చివరకు 2015 సెప్టెంబర్‌లో ఆమెను ఇంటి నుంచి గెంటేశారు. పుట్టింట్లో ఉన్న ఈమెకు 2016 జనవరిలో స్పీడ్ పోస్ట్ ద్వారా విడాకులు పంపాడు. భర్త నుంచి విడిపోవడం తనకు ఇష్టం లేదని ఆమె సుప్రీం కోర్టులో పిటిషన్‌ను దాఖలు చేశారు.

ఇలా ట్రిబుల్ తలాఖ్‌కు వ్యతిరేకంగా మహిళలు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. అలాగే సుప్రీంకోర్టు న్యాయవాది ఫరా ఫైజ్ కూడా ఈ పిటిషనర్లలో ఒకరు. షరియత్ చట్టం కింద ముస్లిం మహిళలకు భద్రత ఉన్నా ఖురాన్‌లో లేని ట్రిపుల్ తలాక్, నిఖా హలాలాకు పర్సనల్‌లా బోర్డు మాత్రం ప్రాధాన్యతమిస్తోందని ఆమె అభ్యంతరం వ్యక్తంచేశారు. ఇంకా అతియా సాబ్రీతోపాటు భారతీయ ముస్లిం మహిళా ఆందోళన్ (బీఎంఎంఏ) పిటిషన్ వేశారు.

చట్టం చేస్తేనే తీర్పుకు మనుగడ



తలాక్ అంశం ప్రత్యేకమైనదేమీ కాదు. మిగతా అన్ని మతాలలో ఉన్న విడాకుల తరహాలోనే ఇదికూడా. ఇస్లామిక్ పద్ధతులను కచ్చితంగా పాటించేవారు తలాక్ జోలికి వెళ్ళరు. వెళ్ళినా తలాక్ అహసాన్, తలాక్ హసన్ పద్ధతులనే పాటిస్తారు. తలాక్ ఎ బిద్దత్ అనేది ఇస్లాం స్థాపన తరువాత కొందరి స్వార్థానికి అమలులోకి వచ్చిన ఒక పద్ధతి. ఇప్పుడు అభ్యంతరం కూడా ఈ పద్ధతి పైనే. అసలైన ఇస్లాం పద్ధతులైన తలాక్ అహసాన్, తలాక్ హసన్‌లపై ఎవరికీ ఏ అభ్యంతరమూ లేదు. రాజ్యాంగపరంగా రూపొందిన విడాకుల చట్టంలోనూ ఈ పద్ధతులే కనిపిస్తాయి మనకు. తలాక్ ఎ బిద్దత్ ఏకపక్షమైన చర్య. ఇందుకు సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు స్వాగతనీయమే. కానీ ఆరు నెలలు మాత్రమే ఈ విధానాన్ని రద్దు చేస్తే తరువాత పరిస్థితి ఏమిటి? పర్యవసానాలు ఏ విధంగా ఉండబోతున్నాయి అనే అంశాలను పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంది. ట్రిపుల్ తలాక్ అనే దానికంటే తలాక్ ఎ బిద్దత్‌కు బాధితులు కోర్టుకు వెళ్ళేదాకా వేగంగా స్పందిస్తూ, ముస్లిం మహిళలకు న్యాయం అందిస్తామని ప్రకటనలు గుప్పించిన కేంద్ర ప్రభుత్వం చట్టం చేసే విషయంలో ఎందుకు నిర్ణయం తీసుకోలేకపోయింది? ఆరు నెలల పాటు మాత్రమే రద్దులో ఉండే తలాక్ ఎ బిద్దత్‌ను ఆ తరువాత కూడా పూర్తిగా రద్దు చేయాలి.

విడాకులు రద్దు చేస్తేనే లింగ సమానత్వమా?

సుప్రీం కోర్టు తీర్పు వెలువడిన వెంటనే అదేదో ముస్లిం మహిళలకు ఇక సమస్యలే ఉండవన్న తీరులో హర్షం వ్యక్తం చేశారు చాలామంది. స్వాగతించాల్సిన తీర్పే కావచ్చు. కానీ, ట్రిపుల్ తలాక్‌తో మాత్రమే మహిళలకు న్యాయం జరుగుతుందనుకోవడం పొరపాటు. సమానత్వం వస్తుందనుకోవడం అవివేకం. ఇస్లాంలో మహిళలు కూడా తమ భర్తలకు విడాకులు ఇవ్వొచ్చు. దానిని ఖులా అంటారు. మహిళే స్వయంగా విడాకులు తీసుకుంటే భర్తల నుంచి ఎలాంటి ప్రయోజనాలు అందవు. పైగా ఈ నిర్ణయం కూడా పురుషుడి ఇష్టంపైనే ఆధారపడి ఉంటుంది. తలాక్ ఎ బిద్దత్ ఇవ్వడం ఎలా పురుషస్వామికమో, ఖులా కూడా పూర్తిగా పురుషుడి ఇష్టమే. భార్య ఖులా ఇవ్వమని భర్తని అడగాలే తప్ప స్వయంగా భర్త మూడుసార్లు ఏ విధంగా తలాక్ చెప్తాడో ఆ విధంగా భార్య చెప్పలేదన్నమాట. ఈ విషయంపై కోర్టు తీర్పులో అసలు ప్రస్తావనే లేదు. దీనినెలా ముస్లిం మహిళలకు అందిన వరమని చెప్పాలి? అనేకానేక సమస్యలలో తలాక్ ఎ బిద్దత్ ఒక సమస్య అని మాత్రమే చెప్పవచ్చు.

అరబ్ షేక్‌లపై నిఘా పెట్టాలి

అరబ్ దేశాల నుంచి ఇండియాకు వస్తున్న షేక్‌లపై నిఘా పెడితే చాలా వరకు కోర్టుకు రాని విడాకులు కూడా అంతమైపోతాయి. స్థానికంగా విడాకులు తీసుకునే వారి సంఖ్య ప్రభుత్వం ప్రచారం చేసినస్థాయిలో ఉండదు. చాలామంది షేక్‌లు కేవలం ఇక్కడి అమ్మాయిలను పెండ్లి చేసుకుని వారానికో, నెలకో విడిచిపెట్టి లేదా తలాక్ ఎ బిద్దత్ చెప్పి వెళ్ళిపోతుంటారు. వాళ్ళు ఏ దేశం నుంచి వచ్చిన సంగతి కూడా పట్టించుకోనంత అజ్ఞానం నిండి ఉంది చాలామంది తల్లిదండ్రులలో. ఫలితంగా వందల సంఖ్యలో యువతీ,యువకులు ఇప్పుడు దారీతెన్నూ లేని పరిస్థితులలో ఉన్నారు. నిజంగా కేంద్రం ముస్లింల సంక్షేమాన్ని బాధ్యతగా స్వీకరిస్తే అరబ్ షేక్‌లు విడిచి పెట్టిన భార్యలకు, వారి పిల్లలకు ఏదైనా మార్గం సూచించాలి.

-నస్రీన్ ఖాన్, సీనియర్ జర్నలిస్ట్



ఆహ్వానించాల్సిందే...

ట్రిపుల్ తలాక్‌పై సుప్రీం తీర్పు ఆహ్వానించదగినదే. ముస్లిం మహిళల జీవితంలో ఒక ముందడుగుగా భావించాలి. ఇన్ని తరాలుగా ఎవరూ పట్టించుకోని దారుణమైన ఒక ఆచరణకు తెరపడటం సంతోషకరమైన విషయం. ఈ విషయంలో మహిళల, మహిళా సంఘాల అభిప్రాయాలు తీసుకోవడం మంచిది. మత సంఘాల్లో పురుసాధిపత్యం ఉంటుంది. మహిళల గురించి సానుకూలంగా చెప్పే అవకాశం లేదు. కాబట్టి మహిళల అభిప్రాయాలనే సేకరించాలి. ఈ సమస్యతో పాటు విడాకుల తరువాత పిల్లలకు సంబంధించిన విషయమై చర్చ జరగాలి. విడాకుల తరువాత ముస్లిం మహిళల పరిస్థితి అగమ్య గోచరం. దీనిపైనా చర్చ జరగాలి. అరబ్‌షేక్‌లతో నిఖాలు ఇంకా కొనసాగుతున్నాయి. దీనిపైన చర్చ జరగాలి. ఈ సమస్యకు పరిష్కార మార్గం అన్వేషించాలి. పేద ముస్లిం బాలికలకు విద్య అనేది ప్రధాన సమస్యగా ఉంది. విద్య కార్పోరేట్ అయిపోయిన నేపథ్యం.. ప్రభుత్వ పాఠశాలలో సౌకర్యాల లేమి వంటి పరిస్థితుల్లో ఉచిత విద్యనందించే ఏర్పాట్లు మరింతగా చేస్తే ఇంకా బాగుంటుంది.

- షాజహానా, కవి, రచయిత



ఆచరణ ముఖ్యం...

నిజానికి ఇన్‌స్టంట్ ట్రిపుల్ తలాక్‌ను ఇస్లాం ఎప్పుడూ రికమండ్ చేయదు. అది ఒక తప్పుడు ఆచరణ. ఇస్లాం పూర్తిగా తెలియకపోవడం వల్ల, అవగాహన లేకపోవడం వల్ల, లేదా తప్పించుకోవడానికి ఓ తప్పుడు మార్గంగా దాన్ని దుర్వినియోగం చేశారు. 2002లో షయారా బానో కేసులో సైతం సుప్రీంకోర్టు ఇదే తీర్పును ఇచ్చింది. ఇది కొత్త తీర్పు ఏం కాదు. ఎన్ని చట్టాలు వచ్చినా, ఎన్ని తీర్పులు వచ్చినా... అవి ప్రాక్టీస్‌లో లేకపోతే దండగ. దీనికోసం ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు, వక్ఫ్‌బోర్డ్ అన్ని కలిసి కృషి చేస్తే బాగుంటుంది. గతంలో తీర్పు వచ్చినా దాన్ని ప్రజల్లోకి తీసుకు వెళ్లడంలో విఫలమయ్యారు. అందుకే ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలన్నీ కలిసి దీనిపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. ఇలాంటి తప్పుడు ప్రాక్టీస్‌లు కేవలం ముస్లింలలోనే లేవు. హిందువుల్లో బాల్య వివాహాలు జరగకూడదని ఉంది. అయినా బాల్యవివాహాలు కొనసాగుతన్నాయి. మిస్ ప్రాక్టీసింగ్ ప్రతి దగ్గరా జరుగుతున్నది. అది జరగకుండా చూడటానికి ప్రభుత్వం కృషి చేయాలి. ప్రజల్లో జవాబుదారీతనం పెరగాలి.

- ఖలీదా పర్వీన్, యాక్టివిస్ట్

అమలయ్యేలా చూడాలి



కోర్టు తీర్పు స్వాగతించాలి. 250 పేజీల జడ్జిమెంట్ ఇచ్చారు. మెత్తం చదివిన తర్వాతనే స్పందించగలం. ఈ మధ్య కాలంలో మెసేజ్‌లు, స్పీడ్ పోస్ట్‌లు, ఫోన్లు, వాట్సాఫ్‌ల ద్వారా కూడా తలాక్ చెప్పేస్తున్నారు. ఇలా విడాకులు తీసుకోవడం ఖురాన్‌లో గాని, షరియత్‌లో గానీ ఎక్కడా లేదు. అందుకే ఐద్వాగా మేం ఎప్పటినుంచో దీనికి వ్యతిరేకంగా పని చేస్తున్నాం. ముస్లిం మహిళల హక్కులను పరిరక్షించాలి, వారిలో అవగాహన కల్పించడం కోసం ఎన్నో సెమినార్లు కూడా పెట్టాం. అందుకే ఈ తీర్పు ముస్లిం మహిళలకు రిలీఫ్. అయితే కోర్టు ఆరు నెలల్లో చట్టం తీసుకురావాలన్నది. ఇప్పటి వరకు వరకట్న నిషేధ చట్టం, 498ఏ లాంటివి వచ్చావి. ఇవి ఏమాత్రం పని చేస్తున్నాయో చూస్తూనే ఉన్నాం. పైగా 498ఏకు తూట్లు పొడుస్తున్నారు. సవరణలను వ్యతిరేకిస్తూ దీనిపై ఐద్వాగా కేసు ఫైల్ చేశాం. ఇప్పటి వరకు వచ్చిన చట్టాలని డబ్బు, పలుకుబడి ఉన్న వారి స్వార్థానికే ఉపయోగపడుతున్నాయి. అందుకే చట్టాలు తీసుకొస్తే సరిపోదు. అవి అమలు జరిగే విధంగా ప్రభుత్వాలు బాధ్యత తీసుకోవాలి. అప్పుడే మహిళలకు న్యాయం జరుగుతుంది.

- సమీన అఫ్రోజ్, మైనార్టీ సెంట్రల్ సబ్ కమిటీ సభ్యులు(ఐద్వా)

సమానత్వం కావాలి



ట్రిపుల్ తలాక్‌పై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నాం. దీనిపై పార్లమెంట్‌లో చట్టం తీసుకువచ్చే సమయంలో కొన్ని సవరణలు చేయాలి. ప్రస్తుతం అమలులో ఉన్న ముస్లిం వివాహ చట్టం 1937లో రూపొందించారు. దీని ప్రకారం ముస్లిం మగవారు విడాకులు కావాలంటే మూడుసార్లు తలాక్ అని చెప్పాలి. అయితే ఇది ఒకేసారి కాకుండా మూడు పర్యాయాలుగా జరగాలి. ఇప్పుడు కమ్యూనికేషన్ వ్యవస్థ అభివృద్ధి చెందడంతో ఫోన్‌లోనూ.. వాట్సాప్‌లోనూ తలాక్ అని మూడుసార్లు చెప్పి వివాహబంధాన్ని వదిలించుకుంటున్నారు. భర్త అభిప్రాయంతో కాని, పిల్లల బాధ్యతలో కాని, పెద్దవారి మాటలతో కాని ప్రమేయం లేకుండా కొంతమంది ప్రవర్తిస్తున్నారు. నిజానికి ముస్లిం వివాహచట్టం ప్రకారం విడాకులు తీసుకోవాలంటే ముందుకా ఖాజీకి తెలియచేయాలి. ఇరువైపుల కుటుంబ పెద్దలను సంప్రదించాలి. ఇవేవి లేకుండా తలాక్ చెప్పి మహిళల జీవితాలను రోడ్డున పడేస్తున్నారు. కొత్త చట్టంలో ముస్లిం మహిళలకు రక్షణతో పాటు లింగ సమానత్వం కూడా ఉండాలి. కలిసి జీవించలేనప్పుడు ఇద్దరి పరస్పర అంగీకారంతో విడాకులు మంజూరు చేయాలి. భర్తకు ఒక రకమైన విధానం, భార్యకు మరోరకమైన విధానం కాకుండా లింగ సమానత్వం ఉండాలి.

- జమీలా నిషాత్, సామాజిక కార్యకర్త

- మానవి డెస్క్

నోరూరించే ఉండ్రాళ్ల పాయసం...

గసగసాల వాసన... పచ్చి కొబ్బరి తురుము... బెల్లం పాకం... ఒక్కటేమిటీ నోరురూరించే పదార్థాలు చాలా ఉంటాయి. ఒక్కసారి తింటే చాలు పిల్లలు, పెద్దాలు ఫిదా కావల్సిందే ! అద్భుతమైన రుచిలో వేడి వేడిగా పూర్ణం కుడుములు, కజ్జికాయలను పిల్లలకు చేసిపెట్టండి. ఎంతో ఇష్టంగా లొట్టలేసుకుంటూ తింటారు.

పూర్ణం కజ్జికాయలు...



కావలసినపదార్థాలు : బెల్లం–ఒక కప్పు, బియ్యాపు పిండి–ఒక కప్పు, పచ్చి కొబ్బరి తురుము–ఒక కప్పు, నెయ్యి రెండు చెంచాలు, ఉప్పు–చిటికెడు.

తయారీ విధానం : ముందుగా బెల్లాన్ని, పచ్చి కొబ్బరిని తురిమి పక్కన పెట్టుకోవాలి. తర్వాత స్టవ్ మీద పాత్ర పెట్టి నీరు మరిగించుకోవాలి. నీరు మరుగుతుంటే చిటికెడు ఉప్పు, బియ్యపు పిండి వేసి ఉండలు కట్టకుండా కలుపుతూ ఉండాలి. బియ్యపు పిండి మెత్తగా, చపాతీ పిండి మాదిరి అయిన తర్వాత పక్కన పెట్టుకోవాలి. ఆ తర్వాత స్టవ్ మీద మరో పాత్ర పెట్టుకోవాలి. పాత్ర కొంచెం వేడి కాగానే బెల్లం తురుము తీగ పాకం వచ్చే వరకు కలుపుతూ ఉండాలి. దాంట్లోనే నెయ్యి, పచ్చి కొబ్బరి తురుము, జీడి పప్పు, బాదం పప్పు కలుపుకుంటే సరిపోతుంది. ఈ పూర్ణాన్ని పక్కన పెట్టుకోవాలి. ఆ తర్వాత కజ్జికాయ పాత్ర అంచులకు నెయ్యి రాసుకొని బియ్యపు పిండిని పెట్టుకొని దాని లోపలి భాగంలో పూర్ణం పెట్టుకొని 15 నిమిషాలు ఉడికించుకుంటే కజ్జికాయలు రెడీ !

పూర్ణం కుడుములు...



కావలసిన పదార్థాలు : శనగ పప్పు–ఒక కప్పు, బియ్యాపు పిండి–ఒక కప్పు. నూనె–వేయించుకోవటానికి, పచ్చి కొబ్బరి–మూడు చెంచాలు, బెల్లం–నాలుగు చెంచాలు, యాలకులు–రెండు చెంచాలు, నెయ్యి–రెండు చెంచాలు, ఉప్పు–చిటికెడు.

తయారీ విధానం : ముందుగా శనగ పప్పును శుభ్రంగా కడగాలి. శనగ పప్పులో మూడు కప్పుల నీరు పోసి కుక్కర్‌లో అర గంట పాటు ఉడించుకోవాలి. అలాగే మరొక పాత్రలో రెండు కప్పుల నీరు, ఒక చెంచా నెయ్యి, చిటికెడు ఉప్పు వేసుకొని నీళ్ళు మరిగించుకోవాలి. నీళ్ల బాగా మరుగుతుంటే దాంట్లో బియ్యపు పిండిని వేసి ఉండలు లేకుండా చిక్కగా కలుపుకోవాలి. ఈ పిండిని చల్లారే వరకు పక్కన పెట్టుకోవాలి. ఆ తర్వాత పప్పును మెత్తగా గ్రైండ్ చేసుకోవాలి. స్టవ్ మీద మరో పాత్ర పెట్టుకొని బెల్లం, కొద్దిగా నీరు పోసుకొని బెల్లాన్ని కరిగించుకోవాలి. ఇది చిక్కగా పాకం అయ్యాక రెండు చెంచాల యాలకుల పొడి, గ్రైండ్ చేసుకున్న శనగ పప్పు, ఒక కప్పు పచ్చి కొబ్బరి తురుము వేసి బాగా కలుపుకోవాలి. దీన్ని రెండు నిమిషాల పాటు ఉడికించుకోవాలి. ఇది చల్లారక లడ్డుల్లా తయారు చేసుకోవాలి. తర్వాత ముందుగా ఉడికించుకున్న బియ్యపు పిండిని మెత్తగా చేసుకోవాలి. పిండికి నెయ్యిరాసుకొని గుండ్రంగా చేసుకొని దాంట్లో పూర్ణం పెట్టి గుండ్రంగా చుట్టూకొని కుక్కర్లో పెట్టుకొని ఉడికించుకుంటే సరిపోతుంది.

తెలుగు వారి అనార్కలీ..



అంజలీదేవి
(ఆగస్టు 24, 1927 - జనవరి 13, 2014)

Women of the day

పౌరాణిక పాత్రల్లో నటించి ప్రేక్షకులను మెప్పించిన తెలుగు సినిమా నటులు చాలా మందే ఉన్నారు. కృష్ణుడి పాత్ర అనగానే.. ఎన్.టి.రామారావు, శకుని పాత్ర అనగానే ధూళిపాళ, నారదుడి పాత్ర అనగానే కాంతరావు గుర్తుకు వస్తారు. అలాగే సీతదేవి అనగానే అంజలీదేవి గుర్తుకు వస్తారు. అభినవ సీతమ్మగా ప్రేక్షకులలో గుర్తింపు పొందారు. తొలితరం తెలుగుసినిమా హీరోయిన్‌గా కీర్తించబడ్డారు. నిర్మాతగా పలు సినిమాలను ప్రేక్షకులకు అందించారు. దాదాపు 500 తెలుగు, తమిళ, కన్నడ చిత్రాలలో ఆమె నటించారు.

అంజలీదేవితూర్పు గోదావరి జిల్లా, పెద్దాపురంలో జన్మించారు. ఆమె పేరు అంజనీ కుమారి. సినిమా రంగంలోకి వచ్చిన తర్వాత ప్రముఖ దర్శకుడు సి. పుల్లయ్య ఆమె పేరును అంజలీ దేవిగా మార్చారు. నాట్యం కూడా నేర్చుకున్న ఆమె నటిగానే కాకుండా నిర్మాతగా కూడా రాణించారు. ఆమె భర్త పి.ఆదినారాయణరావు తెలుగు సినీరంగంలో ప్రముఖ సంగీత దర్శకుడు.

1936లో 'రాజా హరిశ్చంద్ర' సినిమాలో చిన్న పాత్రతో సినీరంగానికి అంజలీదేవి పరిచయమయ్యారు. ఆ తరువాత 'కష్టజీవి' సినిమాలో నాయికగా నటించారు. 'లవకుశ'లో ఎన్.టి. రామారావు సరసన నటించిన సీత పాత్ర ఆమెకు మంచి పేరు తెచ్చిపెట్టింది. ఆ సినిమా విడుదలైన తర్వాత అంతా ముఖ్యంగా గ్రామీణ ప్రజలు ఆమెను సీతమ్మగా ఆరాధించారు. సీత పాత్ర అప్పటి గ్రామీణ మహిళలను బాగా ప్రభావితం చేసింది. సినిమా విడుదల తర్వాత ఆమె కొన్ని గ్రామాలను సందర్శించడానికి వెళితే కొంతమంది ఆమెను నిజమైన సీతాదేవిగా భావించి మోకరిల్లిన సందర్భాలున్నాయి. ఎక్కడ కనిపించినా.. అదిగో సీతమ్మ అంటూ అభిమాన ప్రేక్షకులు పలుకరించిన సంఘటనలు చాలా ఉన్నాయని ఆమె ఒక వార్తా పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పారు. సువర్ణసుందరి, అనార్కలి ఆమెకు బాగా పేరు తెచ్చిన సినిమాలు. బందావనం (1992), అన్న వదిన (1993) పోలీస్ అల్లుడు (1994) ఆమె నటజీవితంలో చివరి చిత్రాలు.

నిర్మాతగా..

హీరోయిన్‌గా నటిస్తూన్నే ఆమె సినీ నిర్మాణ రంగంలోనూ అడుగుపెట్టారు.

అక్కినేని నాగేశ్వరరావు హీరోగా, తాను హీరోయిన్‌గా నటించిన అనార్కలి (1955) సినిమాకు ఆమె నిర్మాత. ఆ తరువాత భక్త తుకారాం (1973), చండీప్రియ (1980) సినిమాలకు కూడా నిర్మాతగా వ్యవహరించారు. చండీప్రియలో జయప్రద నాయికగా శోభన్ బాబు, చిరంజీవిలతో నటించారు. అంజలి నిర్మాతగా 27 సినిమాలను ప్రేక్షకుల ముందుకు తీసుకువచ్చారు.

సినీరంగానికి చేసిన సేవలకు గాను అంజలీ దేవి 2006లో రామినేని ఫౌండేషన్ వారి విశిష్ట పురస్కారం, 2007లో మాధవపెద్ది ప్రభావతి అవార్డును అందుకున్నారు. .

పెట్టుబడి గ్రంథం ప్రాధాన్యత




బి.వి. రాఘవులు

- 10 -

(సోమవారం తరువాయి భాగం)

ఫెటిసిజం అనే మాటకు మనవాళ్లు తెలుగులో ఏం ట్రాన్స్‌లేట్ చేశారో.. ఫెటిసిజం అంటే దాన్ని ఈ రకంగానే అర్థం చేసుకోండి. వాస్తవాన్ని మరుగు పర్చే లక్షణం. భ్రమ పెట్టే లక్షణం. ఇది చాలా కీలకమైన విషయం పెట్టుబడి అసలు లక్షణం ఎలా మరుగు పరుచుద్దో డబ్బు అసలు లక్షణం ఎలా మరుగు పర్చుద్దో, వేతనం ఎలా మరుగుపర్చుద్దో అన్నీ చెబుతాడు. అలాగే అదనపు విలువకూడా ఇంకో మరుగుపర్చే విషయాన్ని చెప్పాడు. లాభం ఎక్కడి నుండొస్తుందీ.. పెట్టుబడిదారుడు ఇందాక చెప్పానే ఎక్కవ తక్కువలు అందుకని వచ్చేసినయ్. ఇంకోటి చెబుతాడు పెట్టుబడిదారుడు చాలా జాగ్రత్తగా పెట్టుబడిదారుడు పొదుపు చేయడం వల్ల వాడికి లాభం వస్తుందని అంటాడు. మీరు పొదుపుచేయండీ..మీ దగ్గర లాభం వస్తుందా చూడండి. మనకు జీతం వస్తుంది. ఈ రోజు 10 రూపాయలు పొదుపు చేశా. రేపు పది రూపాయలు పొదుపు చేస్తా. చేస్తానే ఉంటా. ఈలోపు చస్తాం ఏమవుద్ది. నువు పొదుపు చేసిన డబ్బులే దాంట్లో ఉంటయి. నేను ఆ పొదుపు చేయకుండా బిర్యానో.. తిన్నానను కోండి నా దగ్గర డబ్బులుండవు. నాకూ నీకూ తేడా ఏంటి నేనే కాస్త బెటర్‌గా అదీ ఇది తిన్నాను. నేనే కాస్త అనుభవించి చచ్చాను అనుకోవచ్చు. ఏముందీ పొదుపు చేసి..కాబట్టి పొదుపు ద్వారా పెట్టుబడి రాదు. పెట్టుబడి లాభం రాదు. వాళ్లూ పొదుపు చేసిందానికి ఎప్పుడొస్తది. వాళ్లు దాన్ని పెట్టుబడిగా పెట్టి ఇంకోన్ని ఎవర్నో కూలీగా పెట్టుకొని వాళ్లు పనిచేయడం మొదలు పెట్టిన తర్వాత మీ పెట్టుబడి పిల్లలు పెట్టడం ప్రారంభమవుద్ది. కాబట్టి ఎంత పొదుపు చేసినా ఆ పొదుపు పెట్టుబడిగా మారాలంటే నువు శ్రామికున్ని పెట్టుకొని ఉత్పత్తి చేస్తేనే అది ఇక్కడ క్వాంటిటేటివ్ చేంజ్ అంటాము. రూపాయి రూపాయి పెడితే పెట్టుబడి అయిపో దు. నేను రోజూ రూపాయి రూపాయి పొదుపు చేసి విమానాల కంపెనీ పెడతానం టే కుదరదు. ఆ వంద రూపాయలతో నువు బజ్జీల కొట్టుకూడా పెట్టలేవేమో. కాబట్టి ఏ పెట్టుబడిగా పెట్టాలన్నా ..పెట్టుబడి ఒక పరిమాణం దాకా చేరిన తర్వాతే అది పెట్టుబడిగా దాని గుణం మా రుద్ది. ఆ పరిమాణాత్మక మార్పు లేకుండా మారదు. ఇప్పు డు ఈ పెట్టుబడి దారులకు ఆ పరిమాణాత్మక మార్పు సాధించేదానికి మన ప్రభుత్వాలు ఉపయోగపడుతాయి. నువు పది రూపాయలు తీసుకురా..నేను 90 రూపాయలు ఇస్తాను. నువు 100 రూపాయలేసుకొని ఫ్యాక్టరీ పెట్టు. అందుకని పెట్టుబడిదారుడికి పరిమాణాత్మకమైన సహాయం చేసి వారిని నిజమైన పెట్టుబడిదారునిగా మార్చే పని రాజ్యం చేస్తున్నది. ప్రారంభంలో రాజ్యమే చేసిందాపని. ఇప్పుడు కూడా రాజ్యమే చేస్తున్నది. నేను చెప్పేది పెట్టుబడి రావాలంటే ఏదో డబ్బులు సంపాదించుకునేది కాదు.

కార్మికులను పనిలో పెట్టుకుని ఇందాక చెప్పినట్టు వాళ్లను అదనంగా ఉత్పత్తి చేసింది ఉచితంగా తీసుకుంటేనే పెట్టుబడితో నిరంతరం డబ్బులు పుడ్తయి. ఇది కనబడదు మనకు. లాభం ఎక్కడ వస్తుందంటే ఎక్కువ తక్కువలకు అమ్ముకోవడం వల్ల వస్తదని చెబుతారు. లేకపోతే నేను పొదుపు చేసుకున్నాను కాబట్టి లాభం వస్తదంటాడు. కానీ ఈ లాభమనేది..ఈ వడ్డీ అనేది..అలాగే భూస్వామికి కౌలొస్తది. మీకు ఇల్లు అద్దెకిస్తే వా డికి రెంటు వస్తది. ఇవన్నీ కూడా.. ఇవి డబ్బు రూపంలో ఉండొచ్చు. డబ్బు రూప మంటే సరుకుల రూపమే కదా .. వాటికి కొనే శక్తి ఉంటుంది కదా..ఇవన్నీ కార్మికు డు ఉత్పత్తి చేసిన అదనపు విలువల్ని వాటాల్ని పంచుకోవడం తప్ప అవన్నీ బయ టేమీ లేవు. దీన్ని ట్రినిటీ ఫార్ములా అని చెప్పేసి అంటాం. ట్రినిటీ ఫార్ములా అంటే లాభం, జీతం అలాగే కౌలు. ఈ మూడింటినీ కలిపి పెట్టుబడిదారులు చెప్పేదేంటం టే పనిచేసినందుకు జీతం వస్తుంది. పెట్టుబడి పెట్టినందుకు లాభం వస్తుంది. భూమిని కౌలుకిచ్చినందుకు లాభం వస్తుంది. కాబట్టి ఎవరి పనికి వాళ్లకు ప్రతిఫలం వచ్చింది. దీంట్లో ఎవ్వడి మోసం లేదు. అందరూ అన్నదమ్ముల్లాంటి వాళ్లు. అందరూ మొగుడూ పెళ్లాం లాంటోళ్లు. కాబట్టి అందరూ సామరస్యంగా ఉంటే ఇదీ.. సిద్ధాంతం. ఇవాళ మనకు మొగుడూ పెళ్లాల సినిమాలొచ్చినయి. ఒకసారి పెట్టుబడిదారీ పెళ్లామైతే.. కార్మికుడు మొగుడైతే ఇట్లాంటి సినిమాలొచ్చినయ్. అబ్బా కొడుకుల సినిమాలు కూడా వచ్చినయి. ఈ సినిమాలన్నీ వేటిమీద ఆధారపడ్డాయి. ఈ మూడూ పెట్టుబడికి లాభం వస్తుంది. పనిచేస్తే జీతమొస్తుంది.



భూమికి కౌలొస్తుంది. అసలు వాడికి భూమి ఎందుకొచ్చింది. ఎట్లొచ్చింది. మా తాతకు భూముంది. నేనేం చేశాను. నాకెందుకొచ్చింది. భూమి నేనెందుకు కౌలు పొందుతున్నాను. అసలు ఆ తాతకు భూమెక్కడి నుండి వచ్చింది. ప్రకృతి ఏమైనా ఇచ్చిందా కట్ట. లేకపోతే ఇప్పుడు చంద్రబాబు ఇచ్చినోళ్లందరికీ భూములొచ్చేస్తున్నయి. ఏం బెట్టి ఇచ్చాడు. వీడికి 500 ఎకరాలు, వాడికి వెయ్యి ఎకరాలు, వాడికి రెండొందల ఎకరాలు ఏ శ్రమ పెట్టి, ఏ కష్టపడితే వాడికి భూమొచ్చింది. ఆ భూమి రాగానే వాడికి కౌలొచ్చేస్తుంది. ఎట్లా వస్తుంది. అంతకు ముందు నువు ఒక ఆస్తున్న కుటుంబంలో పుట్టగానే నీకు కౌలొచ్చేస్తుంది. కాబట్టి ఆర్థిక వ్యవస్థతో సంబంధంలేదు ఆ కౌలుకీ. లాభానికీ నేను మీ ఇంటికొచ్చేసి ఓ లక్ష రూపాయలు దొంగతనం చేసి తీసుకొచ్చేస్తే నాక్కూడా వచ్చేస్తుందిగా? లాభం అంటే దొంగతనం చేసినా లాభమొచ్చేస్తుంది. దోపిడీ చేసినా లాభమొచ్చేస్తుంది. కూలీ చేసినా లాభమొచ్చేస్తుంది. భూములు కబ్జా చేసినా లాభమొచ్చేస్తుంది. ఇంకా ఆర్థిక వ్యవస్థ ఎందుకు.. అందరూ కలిసి దొంగతనాలూ, దోపిడీలూ ఇవన్నీ చేస్తే సరిపోద్ది..లాభాలొచ్చేస్తయి కదా. ఇందులో నీది నాకూ, నాది నీకూ మార్పిడి చేయడం తప్ప అదనపు ఉత్పత్తి రాదు. అదనపు ఉత్పత్తి రావాలంటే అదనపు విలువ రావాలి. ఆ అదనపు విలువలోంచే దొంగతనం చేసినా దోపిడీ చేసినా ఇంకోటి చేసినా భూమి కౌలుకిచ్చినా..నేను వడ్డీకిచ్చినా ఇవన్నీ అక్కడి నుండి భాగాలు పంచుకోవడమే. సమస్యేంటంటే, పనిచేసే వాళ్లు తక్కువైపోయి, భాగాలేసుకునేవాళ్లు ఎక్కువైపోయారనుకో..ఇప్పుడదే జరుతున్నది. కాబట్టి నేను ఇక్కడ చెప్పేదేంటంటే లాభానికీ, కౌలుకీ వీటన్నింటికీ పునాది ఎక్కడుంది. వీటికి పునాది ఎక్కడుందంటే.. ఈ కార్మికుడు ఉత్పత్తి చేసే అదనపు విలువలో ఉంది. ఇది కూడా ఒక మభ్య పెట్టడం..కనబడకుండా మనకు బూర్జువా ఆర్థిక వేత్తలు చెబుతారు. ఈ కనబడకుండా ఉంచే లక్షణం పెట్టుబడిదారులకుంది. దీన్ని అర్థం చేసుకోవడం పెట్టుబడి గ్రంధాన్ని అర్థం చేసుకోవడం ఓ ముఖ్యమైన విషయమని మీ దృష్టికి తీసుకొస్తున్నాను. ఇక చివరి అంశమేంటంటే ఇపుడు మనం ఒక ప్రత్యేకమైన పరిస్థితుల్లో ఉన్నాం.

(తరువాయి భాగం సోమవారం సంచికలో..)

ప్రభుత్వరంగాన్ని కాపాడుకుందాం



ఎస్. నర్సింహారెడ్డి

స్వాతంత్ర్యం అనంతరం ప్రభుత్వ రంగ సంస్థలను స్థాపించుకొని ఆర్థిక స్వాలంబన సాధించాలని కేంద్ర నెహ్రూ ప్రభుత్వం నిర్ణయించింది. 1955లో 5 పరిశ్రమలను ఏర్పరచింది. 2016 సం॥ కొచ్చేసరికి 244 సంస్థలు ఆపరేషన్‌లో ఉన్నాయి., ఇం కా 76 పరిశ్రామలను ఏర్పా టుకై ప్రయత్నం జరుగుతుం డగా, కీలకరంగాలైన Steel, Oil, coal, heavy industry, defance, forma, electronics & Communication రంగాలలోనే కాకుండా Banki ng, Insurance రంగాలలో కూడా గణనీయమైన వృద్ధి సాధించి ఎమ్ఎన్‌సీలకి దీటుగా అభివృద్ధి చెందాయి.

గత కొంత కాలంగా ప్రపంచ వ్యాప్తంగా వస్తున్న ఆర్థిక మాంద్యాలను తట్టుకున్న ఘనత సీపీఎస్‌యూలదే అని చెప్పక తప్పదు. దేశంలో 1991 వరకు 24లక్షల ఉద్యోగులున్నారు. కానీ సంస్కరణల పేరుతో 2016 వరకు కేవలం 12లక్షల 34వేలకి కుదించబడ్డవి. మన దేశ ప్రజల అవసరాలకనుగుణంగా గుండు సూదినుంచి అంతరిక్షం వరకు ఉత్పత్తులు చేస్తూ దిన దినాభివృద్ధి చెందినవి. వీటిని ఓర్వలేక దేశీయ, విదేశీ గుత్త సంస్థలు గత యూపీఏ, ప్రస్తుత ఎన్‌డీఏ ప్రభుత్వాల ద్వారా సీపీఎస్‌యూలను భూస్థాపితం చేయాలని పూనుకున్నాయి.

సీపీఎస్‌యూలు భారతదేశ ఆర్థిక స్వావలంబననే కాకుండా, రక్షణ & రవాణ, కమ్యునికేషన్ రంగాలలో గణనీయంగా అభివృద్ధి చెంది భారత ప్రజలకు ఎనలేని సేవ చేస్తున్నాయి. ప్రతి సంవత్సరం భారత ఖజానాకి ఆదాయం చేకూరుస్తున్నాయి. ఇప్పటికే స్వయం సమృద్ధి చెందిన Oil, coal, heavy Industry Banking, Insurance, Communication & defance రంగాలు ఇంకా దేశ అవసరాలకై దేశం నలుమూలల విస్తరించి ప్రజల అవసరాలను ఉత్పత్తి చేస్తానంటుంటే, వీటిని అదుపు చేసి ప్రైవేట్ పరం చేయాలని ప్రభుత్వం యోచిస్తున్నది.

244 సీపీఎస్‌యూలు ఉత్పత్తిలో ఉన్నవి. 76 నిర్మాణ దశలో ఉన్నవి. ఇందులో 166 సీపీఎస్‌యూలు లాభాలతో నడుస్తున్నాయి. 78 పరిశ్రమలు కొంత నష్టాలలో ఉన్నాయి. మొత్తంగా గత సం॥ వీటి మొత్తం లాభాలు 1,44,523 కోట్లుకాగా, పన్నుల రూపంలో కట్టేది 2,00,593కోట్లు. డెవిడెండ్ల రూపంలో 70,954కోట్లు, విదేశీ మారకద్రవ్యం తెచ్చేది 1,03,071కోట్లు. పైమొత్తం పరిశ్రమల టర్నోవర్ 18,54,667కోట్లతో నడుస్తుంటే వీటిని కారు చౌకగా అమ్మివేయాలని చూడడం విడ్డూరం. ఈ చర్యను ప్రతి ఒక్కరు వ్యతిరేకించాలి.

ఇల్లాంటి బంగారు బాతులను 1991నుండి సంస్కరణల పేరుతో బలిచేస్తున్నాయి. ఇప్పడికే 2,55,810 కోట్లు పెట్టుబడుల ఉపసంహరణ రూపంలో కేంద్ర ఖజానాకు చేర్చుకున్నది. ఇది చాలక సీపీఎస్‌యూలు తమ అభివృద్ధి కోసం కూడబెట్టుకున్న రిజర్వు నిధులను బైబ్యాక్ పాలసీ పేరుతో కంపెనీల ఖజానా నుండి కేంద్రం మళ్లించుకోవడం దారుణం. ఇప్పటికే 26788కోట్లు మళ్లించడం ద్వారా ఆయా పరిశ్రమలు ముడి సరుకు కొనుక్కోవడానికి డబ్బు లేక ఉత్పత్తులలో జాప్యం జరుగుతున్నది. ఇప్పటికే అతి చౌకగా అమ్మిన 33 సీపీఎస్‌యూల ద్వారా 5426కోట్లు మాత్రమే ఖజానాకు చేరినవంటే ఎంత చౌకగా అమ్మారో తెలుసుకోవాలి. ఇవేకాకుండా కోల్ ఇండియా మరియు కీలకరంగాలైన, రక్షణ సీపీఎస్‌యూల రిజర్వులను మళ్లించాలనే ఆదేశాలను జారీ చేయడం సిగ్గుచేటు.

ఎయిర్ ఇండియా లాంటి సంస్థని చౌక ధరకే అమ్మివేస్తామని మన ఆర్థిక మంత్రి చెప్పడం లజ్జాకరం. ప్రభుత్వ విధానాల వలన లేదా ప్రభుత్వం ఎయిర్ ఇండియా వాడుకోవాడానికి అయిన ఖర్చులు తిరిగి ఆ సంస్థకి చెల్లించకపోవడంతో 2014-15 వరకు నష్టాలలో పడింది. కానీ 2015-16 వచ్చేసరికి 105కోట్లు నిర్వహణ లాభాలతో లాభాలలోకి వచ్చింది. కేవలం 50వేల కోట్లు అప్పుమాత్రమే ఉన్నది.

కీలక రంగాల పరిస్థితి చూస్తే, ఏ రోజైనా ప్రయివేటు పరంకావచ్చు అనేవి ఈ కింద చూడండి.

HPCL-49% ఉపసంహరణ	IOC-42% ఉపసంహరణ
BPCL-45% ఉపసంహరణ	SAIL-25% ఉపసంహరణ
BHEL-38% ఉపసంహరణ	COAL-21% ఉపసంహరణ
BEL-32% ఉపసంహరణ	NTPC-31.26% ఉపసంహరణ
ONGC-32% ఉపసంహరణకు ప్రయత్నం చేస్తున్నది.	


ఆదాయం 20,526కోట్లు 2015-16న జనరేటు చేసింది. ఈ సంస్థని ప్రయివేట్ పరంచేస్తే ఎన్‌డీఏ / బీజేపీ మంత్రులు విదేశాలలో డబ్బు కూడబెట్టుకోవచ్చనే దుర్బుద్ధితో ఉన్నారు. ఎఫ్‌డీఐ పేరుతో విదేశీ గుత్తసంస్థలని భారత కీలక రంగాలలో అనుమతినిచ్చి దేశ స్వావలంబనకు, స్వాతంత్ర్యానికి తీరని లోటు తెస్తున్నది. రక్షణ సంస్థలో 100% ఎఫ్‌డీఐని అనుమతించడమంటే దేశ ద్రోహానికి పాల్పడినట్టే !

కేంద్రం ప్రభుత్వం ఈ విధానాలను వ్యతిరేకిస్తున్న కార్మిక వర్గంపై కక్షపూరితంగా వ్యవహరించడం సరైందికాదు. ఈ విధానాలను వ్యతిరేకిస్తూ 1991 నుండి 2016 డిసెంబర్ వరకు 17దేశ వ్యాపిత సమ్మెలు కార్మికులు చేయడం జరిగింది. పాలక పార్టీల వెనకనున్న ఐఎన్‌టీయూసీ / బీఎంఎస్‌లు కూడా ఈ విధానాలను వ్యతిరేకిస్తున్నాయి. అయినా ప్రభుత్వం మొండి వైఖరితో కార్మికవర్గ ఐక్యతను దెబ్బతీయాలనే కుట్రతో కార్మిక చట్టాల మార్పు ప్రతిపాదించింది. ఇప్పడికే యజమానుల కనుకూలమైన మార్పులను చేయడం వలన మహిళా కార్మికుల హక్కులు పోవడం, ఉద్యోగ భద్రత ప్రమాదంలో పడటం, పని గంటలపై ప్రభావం పడడం 24 గం॥లలో ఎప్పుడైనా మహిళలతో పని చేయించుకోవడం, కాంట్రాక్టీకరణ పెరగడం , ట్రేడ్ యూనియన్లను నిర్వీర్యం చేసేలా మార్పులు తేవడంలాంటి చర్యలను తీవ్రంగా వ్యతిరేకించాలి.

ప్రభుత్వ రంగాన్ని తెగనమ్మే చర్యలను తీవ్రంగా ప్రతిఘటించాలి. ఇలాగే కొనసాగితే మన దేశ సంపద, స్వావలంబన ఎంఎన్‌సిల చేతుల్లోకి వెళ్లి దేశ ప్రజలు తీరని నష్టానికి గురి కావాల్సి వస్తుంది. ప్రజలు, కార్మికులు, అభ్యుదయవాదులు పోరాడి ప్రభుత్వ రంగన్ని కాపాడుకోవలని కోరుతున్నాం.

సెల్: 9490098659

'మండల్' సేవలు మరువలేం



ప్రభంజన్ యాదవ్

మండల్ అనే మాట భారతదేశంల చాలా శక్తివంతమైనది. అంబేద్కర్ తర్వాత నిచ్చెన మెట్ల కులదొంతరలను కుదిపే సిన మహనీయుడు బిందేశ్వరీ ప్రసాద్ మండల్. ఆధునిక సమాజంల 'మను ధర్మం' కుల్లు వ్యవస్థను కుల్లబొడిసిన ఘనుడు. దేశ సంపదను దోచుక తినే పరాన్నజీవులను కట్టడి చేసిండు. వెనకబడ్డ జాతుల ఈ తిబాధలు బాప ఓబీసీ రిజర్వేషన్లే భవిష్యతని ప్రతిపాదించిండు. భారత దేశంల కొనసాగుతున్న కుల వివక్ష మీద అధ్యయనం చేయనికి 1979 జనవరి 1న రెండో బ్యాక్వర్డ్ కమిషన్ ఏర్పాటైంది. అప్పటి ప్రధానమంత్రి మొరార్జీ దేశాయ్ ఐదుగురు సభ్యులతో కమిషన్ ఏర్పాటు చేసిండు. విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాలల్ల ఇతర వెనుకబడ్డ కులాలకు రిజర్వేషన్స్ ఇవ్వాలని 1980 డిసెంబర్ 31న మండల్ కమిషన్ సిఫార్స్ చేసింది. అప్పటి ప్రధాని ఇందిరా గాంధీకి మండల్ కమిషన్ నివేదిక సమర్పించింది. దశాబ్దం పాటు ఇందిరా, రాజీవ్ గాంధీల ప్రభుత్వాలు ఆ నివేదికను ఉద్దేశపూర్వకంగానే పట్టించుకోలె. 1990 ఆగష్టు 7న అప్పటి భారత ప్రధాని వి.పి.సింగ్ మండల్ కమిషన్ అమలు చేస్తున్నట్టు ప్రకటించిండు. విద్య, ఉద్యోగ, రంగాలల్ల ఇతర వెనుకబడ్డ కులాలకు మండల్ కమిషన్ ప్రకారం 27% రిజర్వేషన్స్ అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. మరోవైపు మండల్ కమిషన్ సిఫార్స్‌లను అమలు చేయొద్దని బ్రాహ్మణీయ శక్తులు మందిర్ వివాదాన్ని ముందుకు తెచ్చిండ్లు. మండల్ కమిషన్ అమలుకు నోచుకొని అప్పుడే ఇరవైఐదు ఏండ్లు గడిచినై. కానీ ఇప్పటికీ మండల్ కమిషన్ చేసిన 40 సిఫార్స్‌ల్లో ఏఒక్కటీ పూర్తిగా అమలు అవుతలేదు. బిందేశ్వరీ ప్రసాద్ మండల్ 1918 ఆగస్ట్ 25న బీహార్ రాష్ట్రం మొరో ప్రాంతంల జన్మించిండు.

బీహార్ రాష్ట్రానికి ఆయన తొలి ఓబిసి ముఖ్యమంత్రి. 1968 ఫిబ్రవరి 1న మండల్ ముఖ్యమంత్రిగా పదవి చేపట్టిండు. నీతి, నిజాయితీ, నిబద్ధతగల అతి కొద్ది మంది నాయకులల్ల బిందేశ్వరీ ప్రసాద్ మండల్ ఒకరు అని బిపి మండల్ ప్రత్యర్థి కేకే మండల్ స్వయంగా కితాబిచ్చిండు. బిందేశ్వరీ ప్రసాద్ మండల్ 1982 ఏప్రిల్ 13న మరణించిండు. మండల్ జ్ఞాపకార్థం ప్రభుత్వం 2001ల పోస్టల్ స్టాంప్ విడుదలచేసి గౌరవించింది. 2007ల బిపి మండల్ పేరిట బీహార్ ల ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటైంది.

దేశంల, రాష్ట్రంల పలు చోట్ల మహాత్మా జ్యోతిరావు పూలే, బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహాల స్థాపన జరిగింది. సంతోషం. బ్రాహ్మణీయ బానిస భావజాలం నుంచి బయట పడమని మహాత్మా జ్యోతిరావు పూలె బోధించిండు. నిచ్చెన మెట్ల కులతత్వ మనువాదాన్ని సమాధి చేయమని అంబేద్కర్ ప్రబోధించిండు. దేశ సంపదనుదోచుకతినే పరాన్నజీవులను కట్టడి చేసిండు బి పి మండల్. దుర్మార్గపు దొరతనాన్ని ఉప్పు పాతరేయమని మన తెలంగాణ సాయధ పోరాట యోధులు ఉద్బోధించిండ్లు. ఆ మహనీయుల విగ్రహాలను నెలకొల్పితే ఆధిపత్య శక్తుల వళ్లంతా వణుకు.

తెలంగాణ రాష్ట్రంల నయాదొరలు అధికారంలకు వచ్చిండ్లు. చరిత్రల దొరతనానికి వ్యతిరేకంగా పోరాడిన వీరుల విగ్రహాలు నెలకొల్పుడు ఈ దొరలు జీరి?ంచుకోలేక పోతాండ్లు. నానాటికి బలహీనపడుతున్న హిందూ మనువాద బ్రాహ్మణీయ వాదులూ జీర్ణించుకోలేక పోతాండ్లు. తమ ఆటలు ఇక సాగవని నయాదొరతనం గ్రహించింది. ఆ మహనీయుల విగ్రహాలపై దాడులకు తెగబడుతున్నై. ప్రజాస్వామ్య పద్ధతిలనే ఉద్యమించాలె. శాంతియుతంగానే పోరాడాలే. కోల్పోయిన హక్కులను తిరిగి సాధించుకోవాలే.

ఆది నుంచి మన తెలంగాణ సామాజిక ఉద్యమల పుట్టిల్లు. చైతన్యం వెల్లువెత్తిన నేల. పొత్తిళ్లలోనే పోరాట బావుట నెగిరేసిన ఖిల్లా. సమరశీల సాహసాల ఊయ్యాల. దోపిడి, దుర్మార్గాలపై తిరుగబడ్డ అల. విప్లవాల విశ్వవిద్యాలయం. అన్యాయం ఏరూపంల ఉన్నా ప్రశ్నించుడు ఈ నేల నేర్పన పాఠం. నేరం అధికారామై ప్రజల్ని పీడిస్తుంటే బుద్ధిజీవులు, మేథావులు ప్రాణాలను లెక్క చేయకుండా ప్రశ్నించిండ్లు. అధికారంల ఉన్నోళ్ల నిగ్గు తేల్చిండ్లు. అన్యాయాన్ని ఎదిరించిండ్లు. అందుకు కారణమైన వాళ్లనూ, దోహదపడ్డ వాళ్లనూ నిలదీసిండ్లు. నిగ్గదీసిండ్లు. వ్యవస్థ లోపాలని ఎత్తిచూపిండ్లు. గట్లాంటి మెరికలంతా మెదడుకు పదును పెట్టిండ్లు. తమ గళాలు విప్పిండ్లు. కలాలను ఝుళిపించిండ్లు.

భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం ఉవ్వెత్తున ఎగిసిపడింది. తిరుగుబాటుతో కాళ్ల కింది మట్టి ఎగిరి కండ్లల్ల పడ్డట్టైంది. దొరలు అగ్గి మీద గుగ్గిలం అయిండ్లు. మనసు ఆగమాగమైంది. అలజడే అలజడి. ఆలోచనల జడి. అణగబడ్డ జనం తిరగబడ్డ భావన. దొరలకు కోపం కట్టలు తెంచుకొస్తాంది. ఎందరో యోధులు ప్రజల పక్షాన నిలబడి ప్రభువులతో వీరోచితంగా పోరాడిండ్లు. ప్రజాస్వామ్యానికి పట్టం కట్టిండ్లు. స్వాతంత్ర్య ఫలాలూ సమస్త సంపదలో తమ భాగస్వామ్యాన్నీ వదులుకోము అనీ నినదించిండ్లు. త్యాగనిరతితో చరిత్రగతినే మార్చిండ్లు. గట్లా న్యాయం కోసం ప్రాణాన్ని త ణప్రాయంగా ఎంచి ఎదురొడ్డి పోరాడిన వీరుల పోతుగడ్డ మన తెలంగాణ.

పోరాట యోధుల త్యాగాల ఫలితంగా చదువుకున్నవాళ్లం, ఉద్యోగాలు చేస్తున్నవాళ్లం, ఊర్లు ఏలుతున్నవాళ్లం ఆత్మవిమర్శ చేసుకోవాలె. వీరోచిత పోరాటం జరిగిన తెలంగాణల గడిచిన 65 ఏండ్ల సందీ దొరలే రాజ్యం ఏలుడు దేనికి సంకేతం? ప్రజాస్వామ్యంల, ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంల కూడా దొరల పాలనేనా? ఎంత మందికి అర్థమైతాంది?

ఇక సహనం అసలే వద్దు. సాహసం చూపాలె. మన మహనీయులే మనకు ఆదర్శం కావలె. దొరల ప్రతి పన్నాగాన్నీ ప్రయోజనంగా మలుచుకోవాలె. మన కలలు సాకారం చేసుకునేతందుకు నిరంతరం శ్రమించాలే. కలిసొచ్చేటోళ్లతో కలిసి జతకట్టాలె. భుజం భుజం కలిపి కదం తొక్కాలే. బహుదూరపు బాటసారులమై సాగిపోవాలే. హక్కుల సాధన కోసం సమరం సాగించాలే. సమసమాజం స్థాపించుకోవాలె. సంకల్పం మంచిదైతే సగం విజయం సాధించినట్టే కదా!

సెల్: 9394243344




ఎం.సిద్ధలక్ష్మి

ప్రజాస్వామ్యం అంటే ఇదేనా! బంగారు తెలంగాణ అంటే ఇదేనా! బంగారు తెలంగాణలో భావితరాల పౌరులకు చూపించే దారి ఇదేనా! త్యాగాలు చేసిన తెలంగాణ ఇదేనా! తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జేఏసీ గొడుగు కిందనే పనిచేసిన టీఆర్ఎస్ పార్టీ శ్రేణులు ఇప్పుడు అదే జేఏసీపై మండిపడుతున్నాయి. దాడులకు దిగుతున్నాయి. అమరుల స్ఫూర్తి యాత్రను జేఏసీ చైర్మన్ ప్రొఫెసర్ కోదండరాం సిరిసిల్ల, సిద్దిపేట, గజ్వేల్ నియోజకవర్గాల్లో మూడు దఫాలుగా నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లో కోదండరాం యాత్రకు అడ్డంకులు సృష్టించినా కామారెడ్డి జిల్లాలో మాత్రం రణరంగంగా మార్చారు. కోదండరాం స్ఫూర్తియాత్ర జిల్లా సరిహద్దు గ్రామమైన బస్వాపూర్ చేరుకుంది. అప్పటికే టీఆర్ఎస్ శ్రేణులు భారీగా చేరుకుని కోదండరాంకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్నారు. కామారెడ్డి మున్సిపల్ కార్యాలయం వద్ద జేఏసీ ఆధ్వర్యంలో సభ కోసం వందలాది విద్యార్థులు చేరుకుని సభా ప్రాంగణంలో కూర్చున్నారు. కొందరు కోదండరాం గోబ్యాక్ అన్న నినాదాలు రాసి ప్లకార్డులు పట్టుకుని సభాస్థలానికి చేరుకున్నారు. టెంటును కూల్చివేసి, విద్యార్థి సంఘాల నాయకులపై దాడికి దిగారు. కోదండరాం కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాలలో పర్యటిస్తే తెలంగాణ ప్రభుత్వం బండారం బయటపెడుతుందని ప్రజాప్రతినిధుల భయం. కామారెడ్డి జిల్లాలో రాష్ట్రం ఏర్పడిన 2014 జూన్ 2 నుండి 2017 ఆగష్టు 9 వరకు 80 మంది రైతులు, నిజామాబాద్ జిల్లాలో 58 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. వీరిలో

నాటకీయ పరిణామాల మధ్య అమరవీరుల స్ఫూర్తియాత్ర

అతికొద్ది మందికి మాత్రమే జీవో 194 ప్రకారం ఎక్స్‌గ్రేషియా అందించారు. భూమిలేని దళితులకు మూడెకరాల భూమి రెండు జిల్లాల పరిధిలో 569 మందికి 1358.10 ఎకరాలను పంచారు. ఇందులో కేవలం 885.01 ఎకరాలను మాత్రమే రిజిస్టర్ చేసి లబ్దిదారులకు అందించారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో అసలు భూమిలేని దళిత కుటుంబాలు 781 గ్రామాల్లో 21,228 ఉన్నాయి. షెడ్యూల్డ్ తరగతులకు చెందిన కుటుంబాలు 8,318 ఉన్నాయి. ఈ మొత్తం 29, 546 కుటుంబాలకు మూడెకరాల చొప్పున భూములివ్వాలంటే 88,638 ఎకరాలు కావాల్సి ఉంటుంది. ఒక ఎకరం లోపు భూమి కలిగిన కుటుంబాలు మరో 10,119 కుటుంబాలు, 1 నుండి 2 ఎకరాల లోపు భూమి కలిగిన కుటుంబాలు మరో 19,685 కుటుంబాలు ఉన్నాయి. నిజాంషుగర్స్ లిమిటెడ్‌ను తిరిపిస్తామని ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకోలేదు. కంపెనీ అక్రమ లాకౌంట్ ప్రకటించి వందలాది కార్మిక కుటుంబాలను వీధులపాలుచేశారు. సహకార చక్కెర కర్మాగారం కూడా వర్కింగ్ కాపిటల్ సమకూర్చి తెరిపించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైంది. నిజామాబాద్ జిల్లాలో 689 పారిశ్రామిక యూనిట్లలో 7,373 మంది కార్మికులు మాత్రమే పనిచేస్తున్నారు. టీఎస్ ఇ.పాస్ కింద ప్రతిపాదించిన యూనిట్లు 101 కాగా, కల్పించే ఉద్యోగాలు 1363 మాత్రమే. అంటే దీని అర్థం ఈ జిల్లాలో యువతీయువకులకు ఉద్యోగ అవకాశాలు పారిశ్రామిక రంగంలో దక్కేది అతిస్వల్పమే. కామారెడ్డి జిల్లాలో 197 పారిశ్రామిక యూనిట్లలో 1882 మందికి మాత్రమే ఉపాధి దొరుకుతుంది. కొత్త టీఎస్ ఈపాస్ కింద ప్రతిపాదించబడిన యూనిట్లలో కల్పించే ఉపాధి 1636 మందికి మాత్రమే. రెండు జిల్లాలోనూ పశు సంపద విస్తారంగా ఉన్నప్పటికీ వైద్య సౌకర్యాలు కల్పించే పాలిక్లినిక్ ఆస్పత్రులు అతితక్కువగా ఉన్నాయి. రైతులకు చాలాసార్లు ఎంఎస్‌పీ కూడా అందడంలేదు. చాలా మార్కెట్ కమిటీలు ఫంక్షనింగ్‌లో లేకపోవడమో, సీజనల్ మార్కెట్‌లుగా ఉండటమో జరుగుతున్నది. బీడీ కార్మికులు లక్షల సంఖ్యలో ఉంటారు. కానీ నిజామాబాద్ జిల్లాలో 1,09,293 మంది కామారెడ్డి జిల్లాలో 35,820 మంది మాత్రమే గృహ పరిశ్రమలలో పనిచేస్తున్నట్టు చూపిస్తున్నారు. వర్ధీ బీడీ పేరుతో కార్మికులకు అతి తక్కువ కూలీ ధర చెల్లిస్తున్నారు. పీఎఫ్ కూడా లేనందువల్ల వీరికి ప్రభుత్వం అందించే పింఛన్ కూడా అందడం లేదు. ప్రాణదాతగా ఉన్న నిజాంసాగర్ ప్రాజెక్టును పునరుజ్జీవింపజేయడానికి సింగూరును పూర్తిగా నిజామాబాద్, మెదక్ జిల్లాలకే కేటాయించాలి. కామారెడ్డి రైతుల సాగునీటి అవసరాలను తీర్చే జల ప్రణాళికలను రూపొందించాలి. ఇసుక మాఫియా మంజీర నుండి ఇసుక అక్రమంగా తరలిస్తోంది. దీని వెనుక రాష్ట్ర ప్రభుత్వంలో మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధులు, కాంట్రాక్టర్లు ఉన్నారు. దీనిని వెంటనే అరికట్టి ప్రజల హక్కుగా సహజ వనరులను కాపాడాలి. రాష్ట్ర ప్రభుత్వానికి ఒక స్పష్టమైన జల విధానం లేదని స్పష్టమవుతుంది. కేవలం కాంట్రాక్టర్లకు మేలుచేసేలా తద్వారా ప్రభుత్వాధినేతలు కమీషన్లు దండుకునేలా ఈ డిజైన్లు ఉంటున్నాయి. పూర్తికాని చట్టబద్ధతలేని ప్రాజెక్టుల కోసం రైతుల చేతుల నుండి వేలాది ఎకరాల భూములను కొల్లగొట్టడం దుర్మార్గంగా సాగుతోంది. వేలాది మంది ప్రజలను నిర్వాసితులను చేసి ప్రజలను మభ్యపెట్టకుండా ప్రభుత్వం వెంటనే అన్ని ప్రాజెక్టులపై శ్వేతపత్రం ప్రకటించాలి. రాష్ట్రంలో నిరంకుశపాలన, పోలీస్ పాలన సాగుతున్నది. ప్రజల ప్రజాస్వామిక హక్కులను హరిస్తున్నారు. ధర్నాచౌక్ రద్దు, యాత్రలను అడ్డుకోవడం ఇందులో భాగమే.

సెల్: 8374133654



సిహెచ్ మధు

దుఃఖం ఆగటం లేదు. పాలకులు ఎలా నిద్రపోతున్నారో, సిగ్గులేకుండా ఎలా మాట్లాడుతున్నారో నాకు అర్థం కా వటం లేదు. జరిగిన సంఘటన సిగ్గుగా ఉంది. బాధగా ఉంది. చరిత్ర ఇప్పటి తరాన్ని క్షమించకపోవచ్చు. పాలకులు హాయిగా ఉన్నారు. వైద్యం అందక.. ఆక్సిజన్ దొరకక పసిపిల్లలు చనిపోతే... దుఃఖించే బదులు.. సిగ్గుపడే బదు లు ... రాజీనామా చేసే బదులు... రక రకాల వ్యా ఖ్యానాలు చేస్తూ... ఆక్సిజ న్ అందకే కాదు, మెదడువాపు వ్యా ధి... ఇంకేదో అంటూ పిల్లల చావును సమర్థించుకుంటున్నారు. ఇదీ మనభారతం... సిగ్గు వి డిచిన పాలకుల భారతం. మనదేశంలో ఆక్సిజన్ అందక చనిపోతున్నారు. ఆక్సిజన్ అంత విలువైన ప్రాణవాయువే కావచ్చు. కానీ ఖరీదైన వస్తువా అందకపోవటానికి!? ఎటు పో తుంది మన దేశం..? ఏ అభివృద్ధి కి గీటురాయి. ఈ పిల్లల చావులు? ఏ

ప్రజలకు చావు రాస్తున్న వైద్య వ్యాపార సామ్రాజ్యం

ఒక్క యోగి ప్రభుత్వమే కాదు. అన్ని ప్రభుత్వాలు ప్రయివేటు వైద్యాన్ని దోపిడీని రక్షిస్తున్నాయి. ఎందుకూ ప్రభుత్వ వైద్యాన్ని అందించలేక.. ప్రభుత్వ వైద్యంపై ఖర్చుపెట్టలేక... వాళ్ల జీతాలు పెంచుకోవటానికి విలాసాలకు, విందులకు, ఆవిష్కరణలకు, విదేశీ యాత్రలకు డబ్బులుంటాయి. ప్రజల వైద్యానికి డబ్బులుండవు. శ్రామిక జనం ఆదాయానికీ ఇతరుల ఆదాయానికి వచ్చే తేడాతో వారికి అవసరం లేదు. పబ్లిక్ సర్వీస్ కమిషన్ లాంటి అధికారుల జీతాలు రెట్టింపు కాదు. మూడు రెట్లు పెంచుతున్నారు.. ఎవరి కొరకు? ఎవరి సొమ్ము? శ్రామిక జనానికి బొక్కలు విసిరేసి మాంసం తింటున్న వ్యవస్థ.

వెలుగులకు ప్రతీక ఆక్సిజన్ లేకపోవటం...

అభివృద్ధి చెందుతున్న దేశం... వెలుగులు అందిస్తున్న దేశం. అగ్రరాజ్యాల సరసన నిల్చోవటానికి పరుగులు పెడుతున్న దేశం... సిగ్గుగా లేదు ఈ మాటలు చెప్పుకోవటానికి..! ఆక్సిజన్ అందక చిన్నారులు చనిపోయారు. ఒక యోగి పరిపాలిస్తున్న ఉత్తరప్రదేశ్‌లో.. యోగి ఎవరు? ఆర్ఎస్ఎస్ కార్యకర్త. భారత దేశాన్ని హిందూదేశంగా మార్చాలని కలలుకంటున్న ఆర్ఎస్ఎస్ కార్యకర్త. యోగి ఎవరు? భారత్‌ను డిజిటల్ ఇండి యా అభివృద్ధి ఇండియాగా మారిపోతుందని భ్రమలు కల్పిస్తున్న ప్రధాని మోడీ శిష్యుడు. యోగి యోగ్యుడని సమ ర్థుడని ఏరికోరి యూపీ నాయకత్వాన్ని అప్పగించారు. ఆక్సిజన్ అందక చిన్నారు లు చనిపోయారు. యూపీ ముఖ్యమంత్రి బాధ్యతగా రాజీనామా యివ్వాలి. యిచ్చారా? లేదు.. ఎవరినో సస్పెండ్ చేసారు. ఎవరినో బలిచేసారు. యోగి, ఆయన మంత్రివర్గ సభ్యులు అక్క డి ప్రజా ప్రతినిధులు అంతా హాయిగా ఉన్నారు. పిల్లలు ఆక్సిజన్ అందక ఆస్పత్రిలో చనిపోతే వారికేమిటీ బాధ?

మన భారత్ ఇలా ఉంది! ఇది రాస్తున్న సమయానికి పిల్లల మరణాల సంఖ్య (72)కు చేరింది. కరుణ లేని వ్యవస్థ ఇది. రాక్షస నీతికి కూడా కొంత దయ ఉంటుంది. ఇక్కడ రాజకీయ నీతికి దయలేదు. 70శాతం కలిగిన శ్రామిక జనం అలా ఉంచితే.. మిగితా సుఖభోగాల వర్గానికి దయ కరుణ ఉందా? అందరూ వ్యవస్థతో రాజీపడుతున్నవారే! అందరూ పాలకవర్గాల ముందు తలవంచి నిలుస్తున్నవారే. ఉత్తరప్రదేశ్‌లోని గోరక్‌పూర్‌లో ఆక్సిజన్ అందక పిల్లలు చనిపోతే ఒక్క మేధావి నోరు విప్పడు. ఒక్క కవి దుఃఖ కవిత రాయడు. ధిక్కారణ శంఖాన్ని పూరించరు. ఇప్పటికే చిన్నారుల మరణంపై దేశం అట్టుడికి పోయింది. యోగి రాజీనామా స్వచ్ఛందంగా చేయాల్సింది. ప్రధాని మోడీ యోగితో రాజీనామా చేయించాల్సింది. రాజీనామా ఎందుకు? పోయిన చిన్నారుల ప్రాణాలు మళ్లీ వస్తాయా? దోపిడీ వైద్య వ్యాపార వ్యవస్థ దుర్మార్గ లక్షణాలతో చిన్నారులు చనిపోయారు. వ్యవస్థ భయంకర దుర్మార్గాలలో వైద్యరంగం దోపిడీ వ్యాపారం సాగించటం ఒకటి. కార్పొరేట్ సామ్రాజ్య రోగలక్షణాలలో ఇదొకటి. వైద్య అందక వికటించి డాక్టర్ల అశ్రద్ధ మందులు అందక ప్రతినిత్యం వందల సంఖ్యలో రోగులు చనిపోతున్నారు. అయితే 72 మంది ఒకేసారి చనిపోయిన పిల్లల విషాద ఘటన ఇది. కరుణ లేని వ్యవస్థ. దయలేని ప్రభుత్వం. అంతా మామూలే దుర్మార్గం రొటీన్ వ్యవహారం సర్దుకుపోవల్సిందే అనుకొంటున్న మేధావివర్గం... యోగి రాజీనామా చేస్తే దోపిడీ వైద్య రంగానికి చెంపదెబ్బలా ఉండేది. ఆయన తప్పులేదు అనలేం... ఘటన జరిగిన రాష్ట్రానికి ముఖ్యమంత్రి అయినందుకు బాధ్యత వహించాల్సిందే. ముఖ్యమంత్రిగా తన పరిపాలనా లోపంగా అంగీకరించాల్సిందే. తలవంచాల్సిందే! "దేశమంతా ఇలాగే ఉంది. డాక్టర్లను ఏమీచేయలేం.. వైద్యరంగాన్ని మార్చలేం" అనే కార్పొరేట్ అనుకూల మాటలు మాట్లాడితే... ప్రధాని నరేంద్రమోడీ బీజేపీ శ్రేణులు ప్రజల భాష మాట్లాడితే, మాటలలో తీయదనం, స్వచ్ఛభారత్ అచ్చా భారత్ మాటలు మానుకోవాలి. ఎందుకీ దొంగ ఏడ్పులు.. అంతరంగ నవ్వులు.

యూపీ గోరక్‌పూర్ ప్రయివేట్ ఆస్పత్రిలో ఆక్సిజన్ అందక 72 మంది చనిపోతే పేపర్లలో ఎక్కడో ఓ మూల ఈవార్త ఏడుస్తూ ఉంది. పిల్లల మరణాలపై నిలదీయాల్సిన మీడియా నిశ్శబ్దంగా ఓమూల దాక్కుంది? ప్రకటనలకు, పోజులకు, దొంగ ఖండనలకు పరిమితమయిన వ్యవస్థ. పిల్లలు ఆక్సిజన్ అందక చనిపోతే అంతా సజావుగానే ఉంది. అమిత్‌షా రాజకీయాలు ఆగలేదు. షేర్ మార్కెట్ హెచ్చు తగ్గులు ఆగలేదు. మోడీ శబ్దం ఆగలేదు. నంద్యాలలో నీవు దొంగ.. నీవు దొంగ.. అనుకోవటం ఆగలేదు. ఆక్సిజన్ అందక పిల్లలు చనిపోయారని వార్తలు వస్తున్న రోజే వెంకయ్యనాయుడు ఉప రాష్ట్రపతి ప్రమాణ స్వీకా రం. సంతాప సూచకంగా ఏదీ ఆగలేదు. ఎవరి ఏడ్పులు వారి వి. ఎవడి నవ్వులు ఆనందాలు, ప్రారంభోత్సవాలు, ఆవిష్కరణ లు, పండుగలు వారివి.. నిజమే.. ఎవరికి వారే! ఎవరికి ఎవరూ కాదు. గోరక్‌పూర్ చిన్నారుల మృతికి బాధ్యులెవరు? పాలకులు కాదా? ఆక్సిజన్ అందక చనిపోయారని బాధితులు చెపుతున్నా రు. ఆక్సిజన్ అందక నిజం ఒప్పుకుంటే తప్పేముంది. ప్రయివే టు ఆస్పత్రిని ప్రయివేట్ వైద్యాన్ని ప్రయివేట్ వైద్య దోపిడీని రక్షించటం ప్రభుత్వ ఉద్దేశ్యమా? ప్రభుత్వ ఆస్పత్రి అనుకుందాం! ఆక్సిజన్ ఎందుకు లేదు... ఎవరి నిర్లక్ష్యం చర్య తీసుకుంటే కొంత భయం కొంత మార్పు ఉండేది. యోగి ప్రభుత్వం పరువుకు పోయి పరువు తీసుకుంది.

సెల్: 9949486122

ఈ పేజీ మీ అందరిది

ఇక్కడ వ్యక్తమయ్యే అభిప్రాయాలు వ్యాసకర్తల వ్యక్తిగతం. నవతెలంగాణ అభిప్రాయాలు కానవసరం లేదు. 4000 క్యారెక్టర్ల లోపు ఉన్న వ్యాసాలకు ప్రాధాన్యత ఉంటుంది. ఎట్టి పరిస్థితుల్లోను 6000 క్యారెక్టర్లకు మించకుండా పంపించండి. లేనట్లయితే ఎడిటింగ్‌లో మీరు చెప్పదలచిన అభిప్రాయాలు స్పష్టత కోల్పోవచ్చు. వివిధ ప్రజాసమస్యలపై రాసిన వ్యాసాలకు ప్రాధాన్యత ఉంటుంది. వ్యాస రచయితలు వారి ఫొటో, సెల్‌నెంబర్ ఇవ్వాలి. - ఎడిటర్

మీ రచనలు పంపవలసిన చిరునామా :

email: vedika@ navatelangana.com Postal Addres: M.H.Bhavan,plot No,21/1, Azamabad, Near RTC Kalayana mandapam,Hyderabad500020. Ph:27665420,27673787,9490099077/78. Fax:040-27652228

ఏపీ ప్రభుత్వంపై దాఖలైన వ్యాజ్యం కొట్టివేత

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పునర్విభజన చట్ట నియమ నిబంధలకు అనుగుణంగా ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఆయన మంత్రివర్గ సహచరులు ప్రమాణం చేయలేదని, వారిని ఆ పదవుల్లో కొనసాగించవద్దంటూ దాఖలైన వ్యాజ్యాన్ని హైకోర్టు న్యాయమూర్తులు .రామసుబ్రమణ్యన్, టీ.రజనీలతో కూడిన డివిజన్ బెంచ్ కొట్టివేసింది. తెలుగు రాష్ట్రాలోని ఎమ్మెల్యేలు రాష్ట్ర విభజన తరువాత గవర్నర్ ద్వారా ప్రమాణం చేయలేదని, కాబట్టి ఏపీ క్యాబినెట్ ప్రమాణ స్వీకారం చెల్లదంటూ పీసీసీ ప్రధాన కార్యదర్శి సూరిబాబు రిట్ ఆఫ్ కో వారెంట్‌ను హైకోర్టు తోసిపుచ్చింది. మూడేళ్ల పాలన పూర్తి అయ్యాక కోర్టుకు రావడంలో ఔచిత్యం ఏమిటని బెంచ్ పిటిషనర్‌ను ప్రశ్నించింది. తీరుబడిగా కోర్టుకు రావడంతో కోర్టు సమయాన్ని వృథా చేయడమే అవుతుందని హైకోర్టు అభిప్రాయపడింది. పునర్విభజన చట్టనిబంధనల మేరకు రెండు తెలుగు రాష్ట్రాల శాసనసభ్యులు అపాయింటెడ్ డే నుంచి ఎన్నికైనట్టు పరిగణించాలని హైకోర్టు స్పష్టం చేసింది. అధికరణ 164(1) ప్రకారమే ఎమ్మెల్యేలు, ఆయా పార్టీల పక్ష నేతల ఎంపిక జరిగిందని ధర్మాసనం తన తీర్పులో పేర్కొంది.

మంత్రి గంటాకు నాన్‌బెయిలబుల్ వారెంట్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మానవవనరుల అభివృద్ధి శాఖ మంత్రి గంటా శ్రీనివాసరావుకు నాన్‌బెయిలబుల్ వారెంట్ జారీ అయింది. 2009 అసెంబ్లీ ఎన్నికల్లో కోడ్ ఉల్లంఘనకు పాల్పడ్డారనే కేసులో అనకాపల్లి రెండో అదనపు సివిల్ కోర్డు జడ్జి మంత్రికి నాన్‌బెయిలబుల్ వారెంట్ జారీచేశారు.

'ఓటె'త్తిన నంద్యాల

79.2 శాతం పోలింగ్
రెండు దశాబ్దాల్లో ఇదే అత్యధికం
విజయ అవకాశాలపై ఎవరి ధీమా వారిదే

- 28న కౌంటింగ్
- శిల్పా,భూమా కుటుంబాల మధ్య స్వల్ప ఘర్షణ

నంద్యాల: కర్నూలు జిల్లా నంద్యాల ఉప ఎన్నిక పోలింగ్ ప్రక్రియ ముగిసింది. అక్కడక్కడా చెదురుమదురు ఘటనలు మినహా పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. నంద్యాలలో గతంలో ఎన్నడూ లేనంతగా రికార్డు స్థాయిలో ఓటింగ్ నమోదైంది. బుధవారం సాయంత్రం 5గంటల సమయానికి మొత్తం 79.20 శాతం పోలింగ్ నమోదైనట్టు సమాచారం. నంద్యాల రూరల్, గోస్పాడు మండలాల్లో అత్యధికంగా పోలింగ్ నమోదైంది. నంద్యాల అర్బన్‌లోనూ 70శాతం వరకు పోలింగ్ నమోదైనట్టు తెలుస్తోంది. పోలింగ్ కేంద్రాల వద్ద క్యూలైన్లలో వేచి ఉన్నవారికి చివరి వరకూ ఓటుసేందుకు అనుతించారు. దీంతో మొత్తం పోలింగ్ 80శాతానికి పైగా ఉండవచ్చని భావిస్తున్నారు.



ఇరు వర్గాల ఘర్షణ

నంద్యాలలోని ఏడో వార్డు ఎన్టీఆర్ షాదీఖానా వద్ద దొంగ ఓట్లు వేస్తున్నారంటూ వైసీపీ నేతలు ఫిర్యాదు చేయడంతో ఘర్షణ వాతావరణం నెలకొన్నది. దీంతో టీడీపీ నుంచి ఏవీ సుబ్బారెడ్డి, భూమా నాగిరెడ్డి కుమార్తె కుమార్తె మౌనిక, అభ్యర్థి బ్రహ్మానందరెడ్డి అక్కడకు చేరుకున్నారు. అలాగే వైసీపీ అభ్యర్థి సోదరుడు శిల్పా చక్రపాణిరెడ్డి అక్కడకు రావడంతో తీవ్ర ఉద్రిక్తత నెలకొన్నది. రాయలసీమ రేంజ్ ఐజీ ఇక్బాల్ అక్కడకు చేరుకొని పరిస్థితిని అదుపుచేసేందుకు ప్రయత్నించారు. దాదాపు అరగంట పాటు హైడ్రామా కొనసాగింది. బొగ్గు కాలనీలోనూ ఇరు వర్గాల మధ్య ఘర్షణ తలెత్తింది. భారీగా పోలీసు బలగాలను పహారా ఉంచడంతో మొత్తమ్మీద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండానే పోలింగ్ ప్రక్రియ సజావుగా ముగిసింది.

వైఎస్ జగన్‌పై కేసు నమోదు

వైసీపీ అధ్యక్షుడు, ఏపీ ప్రతిపక్ష నేత జగన్‌పై నంద్యాలలో కేసు నమోదైంది. నంద్యాల ఉప ఎన్నిక ప్రచారంలో భాగంగా సీఎం చంద్రబాబుపై ఆయన చేసిన అనుచిత వ్యాఖ్యలపై టీడీపీ నేతలు ఈసీకి ఫిర్యాదు చేశారు. ముఖ్యంగా 'సీఎం చంద్రబాబును నడిరోడ్డుపై కాల్చి చంపినా ఫర్వాలేదు. ఉరితీసినా తప్పులేదు' అంటూ జగన్ చేసిన తీవ్ర వ్యాఖ్యలు చేసిన నేపథ్యంలో ఆయనపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. దీన్ని పరిశీలించిన ఎన్నికల సంఘం ఆయన వ్యాఖ్యలు కచ్చితంగా ఎన్నికల కోడ్ ఉల్లంఘన కిందకే వస్తుందని పేర్కొంటూ చర్యలు తీసుకోవాలని కర్నూలు జిల్లా కలెక్టర్‌కు ఆదేశాలు జారీచేసింది. ఈ నేపథ్యంలో నంద్యాల ఉప ఎన్నికకు రిటర్నింగ్ అధికారి ఆదేశాల మేరకు మూడో పట్టణ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. జగన్‌ను అరెస్టుచేసే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది.

సాక్షి ఛానల్‌పైనా..

సాక్షి ఛానల్‌పై హైదరాబాద్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. నంద్యాల ఉప ఎన్నిక నేపథ్యంలో సర్వే పేరిట మంగళవారం వార్తలు ప్రసారం చేశారని సాక్షిపై ఎన్నికల సంఘం ప్రధానాధికారి భన్వర్‌లాల్ ఫిర్యాదు చేశారు. దీంతో సెక్షన్ 126ఏ, బీ కింద పోలీసులు కేసు నమోదు చేశారు.

పట్టణాభివృద్ధిలో మహిళల పాత్రను పెంచుతాం: కేటీఆర్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

పట్టణాల అభివృద్ధిలో మహిళల పాత్రను మరింత పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని పురపాలక శాఖ మంత్రి కె తారకరామారావు అన్నారు. బుధవారం హైదరాబాద్‌లో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ఉద్యోగులు, రిసోర్స్ పర్సన్లు, కమ్యూనిటీ ఆఫీసర్లతో మంత్రి సమావేశమయ్యారు. పట్టణాలల్లో సంక్షేమ కార్యక్రమాలను పకడ్బందీగా అమలు చేయడం మెప్మా కీలకపాత్ర పోషిస్తోందన్నారు. రాష్ట్రంలోని పట్ట ణాల్లో నివసిస్తున్న పేదల అభివృద్ధి కోసం తీసుకోవాల్సిన పలు కార్యక్రమా లపై, వారికి అందజేయాల్సిన సహాయ సహకారాలను అడిగి తెలుసుకు న్నారు. కేసీఆర్ కిట్లు, హరితహారం, బహిరంగ మలవిసర్జన రహితంగా పట్టణాలను ప్రకటించే కార్యక్రమం ఎలా జరుగుతుందని రిసోర్స్ పర్సన్ల ను ప్రశ్నించారు. పురపాలికలు చేపట్టిన తడి పొడి చెత్త కార్యక్రమాన్ని అమలు చేయడంతో, అక్కడి పట్టణ ప్రజలను చైతన్యవంతం చేయడంతో మెప్మా కీలకపాత్ర పోషించాలని సూచించారు. వాక్సినేషన్, పౌష్టికాహార కార్యక్రమాలు, ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు వంటి వాటి పట్ల పట్టణ ప్రజల్లో మరింత అవగాహన పెంచాలని కోరారు. మెప్మా పథకం కింద మహిళల సేవల గురించి సీఎంకు పూర్తి అవగాహన ఉందన్నారు. దశాబ్దకాలంపాటు అన్ని ప్రభుత్వ కార్యక్రమాల అమలులో క్షేత్రస్థాయిలో కీలకంగా పని చేస్తున్నా..తమకు అతి తక్కువ వేతనాలు ఉన్నాయని, వీటిని పెంచాలని రిసోర్సు పర్సన్లు కోరారు. ఈ విషయంలో సీఎం సానుకూల నిర్ణయం తీసుకుంటారని మంత్రి హామీ ఇచ్చారు.

వెనుకబడ్డ గ్రామాలపై ప్రత్యేక దృష్టి : జూపల్లి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ప్రాధాన్యత క్రమంలో అభివద్ధి పనులను వేగంగా పూర్తి చేయాలని, వెనుకబడ్డ గ్రామాలపై ప్రత్యేక దష్టి సారించాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివద్ధి శాఖ మంత్రి జూపల్లి కష్ణారావు ఆదేశించారు. గ్రామీణాభి వద్ధిశాఖ కమిషనర్ కార్యాలయంలో బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధిహామీ పనులతో పాటు మరుగుదొడ్లు, ఇంకుడుగుం తలు, డంపింగ్ యార్డులు, వైకుంఠధామాల నిర్మాణంపై చర్చించారు. అలాగే హరితహారంలో భాగంగా మొక్కలు నాటడంతో పాటు, సంరక్షించేందుకు తీసుకోవలసిన చర్యలపై సమీక్షించారు. ఉపాధికూలీల వేతనాలను ఎప్పటికప్పుడు చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని, కేంద్రం నుంచి రావాల్సిన బకాయిలపై సంప్రదింపులు జరపాలని ముఖ్య కార్యదర్శి వికాస్‌రాజ్, కమిషనర్ నీతూప్రసాద్‌ను ఆదేశించారు. ఈ సమావేశంలో అధికారులు వెస్లీ, రామారావు, ఆశ పాల్గొన్నారు.

ఆర్టీసీ ఆర్థికంగా ఎదగాలి

- హైమైలేజ్ అవార్డ్స్ కార్యక్రమంలో టీఎస్ఆర్టీసీ చైర్మెన్ సోమారపు సత్యనారాయణ

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

టీఎస్ఆర్టీసీ ఆర్థికంగా మరింత అభివృద్ధి చెందాల్సి ఉందని ఆ సంస్థ చైర్మెన్ సోమారపు సత్యనారాయణ చెప్పారు. దీనికోసం అందుబాటులో ఉన్న అన్ని వనరుల్ని సద్వినియోగం చేసుకుంటూ, ఇప్పుడిప్పుడే ఆర్థిక కష్టాల నుంచి గట్టెక్కే ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు. అశోక్‌లేల్యాండ్ కంపెనీ ఆర్టీసీకి తయారు చేసి ఇచ్చిన బస్సుల్లో ఇంజన్‌లో ఎలాంటి మేజర్ మరమ్మతులు లేకుండా పది లక్షల కిలోమీటర్లకు పైగా తిరిగిన బస్సుల నిర్వహణ (మెకానికల్) సిబ్బందిని బుధవారంనాడిక్కడి ఆర్టీసీ కళాభవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అవార్డులతో సత్కరించారు. అశోక్‌లేల్యాండ్ కంపెనీ నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆర్టీసీ చైర్మెన్ ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. సంస్థలోని 8,600 బస్సుల్లో 808 బస్సులు ఈ ఘనత సాధించాయని, ఈ బస్సుల్ని నడపడంలో డ్రైవర్ల పాత్ర కూడా కీలకమైం దని చెప్పారు. మియాపూర్ ఆర్టీసీ బస్‌బాడీ బిల్డింగ్ యూనిట్ సిబ్బందికి అశోక్‌లేల్యాండ్ కంపెనీ మరింత మెరుగైన శిక్షణ ఇచ్చేందుకు అంగీకరించిందని తెలిపారు. దేశంలో అశోక్‌లేల్యాండ్ బస్సులు అద్భుతంగా పనిచేస్తున్నాయని ప్రసంసించారు. టీఎస్ఆర్టీసీ ఎమ్‌డీ జివి రమణారావు మాట్లాడుతూ ఆర్టీసీ సాధించిన ఈ ఘనత టీంవర్క్ ఫలితమేనని అన్నారు. అనంతరం పదిలక్షల కిలోమీటర్లకు పైగా తిరిగిన 808 బస్సుల మెకానికల్ నిర్వహణ సిబ్బందిని ఆర్టీసీ చైర్మెన్ అవార్డులతో సత్కరించారు. కార్యక్రమంలో అశోక్‌లేల్యాండ్ వైస్ చైర్మెన్ జయరాజ్‌గుప్తా, జోనల్ మేనేజర్ కె మోహన్, రీజినల్ మేనేజర్ దివాకర్‌రెడ్డి, టీఎస్ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎమ్ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

పెంచిన విత్తనాల ధరల నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి

- తెలంగాణ రైతు సంఘం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ ప్రభుత్వం యాసంగి పంటలకు అవసరమైన పప్పుశనగ, వేరుశనగ, విత్తనాల రేట్లను అడ్డగోలుగా నిర్ణయించందని, ఈ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షు లు పి.జంగారెడ్డి, కార్యదర్శి సాగర్, ఉపాధ్యక్షులు బొంతల చంద్రారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వం యాసంగి పంటల విత్తనాలకు రూ.74కోట్లు కేటాయించిందని, అందులో పప్పుశనగ, వేరుశ నగ పంటలకు రూ.49.14కోట్లు కేటాయించారని తెలిపారు. ఇందుకు 1.33 లక్షల క్వింటాళ్ల శనగలు, 1.64 క్వింటాళ్ల వేరుశనగ విత్తనాలు రాయితీమీద ఇవ్వనున్నారు.మార్కెట్‌లో శనగ విత్తనాల ధర క్వింటాలుకు రూ.6100 ఉంటే వ్యవసాయ శాఖ రూ. 8,680గా నిర్ణయించిందన్నారు. వేరుశనగ విత్తనాలు మార్కెట్‌లో క్వింటాలుకు రూ.5వేలు ఉంటే, వ్యవ సాయ శాఖ రూ.7600 నిర్ణయించిందని తెలిపారు. ఈ విధంగా రాయితీ విత్తనాలకు ధరలు నిర్ణయించడం వల్ల కేటాయించిన రూ.49.14 కోట్లు విత్తన కంపెనీలు పాలకులు, అధికారులకే లాభం ఉంటుందన్నారు. కనుక ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ఉపసంహరించుకొని, రైతులకు ఉపయోగపడే చర్యలు చేపట్టాలని కోరారు.

'పత్తి కొనుగోలుకు చర్యలు చేపట్టాలి'

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో పత్తి కొనుగోలు చేసేందుకు ముందస్తు చర్యలు చేపట్టాల ని తెలంగాణ మార్క్‌ఫెడ్ చైర్మెన్ లోక బాపురెడ్డి నాఫెడ్ మేనేజింగ్ డైరెక్టర్ సంజీవ్ కుమార్ చడ్డాను బుధవారం ఢిల్లీలో కలిసి విజ్ఞప్తి చేశారు. 2016-17 సంవత్సరంలో కనీస మద్ధతు ధరకు కందులు కొనుగోలు చేసి, రైతులను ఆదుకున్నందుకు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ ఏడాది తెలంగాణలో పత్తి పంట అధికంగా సాగు చేశారని, దిగుబడి కూడా అధిక పరిమాణంలో వచ్చే అవకాశమున్నదని వివరించారు. కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) మాత్రమే పెద్ద మొత్తంలో కొనుగోలు చేసే అవకాశం లేనందున, నాఫెడ్ కూడా పత్తిని కొనుగోలు చేసేందుకు ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు.

గ్రామీణ పేద పిల్లలకు సదావకాశం

- రెడ్డి హాస్టల్ కార్యదర్శి కె వెంకటరెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

గ్రామీణ పేద పిల్లలకు ఉన్నత విద్య చదువుకోవడానికి సదావకాశం కల్పించడం కోసం రెడ్డి హాస్టల్ ప్రారంభమైందని రాజాబహదూర్ వెంకటరామారెడ్డి ఎడ్యుకేషనల్ సొసైటీ (ఆర్‌బీవీఆర్ ఆర్ఈఎస్) కార్యదర్శి కె వెంకటరెడ్డి చెప్పారు. బుధవారం నవతెలంగాణ ప్రతినిధితో ఆయన మాట్లాడుతూ 1918లో రెడ్డి హాస్టల్‌ను రాజాబహ దూర్ వెంకటరామారెడ్డి స్థాపించారని అన్నారు. 50 మందితో ప్రారంభమైన ఈ హాస్టల్ నేడు 500 మందికి వసతి కల్పిస్తోందన్నారు. 2018లో వందేండ్ల ఉత్సవాలు నిర్వహిస్తామని అన్నారు. అన్ని కులాలూ, మతాల వారుంటారని చెప్పారు. బాలికల విద్య ప్రాముఖ్యతను గుర్తించి నారాయణగూడలో బాలికల వసతిగృహం 1933లో స్థాపించారని అన్నారు. 20 మందితో ప్రారంభమైన ఆ హాస్టల్‌లో నేడు 400 మందికిపైగా ఉంటారని చెప్పారు. వనపర్తి జిల్లా కొత్తకోట మండలంలోని విలియం కొండ గ్రామంలో రాజాబహదూర్ వెంకటరామారెడ్డి మోడల్ హైస్కూల్‌ను ప్రారంభించారని అన్నారు. అక్కడ 600 మంది బాలబాలికలు చదువుతున్నారని చెప్పారు. ఏటా విద్యార్థులకు రూ.45 లక్షల వరకు స్కాలర్‌షిప్‌లు అందజేస్తామన్నారు. పేదరికంలో ఉన్న విద్యార్థుల ఆర్థిక స్థితిగతులను బట్టి ఫ్రీషిప్‌పేరుతో రూ.30 వేలు, ఆఫ్ ఫ్రీషిప్ పేరుతో రూ.15 వేలు, స్కాలర్‌షిప్‌లు రూ.8 వేలు ఇస్తామని వివరించారు. ఏటా జూన్‌లో హాస్టల్ ప్రవేశాల నోటిఫికేషన్ జారీ చేస్తామన్నారు. జులైలో ఎంపిక ప్రక్రియ పూర్తి చేస్తామని చెప్పారు. గ్రామీణ ప్రాంతం, విద్యార్హతలను బట్టే హాస్టల్ సౌకర్యం కల్పిస్తామని అన్నారు. బాలుర హాస్టల్‌లో చేరే విద్యార్థి రూ.8,500 చెల్లించాల్సి ఉంటుందన్నారు. దాంతోపాటు నెలకు రూ.3 వేలు కట్టాలని చెప్పారు. ఇతర కులాలు, మతాల వారు దరఖాస్తు చేసుకునే దాన్ని బట్టి ఏటా 15,20,25 శాతం చొప్పున సీట్లు కేటాయిస్తామన్నారు. మిగిలిన సీట్లు రెడ్డి కులానికి చెందిన విద్యార్థులను ఎంపిక చేస్తామని చెప్పారు.

చక్కెర ధరలు పెంచితే చర్యలు

- పౌరసరఫరాల శాఖ కమిషనర్ సీవీ ఆనంద్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



నిబంధనలకు విరుద్ధంగా చక్కెర నిల్వలు చేసి కత్రిమ కొరత సష్టించి ధరలు పెంచితే కఠిన చర్యలు తీసుకుంటామని పౌరసరఫరాలశాఖ కమిషనర్ సీవీ ఆనంద్ చక్కెర వ్యాపారులను హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వం లేదా రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన ధర కన్నా లైసెన్స్ పొందిన వ్యక్తి చక్కెరను అధిక ధరకు అమ్మకూడదన్నారు. లైసెన్స్ లేకుండా చక్కెర విక్రయించే వ్యాపారులపై దాడులు చేయాలని అధికారులు ఆదేశించారు. ఎవరైనా ఐదు క్వింటాళ్ల కంటే ఎక్కువ చక్కెర నిల్వలు ఉంచేవారిని చక్కెర డీలర్‌గా పరిగణించబడతారని, వారు సంబంధిత జిల్లా పౌరసరఫరాల అధికారి, తహసిల్దార్‌ల నుంచి హోల్‌సేల్, రిటైల్ లైసెన్స్‌ను తీసుకోవాలని, లేనిపక్షంలో వారిపై నిత్యావసరాల చట్టం కింద చర్యలు తీసుకుంటామన్నారు. కాగా, చక్కెర నిల్వలు, లావాదేవీలపై పరిమితులు విధిస్తూ కేంద్రం గతంలో విడుదల చేసిన ఉత్తర్వులను మరో ఆరు నెలలకు-2017, అక్టోబర్ 28 వరకు ప్రభుత్వం పొడిగించింది. ఇది అన్ని రాష్ట్రాల్లో, కేంద్ర పాలిత ప్రాంతాల్లో పాటించాల్సిందిగా ఆదేశాలు జారీచేసింది. కేంద్రం ఆదేశాల మేరకు చక్కెర ధరల నియంత్రణకు కమిషనర్ సీవీ ఆనంద్ రాష్ట్రంలోని హోల్‌సేల్ చక్కెర వ్యాపారుల సంఘం ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. చక్కెర లైసెన్స్ రుసుంను హోల్‌సేల్ రిటైల్‌కు రూ.2 వేలు రిటైల్‌కు రూ.వెయ్యి, రెండింటికి రూ.3 వేలు నిర్ణయించారు. అదే విధంగా సెక్యూరిటీ డిపాజిట్ హోల్‌సేల్‌కు రూ.12 వేలు, రిటైల్‌కు రూ.6 వేలు, రెండింటికీ రూ.18వేలుగా ఉంటుంది. కాగా, చాలా మంది లైసెన్స్ లేకుండా చక్కెరను విక్రయిస్తున్నారని వారిపై చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా చక్కెర వ్యాపారులు రాంప్రసాద్, కృష్ణమూర్తి, హరికిషన్ కమిషనర్‌కు విజ్ఞప్తి చేశారు. ఇటువంటి వ్యాపారుల వివరాలను తాము అందిస్తామని తెలిపారు.

ఎముకను కత్తిరించకుండా గుండెకు కృత్రిమ కవాటం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఊపిరి పీల్చుకోవడంలో ఇబ్బంది, వణకడం, దగ్గినప్పుడు రక్తం పడటం వంటి సమస్యలతో బాధపడుతున్న వ్యక్తికి మినిమల్లీ ఇన్‌వేజివ్ పద్ధతిలో గుండెకు కృత్రిమ కవాటం ఏర్పాటు చేసి ప్రతిమ ఆస్పత్రి వైద్యులు అరుదైన ఘతన సాధించారు. నల్లగొండ జిల్లాకు దేవరకొండకు చెందిన రాంబాబు (22) గత కొంతకాలంగా గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. ఈ నెల 12న ప్రతిమి ఆస్పత్రి డాక్టర్ హరీష్‌బదామిని సంప్రదించారు. పరీక్షలు నిర్వహించి గుండెలోని కవాటం సరిగ్గా పనిచేయడంలేదని నిర్ధారించి ఈ నెల 16న మిని మల్లీ ఇన్‌వేజివ్ సర్జరీ ద్వారా కేవలం రెండు ఇంచుల కోతతో రొమ్ముభాగంలోని ఎముకను కత్తిరించకుండా కవాటాన్ని మార్చారు. ఈ పద్ధతిలో అతితక్కువ రక్తస్రావం, ఇన్‌ఫెక్షన్లు లేకుండా, రోగి త్వరగా కోలుకునే అవకాశం ఉంటుంది. ఈ సందర్భంగా డాక్టర్ హరీష్ బదామి మాట్లాడుతూ ఈ పద్ధతిలో శస్త్రచికిత్స చేయడం వల్ల రోగిని ఐదు రోజుల్లోపు డిశ్చార్జి చేయవచ్చని, అంతేకాకుండా 15 రోజుల్లో దైనందిన కార్యక్రమాల్లో పాల్గొనవచ్చని తెలిపారు. రోగి ఆరోగ్యంగా ఉండటంతో డిశ్చార్జీ చేశామని వివరించారు. వాతావరణ కాలుష్యం, అధిక ఒత్తిడి, ఆహారపు అలవాట్లు, జీవనశైలిలో మార్పుల వల్ల గుండె సంబంధిత వ్యాధులు పెరుగుతున్నాయని చెప్పారు. శస్త్రచికిత్సలో అనస్థీషియాలాజిస్ట్ డాక్టర్ ఎంఎల్ ప్రశాంత్‌కుమార్ ఇతర వైద్య బృందం పాల్గొన్నారు.

ఆయూష్ డాక్టర్లకు పదోన్నతులు, పోస్టింగులు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఆయుష్ విభాగంలోని యునాని డాక్టర్లకు ప్రభుత్వంలో పదోన్నతులు కల్పించి పోస్టింగ్‌లు ఇచ్చింది. హైదరాబాద్‌లోని ప్రభుత్వ ఇండియన్ ఫార్మసీ (యూ), సూపరింటెండెంట్‌గా డాక్టర్ లియాఖత్ అలీఖాన్, ప్రభుత్వ నిజామియా జనరల్ ఆస్పత్రి (హైదరాబాద్) చీఫ్ మెడికల్ అధికారులుగా డాక్టర్ ఎన్.కవిత, డాక్టర్ మహ్మద్ సలీమూర్ రెహమాన్, డాక్టర్ నసరీన్ జహన్, డాక్టర్ కే.చంద్ర భూషన్ రావు, డాక్టర్ మహ్మద్ అబ్దుల్ వకీల్, రెసిడెంట్ మెడికల్ అధికారిగా హెచ్‌జీ మహ్మద్ ఫియాజ్, అదే ఆస్పత్రిలో చీఫ్ మెడికల్ అధికారిగా పనిచేస్తున్న డాక్టర్ పర్వీన్ సుల్తానా ఇక నుంచి సూపరింటెండెంట్‌గానూ, అదే క్యాడర్‌కు చెందిన డాక్టర్ జే.వసంతరావును ఆయుష్ విభాగంలో రీజనల్ డిప్యూటీ డైరెక్టర్‌గా నియమితులయ్యారు. అదేవిధంగా సీనియర్ మెడికల్ అధికారి (హోమియా) డాక్టర్ ఎస్.కమల ఇక నుంచి రామంతపూర్‌లోని ప్రభుత్వ హోమియా ఆస్పత్రిలో చీఫ్ మెడికల్ అధికారిగా వ్యవహరిస్తారు. ఈమేరకు రాష్ట్రవైద్య ఆరోగ్య శాఖ స్పెషల్ చీఫ్ సెక్రెటకీ రాజేశ్వర్ తివారీ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

మేనేజ్‌తో ట్రిపుల్‌ఐటీహెచ్ ఒప్పందం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అగ్రికల్చరల్ ఎక్స్‌టెన్షన్ మేనేజ్‌మెంట్ (మేనేజ్)తో ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ట్రిపుల్‌ఐటీ) హైదరాబాద్ బుధవారం ఒప్పందం కుదుర్చుకున్నాయి. ఒప్పంద పత్రాలపై మేనేజ్ డైరెక్టర్ జనరల్ వి ఉషారాణి, ట్రిపుల్‌ఐటీహెచ్ డైరెక్టర్ పిజె నారాయణ సంతకాలు చేశారు. అనంతరం సంయుక్తంగా ఓ ప్రకటన విడుదల చేశారు.

నవంబర్ 13న 'నాస్' పరీక్ష

తెలంగాణ రాష్ట్రంలో నవంబర్ 13న జాతీయ అంచనా సర్వే(నాస్) పరీక్ష ఉంటుందని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ జి కిషన్ బుధవారం తెలిపారు. రాష్ట్రంలోని 3,5,8వ తరగతి విద్యార్థులకు ఈ పరీక్ష నిర్వహిస్తున్నట్టు చెప్పారు.

పర్యాటకులకు వసతులు కల్పిస్తాం

- పర్యాటకులకు వసతులు కల్పిస్తాం : రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ చైర్మెన్ నరేందర్‌రెడ్డి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్



ప్రయివేటు పెట్టుబడుల సహకారంతో పర్యాటకులకు వసతులు కల్పిస్తామని రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ చైర్మెన్ బండ నరేందర్‌రెడ్డి అన్నారు. పర్యావరణానికి అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. బుధవారం హైదరాబాద్ నగర శివార్లల్లోని కొత్తగూడ రిజర్వు ఫారెస్ట్‌లో మీడియాతో మాట్లాడారు. దాదాపు రూ. కోటి నిధులతో కొత్తగూడ రిజర్వు ఫారెస్ట్‌ను అభివృద్ధి చేసినట్టు చెప్పారు. ఈసందర్భంగా మీడియాకు అక్కడ చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను తిప్పి చూపించారు. కార్పొరేషన్ ఆధ్వర్యంలో పర్యావరణ పర్యాటకాన్ని మరింత అభివృద్ధి చేస్తామని ప్రకటించారు. కొత్త ప్రాజెక్టులను చేపట్టి పర్యాటకులకు కాలుష్య రహితమైన వాతావరణం, ఆహ్లాదం, విజ్ఞానాన్ని అందిస్తామన్నారు. అటవీ సంపదను సంరక్షించేలా అవగాహన కలిగిస్తామన్నారు. ప్రస్తుతం రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉన్న 274 ఎకరాల కొత్తగూడ రిజర్వు అటవీ ప్రాంతాన్ని హైదరాబాద్ ప్రజలు సహజవనంగా వాడుకోవడం జరుగుతున్నదన్నారు. ఈ ఈటవీ ప్రాంతానికి ప్రతిరోజు వచ్చే వాకర్లతోపాటు సైబరాబాద్ నగర ప్రజలే కాకుండా చుట్టు పక్కల ప్రాంతాల వారు ఆస్వాదిస్తున్నారని చెప్పారు. అలాగే సందర్శకుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని భారత ప్రభుత్వ అటవీ పర్యావరణ శాఖ అనుమతితో పలురకాల అభివృద్ధి పనులు చేపట్టడం జరుగుతున్నదన్నారు. కొత్తగూడ ప్రాజెక్టులో సౌరశక్తి విద్యుత్ ఉత్పాదన కేంద్రం, ఇంటర్‌ప్రిటేషన్, దృశ్యశ్రవణ కేంద్రం, ఎత్నిక్ కాటేజ్, పర్యావరణ విజ్ఞాన కేంద్రం, అటవీ ఉత్పాదనల విక్రయ కేంద్రం, బోటింగ్ సదుపాయం, పిల్లల పార్కు, పార్కు ప్రత్యేక కార్యాలయం, మూత్రశాలలు, కేఫటేరియా, యోగా, ధ్యాన కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్టు చెప్పారు. 30 కిలో లీటర్ల పరిమాణానికి సరపడా ఎస్టీపీని ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. పారదర్శకతకు నెలవుగా సందర్శకుల ప్రవేశానికి ఎలక్ట్రానిక్ పద్దతిలో పార్కు ప్రవేశానికి పాసులను ఇచ్చే ఏర్పాట్లు చేసినట్టు వివరించారు. రాక్‌పూల్ సెక్టారులో 1500 చదరపు మీటర్ల విస్తీర్ణంలో పచ్చిక బయళ్ల ఏర్పాటు, ప్రధాన ప్రవేశ ద్వారం నుంచి కార్యాలయం వరకు ఆయా రకాల ఆకర్షనీయమైన పూలమొక్కలను నాటడం జరిగిందన్నారు. టీఎస్ఎఫ్‌డీసీ మేనేజింగ్ డైరెక్టర్ చందన్‌మిత్ర, అసిస్టెంట్ డైరెక్టర్ రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నారై పాలసీ రూపొందించాలి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్



టీఆర్ఎస్ ఎన్నికల మ్యానిఫెస్టోలో ఎన్నారైల కోసం ముఖ్యమంత్రి కె చంద్రశేఖరరావు అనేక హామీలు ఇచ్చినా అధికారంలోకి వచ్చాక ఏ ఒక్క హామీని అమలు చేయలేదని మాజీ స్పీకర్ కెఆర్ సురేష్‌రెడ్డి చెప్పారు. వెంటనే ఎన్నారై పాలసీ రూపొందించాలని డిమాండ్ చేశారు. బుధవారం గాంధీభవన్‌లో కాంగ్రెస్ ఎన్నారై విభాగం చైర్మెన్ వినోద్, కో చైర్మెన్ దేవేందర్‌రెడ్డిలతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు.గల్ఫ్ ఎన్నారైల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం గా వ్యవహరిస్తోందన్నారు. ఆరు వందల మంది గల్ఫ్‌లో చనిపోతే...ఒక్కపైసా ప్రభుత్వ సాయం అందలేదన్నారు. గత మూడేండ్లలో చనిపోయిన వారి కుటుంబాలకు అయిదు లక్షల పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

ప్రజాభిప్రాయ సేకరణ కాదు...బలసమీకరణ : జీవన్‌రెడ్డి

కాళేశ్వరం ప్రాజెక్టు కోసం రాష్ట్ర ప్రభుత్వం చేపట్టింది ప్రజాభిప్రాయ సేకరణ కాదు... టీఆర్ఎస్ బలసమీకరణ కార్యక్రమంగా మారిందని సీఎల్పీ ఉపనేత జీవన్‌రెడ్డి అన్నారు. పోలీసుల కన్నుసన్నల్లో బలవంతంగా ఒప్పంద పత్రాలపై సంతకాలు పెట్టిస్తున్నారని విమర్శించారు. బుధవారం గాంధీభవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. భూసేకర చట్టం 2013 అమలు చేయాలన్న డిమాండ్‌ను ప్రభుత్వం అమలు చేయాలన్నారు. ప్రాజెక్టుల నిర్మాణం పేరుతో ప్రభుత్వం భూనిర్వాసితుల నష్టపరిహారాన్ని తగ్గిస్తోందన్నారు. కాంట్రాక్టర్లకు అంచనాలు పెంచుతున్న సర్కారుకు రైతులకు పరిహారం మాత్రం ఇవ్వడం లేదన్నారు.

సమస్యపై చర్చించలేక నాపై విమర్శలా?: వంశీచంద్ రెడ్డి

తనతో బహిరంగ చర్చకు వచ్చే దమ్ములేక టీఆర్ఎస్ నేతలు నాపై విమర్శలు చేస్తున్నారని కాంగ్రెస్ ఎమ్మెల్యే చల్లా వంశీచంద్‌రెడ్డి చెప్పారు. కల్వకుర్తి నియయోజకవర్గ ప్రజలకు జరుగుతున్న అన్యాయాన్ని ప్రశ్నిస్తే తాను సంస్కార హీనుడంటూ మాట్లాడు వారి కుసంస్కారానికి నిదర్శనమన్నారు. బుధవారం అసెంబ్లీ ఆవరణలోని మీడియా హాల్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. తన మాటలు తప్పైయితే అసెంబ్లీ ముందు ముక్కు నేలకు రాస్తానన్నారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు నుంచి ఇతర ప్రాంతాలకు నీళ్లు తరలించవచ్చు వద్దని లేఖ విషయం నిజం కాదా అని ప్రశ్నించారు. ఈ విషయంపై తాము అసెంబ్లీలోనే తేల్చుకుంటామన్నారు.

ప్రజాభిప్రాయ సేకరణ టీఆర్ఎస్ కుట్ర : భట్టి విక్రమార్క

కాళేశ్వరం ప్రాజెక్టుపై ప్రజాభిప్రాయం కార్యక్రమం టీఆర్ఎస్ కుట్ర పూరితంగా వ్యవహరిస్తోందని టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షులు మల్లు భట్టి విక్రమార్క అన్నారు. రైతుల తరపున ప్రశ్నిస్తే...పోలీసులతో దాడులు చేయిస్తున్నారని, మాజీ మంత్రి శ్రీధర్‌బాబుతోపాటు ఇతర నాయకులను అరెస్టు చేయడాన్ని తాము ఖండిస్తున్నామన్నారు. ప్రభుత్వం బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.: బుధవారం సీఎల్పీ కార్యాలయంలో మండలిలో ఉపనేత పొంగులేటి సుధాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే వంశీ చంద్ రెడ్డిలతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు..ప్రాజెక్టుల పేరుతో ప్రభుత్వం అడ్డగోలుగా వ్యవహరిస్తుందన్నారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత టీఆర్ఎస్ ప్రభుత్వం ఏ ఒక్క ప్రాజెక్టుకు జాతీయ హెూదా సాధించలేదని ఆయన విమర్శించారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం : కవిత

నవతెలంగాణ-బోధన్ రూరల్

తెలంగాణ ప్రభుత్వం అన్నివర్గాల సంక్షేమం కోసమే కృషి చేస్తోందని, వారి అభివద్ధి కోసం కోట్ల రూపాయల నిధులను ఖర్చు చేస్తోందని నిజామాబాద్ పార్ల మెంటు సభ్యురాలు కల్వకుంట్ల అన్నారు. నిజామాబాద్ జిల్లా బోధన్ మండలం లోని సాలూర గ్రామంలో బుధవారం నిర్వహించిన మనఊరు-మన గ్రామం కార్యక్రమంలో భాగంగా ఆమె గ్రామంలోని ప్రతి కాలనీని సందర్శించి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం స్థానిక టీటీడీ కల్యాణ మండపంలో నిర్వహించిన సభలో కవిత మాట్లాడుతూ...సాలూర గ్రామానికే ప్రతినెలా పింఛన్ కోసం రూ.8లక్షలు వెచ్చిస్తున్నామని అన్నారు. సాలూర గ్రామంలో డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల కోసం 150 దరఖాస్తులు వచ్చాయని, ప్రతి ఒక్కరికీ ఇల్లు కట్టించేలా చూస్తామని హామీనిచ్చారు. రోడ్ల అభివృద్ధికి రూ.15లక్షల నిధులు మంజూరు చేస్తున్నట్టు ప్రకటించారు. ఫతేపూర్‌కు మహిళా సంఘం భవనం మంజూరు చేశారు. కులసంఘాల విజ్ఞప్తి మేరకు ముదిరాజ్ సంఘానికి రూ.15 లక్షలు, అంబేద్కర్ విగ్రహం, ఎస్సీ కమ్యూనిటీ హాల్ కోసం రూ.5లక్షలు, మైనారిటీ షాదీఖానాకు రూ.5లక్షలు, గౌడ సంఘానికి రూ.3 లక్షలు మంజూరు చేస్తున్నట్టు తెలిపారు. రజకుల కోరిక మేరకు దోబీఘాట్ మంజూరు చేశారు. చాకలి ఐలమ్మ విగ్రహానికి శంకుస్థాపన చేశారు. రూ.లక్షతో నాయీబ్రాహ్మణుల దుకాణాలను ఆధునికరిస్తున్నామని తెలిపారు. అలాగే హైస్కూల్‌లో ఏడు అదనపు తరగతి గదులను, కంప్యూటర్లను తెలంగాణ జాగతి తరపున ఇస్తామని ప్రకటించారు. బోధన్ నుంచి సాలూర వరకు గల రహదారి అభివద్ధికి రూ.25కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. సాలూర నుంచి హూన్స వరకు రోడ్డు పనులకు రూ.5 కోట్లు మంజూరయ్యాయని చెప్పారు. దాన్ని మందర్న వరకు పొడిగించాలని గ్రామస్తులు కోరారు. అలాగే బైపాస్ రోడ్డు మరమ్మతులకు రూ.5.5 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే షకీల్‌ఆమేర్, ఎమ్మెల్సీ వీజీ గౌడ్, డీసీసీబీ చైర్మెన్ గంగాధర్ పట్వారి, మున్సిపల్ చైర్మెన్ ఎల్లయ్య, సర్పంచ్ గంగామణి, ఎంపీపీ గంగాశంకర్, జడ్పీటీసీ అల్లె లావణ్య, సొసైటీ చైర్మెన్ బుద్దె రాజేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

కుంటలోపడి ఇద్దరు బాలురు మృతి

నవతెలంగాణ - బోథ్

సరదాగా కుంటలో స్నానానికెళ్లిన ఇద్దరు బాలురు ప్రమాదవశాత్తు మునిగిపోయి మృతి చెందారు. ఈ ఘటన ఆదిలాబాద్ జిల్లా బోథ్ మం డలంలో బుధ వారం జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం... సాకెర గ్రామానికి చెందిన జాదవ్ ధర్మేందర్(14), జాదవ్ హరికృ ష్ణ(13), రాథోడ్ సురేష్ మేకల కాపరులు.బుధవారం మేకలు కాస్తూ మధ్యా హ్నం రెండు గంటల సమయంలో టివిటి గ్రామ రాజో బా గుట్ట సమీపంలో స్నానం చేయడానికి నీటి కుంట లో దిగారు. ముందుగా హరికృష్ణ నీటిలో మునిగి పోతుండగా, ధర్మేందర్ ఆయనను కాపాడడానికి వెళ్లి.. అతన్ని గట్టిగా పట్టుకున్నాడు. ఒడ్డుపై ఉన్న రాథో డ్‌సురేష్ అది గమనించి కట్టెల సాయంతో వారిని కాపాడే ప్రయ త్నం చేశాడు. అయితే, వారు కట్టెను గట్టిగా లాగ డంతో కాలు జారి రాథోడ్ సురేష్ కూడా నీటిలో పడిపోయాడు.దాంతో వెంటనే కట్టెను విడిచి పెట్టడంతో ధర్మేందర్, హరికృష్ణ మునిగిపోయారు. బయటకు వచ్చిన సురేష్ గ్రామస్తులకు సమాచారం అందించగా, కుంటకు చేరుకుని గాలించారు. అప్పటికే ఇద్దరు మృతిచెందారు.

బెవరేజెస్ కార్పొరేషన్ చైర్మెన్ భవన్ ప్రారంభం

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ఆబ్కారీ భవన్‌లో తెలంగాణ బెవరేజ్ కార్పొరేషన్ చైర్మెన్ కార్యాలయాన్ని ఆ కార్పొరేషన్ చైర్మెన్ దేవీ ప్రసాదరావు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ వ్యాపారులు, వినియోదారులు, ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండే విధంగా ఆబ్కారీ భవన్‌లోని ఐదో అంతస్థులో ఏర్పాటు చేశామన్నారు. సీఎం కేసీఆర్ మార్గదర్శకత్వంలో ఎక్సైజ్ శాఖ మంత్రి పద్మారావు ఆధ్వర్యంలో కార్పొరేషన్ పని విధానం మెరుగుపరిచి అభివృద్ధికోసం పాటుపడ తానన్నారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ శాఖ కమిషనర్ చంద్రవదన్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ అకున్ సబర్వాల్, టీఎన్జీవోస్ రాష్ట్ర అధ్యక్షులు కారం రవీందర్‌రెడ్డి, ప్రధానకార్యదర్శి రాజేందర్, టీజీవో జనరల్ సెక్రెటరీ సత్యనారాయణతోపాటు అన్ని జిల్లాల టీఎన్జీవో స్ నాయకులు, మహిళానేతలు హాజరై పాల్గొన్నారు.

సీపీఎస్‌ను రద్దు చేయాల్సిందే : టీఎన్జీవో

ఉద్యోగులకు వర్తింపచేసిన కాంట్రిబ్యూటరీ పింఛన్ స్కీం (సీపీఎస్)ను రద్దు చేయాల్సిందేనని తెలంగాణ నాన్ గెజిటెడ్ ఆఫీసర్ల అసోసియేషన్ (టీఎన్జీవో) కేంద్ర సంఘం తెలిపింది. బుధవారం టీఎన్జీవో కార్యవర్గ సమావేశం జరిగింది. అనంతరం టీఎన్జీవో అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కారం రవీందర్‌రెడ్డి, మామిళ్ల రాజేందర్ ఓ ప్రకటన విడుదల చేశారు. సీపీఎస్ రద్దు చేయాలని పాత పింఛన్ విధానాన్ని కొనసాగించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 30,31 తేదీల్లో ఉద్యోగుల ప్రదర్శనలు నిర్వహించాలని తెలిపారు. వచ్చేనెల ఐదిన అన్ని జిల్లా, డివిజన్ కేంద్రాలతోపాటు హైదరాబాద్‌లో ప్రభుత్వ కార్యాలయాల వద్ద భోజన విరామ సమయంలో నిరసన కార్యక్రమాలు చేయాలని పిలుపునిచ్చారు.

ప్రతిభే సమాధానం చెబుతుంది..


ధనుష్

'నేనెప్పుడూ ఏదో ఒక పనిచేస్తూనే ఉంటాను. ఐ యామ్ రెస్ట్‌లెస్. విశ్రాంతి తీసుకోవడం ఇష్టం ఉండదు' అని అంటున్నారు హీరో ధనుష్. సౌందర్య రజనీకాంత్ దర్శకత్వంలో ధనుష్, అమలా పాల్, కాజోల్ ముఖ్యపాత్రధారులుగా రూపొందిన చిత్రం 'వీఐపీ 2'. ఈ చిత్రం ఈనెల 25న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా బుధవారం హైదరాబాద్‌లో హీరో ధనుష్ మీడియాతో సంభాషించారు. ఆ విశేషాలేమిటో ఓ లుక్కేద్దాం..

ఇది కరెక్ట్ అనిపించింది..

'రఘువరన్ బి.టెక్' చిత్రం తెలుగులో మంచి ఆదరణ పొందింది. ఆ తర్వాత తెలుగు స్ట్రయిట్ సినిమా చేయాలనుకున్నప్పుడు 'వీఐపీ 2' కరెక్ట్ చిత్రమనిపించింది. అలా ఈ చిత్రాన్ని బైలింగ్వల్‌గా చేశాను. నేను నటించిన తొలి తెలుగు స్ట్రయిట్ సినిమా ఇది. తమిళంలో ఈ నెల 11న విడుదలై విశేష ఆదరణ పొందింది. సినిమాపై రివ్యూస్ మిశ్రమంగా వచ్చినప్పటికీ కలెక్షన్ల పరంగా బాగా రన్ అవుతోంది. ఒక సినిమా హిట్ అయ్యిందని చెప్పడానికి కలెక్షన్లే ప్రధానం. తెలుగులో కూడా ఈ చిత్రం పెద్ద విజయం సాధిస్తుందని నమ్ముతున్నాం. ఈ నెల 11నే తెలుగులో కూడా రిలీజ్ చేయాలని భావించాం. కానీ ఆ రోజు ఇక్కడ మూడు పెద్ద సినిమాలుండటంతో థియేటర్లు దొరకలేదు. దీంతో ఈనెల 25న ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నాం.

అద్భుతంగా ఆవిష్కరించింది..

గత చిత్రంతో పోల్చితే ఇది భిన్నమైనది కాదు. 'రఘువరన్ బి.టెక్'లో కనిపించిన పాత్ర మాదిరిగానే ఇందులోనూ కనిపిస్తాను. ఇతర పాత్రలు, వాటి తీరుతెన్నులన్నీ సేమ్. కాకపోతే ఆ చిత్రానికి కొనసాగింపుగా ఈ సినిమా ఉంటుంది. కాజోల్ పాత్ర కొత్తగా ఉంటుంది. సరదా సన్నివేశాలు, కామెడీ, ఎంటర్‌టైన్‌మెంట్, సెంటిమెంట్, మాస్ ఎలిమెంట్స్ ఇలా అన్ని ఒక ప్యాక్డ్‌గా ఉంటాయి. ఫస్ట్ పార్ట్‌లోని హైలైట్ పాయింట్స్, డైలాగ్‌లను, పేర్లను కొన్ని ఇందులో కూడా కంటిన్యూ చేశాం. 'అమూల్ బేబీ' లాంటివి అందులో ఒకటి. ఈ చిత్ర కథను నేనే రాసుకున్నాను. ఈ చిత్రానికి కలైపులి ఎస్.థాను నిర్మించడానికి ఆసక్తి చూపించారు. ఈ చిత్రానికి డైరెక్టర్‌గా సౌందర్య పర్‌ఫెక్ట్ పర్సన్ అనిపించి ఆమెకు ఈ స్క్రిప్ట్ ఇచ్చాను. స్రిప్ట్‌ను ఓన్ చేసుకుని అద్భుతంగా తెరకెక్కించారు. నేను ఏదైతే ఊహించానో దాన్నే తెరపై ఆవిష్కరించింది.

కాజోల్ పాత్ర చాలా స్ట్రాంగ్..

ఇందులో నా ప్రత్యర్థి పాత్ర చాలా స్ట్రాంగ్‌గా ఉంటుంది. ఆ రోల్ తీరుతెన్నులు చాలా స్టయిలీష్‌గా ఉంటూనే, సక్సెస్‌ఫుల్ ఇండిపెండెంట్ ఉమెన్ అయి ఉండాలి. పాత్ర చాలా మెజిస్టిక్‌గా వ్యవహరించాలి. అందుకు కాజోల్ బాగా సూట్ అవుతుందనిపించి ఎంపిక చేశాం. నాకు ప్రత్యర్థిగా ఆమె చాలా అద్భుతంగా నటించారు. బేసిక్‌గా చాలా టాలెంటెడ్ యాక్టర్. సౌందర్య లేడీ డైరెక్టర్ అయినంత మాత్రాన మరోలా మనం చూడాల్సిన అవసరం లేదు. ఇక్కడ ప్రతి ఒక్కరూ రాణించడానికి మంచి స్కోప్ ఉంది. మహిళా దర్శకులకు సినిమా ఛాలెంజింగ్‌గా ఉంటుందనే దాని కంటే తాము చేసే పని ఎంత బాగా చేస్తున్నారన్నదే ముఖ్యమని నా అభిప్రాయం.

టాలెంట్ ఉంటేనే రాణించగలం..

చిత్ర పరిశ్రమలో వారసులు, బ్యాక్‌గ్రౌండ్ ఉన్నవారే రాణిస్తున్నారనే కామెంట్స్ వినిపిస్తున్నాయి. ఇది ఎక్కడైనా కామన్. ఎక్కడైనా రాణించాలంటే టాలెంట్ ముఖ్యం. ప్రతిభ ఉంటేనే మనుగడ సాధించగలం. సినిమాలోనూ అంతే. హార్డ్ వర్క్ చేయాలి. ప్రతిభే అన్నింటికి సమాధానం చెబుతుంది. నేనెప్పుడూ ఏదో ఒక పని చేస్తూనే ఉంటాను. రెస్ట్‌లెస్‌గా ఉండటమే నాకు ఇష్టం. అలాగే నేను ఏ దర్శకుడితో పనిచేసినా నా పాత్రకు న్యాయం చేసేందుకు ప్రయత్నిస్తాను. ఇటీవల బాలీవుడ్‌తోపాటు, హాలీవుడ్‌లో కూడా నటించాను. అలా నటించడం వల్ల చాలా విషయాలు నేర్చుకున్నా. ముఖ్యంగా నటుడిగా నేను మెరుగుపడ్డాను. దీంతోపాటు ముందస్తు ప్లానింగ్ ఎలా ఉండాలనేది బాగా తెలిసింది. సినిమా ప్రారంభానికి ముందు ప్రీ ప్రొడక్షన్ వర్క్ ఎలా చేసుకోవాలనేదానిపై పట్టు సాధించాను. సినిమాను ఎలా తీయాలి, బడ్జెట్, ఇలా అన్ని విషయాల్లో ఆరు నెలల ముందే ఓ క్లారిటీతో ఉంటే మనకు కావాల్సిన అవుట్‌పుట్ రాబట్టవచ్చని తెలుసుకున్నాను.

ఎవరికైనా ఉంటుంది..

ప్రస్తుతం 'వాడా చెన్నై'లో చేస్తున్నా. దీన్ని తెలుగులోనూ విడుదల చేస్తాం. అలాగే 'మారి 2' సినిమాను బైలింగ్వల్‌గా తెరకెక్కించబోతున్నాం. అది ఈ ఏడాదిలోనే ప్రారంభమవుతుంది. నేను దర్శకత్వం వహించిన 'పవర్ పాండి' చిత్రం తమిళంలో మంచి విజయం సాధించింది. దీన్ని తెలుగులో రీమేక్ చేయాలా?, డబ్బింగ్ చేయాలా ? అనే దానిపై ఇంకా నిర్ణయం తీసుకోలేదు. అది విధిపై ఆధారపడి ఉంటుంది. దర్శకుడిగా నా తదుపరి చిత్రాల గురించి చెప్పాలంటే ఒకటి రెండు స్క్రిప్ట్స్ రాస్తున్నాను. అందులో ఏది చేయాలనేదానిపై సందిగ్ధంలో ఉన్నా. అలాగే సెల్వ రాఘవన్‌తో నటించే సినిమా వచ్చే ఏడాది ఉంటుంది. నెక్స్ట్ నేను నటించే సినిమాలు కచ్చితంగా బైలింగ్వల్‌గా ఉండేలా చూసుకుంటాను. నిర్మాణాన్ని కూడా ఇక్కడ విస్తరించాలనుకుంటున్నా. రజనీకాంత్‌తో సినిమా ఎప్పుడని అడుగుతున్నారు. ఆయనతో పనిచేయాలని ఎవరికైనా ఉంటుంది. నేను కూడా ఎదురు చూస్తున్నాను.

కేదార్‌నాథ్ వరదల నేపథ్యంలో

ప్రేమకథ..


సుషాంత్ సింగ్ రాజ్‌పుత్, సారా అలీఖాన్

వరదల బీభత్స తాకిడికి 2013లో ప్రసిద్ధ పుణ్యక్షేత్రం కేదార్‌నాథ్ అతలాకుతలమైన విషయం విదితమే. ఈ ఘోర విపత్తులో దాదాపు ఆరు వేల మంది మృత్యువాత పడ్డారు. ఈ వరదల నేపథ్యంలో ఓ ప్రేమకథా చిత్రాన్ని తెరకెక్కించేందుకు బాలీవుడ్ దర్శకుడు అభిషేక్ కపూర్ సన్నాహాలు చేస్తున్నారు. ఈ చిత్రానికి 'కేదార్‌నాథ్' అనే టైటిల్ ఖరారు చేశారు. దీనికి 'లవ్ ఈజ్ ఈ పిలిగ్రిమేజ్' అనే క్యాప్షన్ కూడా పెట్టారు. ఈ చిత్ర పోస్టర్‌ను దర్శక, నిర్మాత అభిషేక్ కపూర్ బుధవారం విడుదల చేశారు. ఈ నేపథ్యంలో ఆయన మాట్లాడుతూ,'నా గత చిత్రాల మాదిరిగానే ఎంతో ప్యాషన్‌గా ఈ చిత్రకథను రాసుకున్నాను. అత్యంత అద్భుతమైన కేదార్‌నాథ్ టెంపుల్ బ్యాక్‌డ్రాప్‌లో సాగే ప్రేమకథ ఇది. ఇందులో సుషాంత్‌సింగ్, సారా అలీ ఖాన్ ప్రేమ జంటగా నటిస్తున్నారు. టూరిస్ట్ గైడ్‌గా సుషాంత్, టూరిస్ట్‌గా సారా పాత్రలు ప్రేక్షకుల మదిని దోచేస్తాయని నమ్మకంగా చెప్పగలను. ఇప్పటికైతే ఈచిత్రం గురించి ఇంతే చెప్పగలను. మిగిలింది సినిమానే చెబుతుంది' అని చెప్పారు. '2013లో కేదార్‌నాథ్‌లో వరదలు విలయతాండవం చేశాయి. ఈ ఘోర విపత్తులోనూ సుషాంత్, సారాల మధ్య ప్రేమ ఎలా చిగురించింది?, వరదల నుంచి బయటపడి తమని, తమ ప్రేమని కాపాడుకున్నారా లేదా అనేది ఈ చిత్ర ఇతివృత్తం' అని బాలీవుడ్ వర్గాలు తెలియజేస్తున్నాయి.

నవచిత్రం

ఈ విజయమే ఉదాహరణ

- 'జయ జానకి నాయక' సక్సెస్‌మీట్‌లో బోయపాటి శ్రీను


నందు, మిర్యాల రవీందర్‌రెడ్డి, బోయపాటి శ్రీను, రకుల్ ప్రీత్ సింగ్, బెల్లంకొండ సాయి శ్రీనివాస్

'తరాలు మారినా మనుషుల మధ్య ఉండే హ్యూమన్ ఎమోషన్స్ మారవు. వాటిని బేస్ చేసుకుని ప్రేక్షకుల హృదయాలకు హత్తుకునేలా సినిమా తీస్తే సక్సెస్ సాధించవచ్చు. అందుకు 'జయ జానకి నాయక' విజయమే ఉదాహరణ' అని చెబుతున్నారు దర్శకుడు బోయపాటి శ్రీను.

బెల్లంకొండ సాయి శ్రీనివాస్, రకుల్ ప్రీత్ సింగ్, ప్రగ్యా జైశ్వాల్ హీరో, హీరోయిన్లుగా బోయపాటి శ్రీను దర్శకత్వంలో మిర్యాల రవీందర్‌రెడ్డి నిర్మించిన 'జయ జానకి నాయక' చిత్రం ఇటీవల విడుదలైన నేపథ్యంలో బుధవారం హైదరాబాద్‌లో సక్సెస్‌మీట్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు బోయపాటి మాట్లాడుతూ, 'ఈ చిత్రాన్ని ముందు నుంచి నేను నమ్మి చేశాను కాబట్టే ఇంత పెద్ద విజయం సాధించింది. ఈ చిత్రం కోసం ఆర్టిస్టులు, టెక్నీషియన్లు ప్రాణం పెట్టి చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఇండస్ట్రీకి మంచి నిర్మాత అవసరం. అలాంటి వారిలో మిర్యాల రవీందర్‌రెడ్డి ది బెస్ట్. ఆయనకు సినిమా అంటే ప్యాషన్. దానికోసం ఏదైనా చేస్తారు. ఆయన బ్యానర్‌లో మళ్ళీ మళ్ళీ సినిమాలు చేస్తాను. ఈ చిత్రం రెండో వారంలో కూడా హౌస్‌ఫుల్ కలెక్షన్లతో రన్ అవుతుంది. సినిమాను ఇంత పెద్ద హిట్ చేసిన తెలుగు ప్రేక్షకులకు మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నాను' అని అన్నారు.

'నా లైఫ్ ఛేంజింగ్ చిత్రం అందించిన బోయపాటికి థ్యాంక్స్. సినిమా ప్రారంభించినప్పుడే ఇది ప్రతి గుండెను తాకే చిత్రమవుతుందని కాన్ఫిడెంట్‌తో తీశారు. ఇప్పుడు ప్రేక్షకులు సినిమాను గుండెల్లో పెట్టుకుని ఆదరిస్తున్నారు. నిర్మాత మిర్యాల రవీందర్‌రెడ్డి చాలా భారీగా సినిమాను తెరకెక్కించారు. పోటీలోనూ విడుదల చేసి మాకు పెద్ద హిట్ ఇచ్చారు. ఇది మర్చిపోలేని జర్నీ' అని హీరో బెల్లంకొండ సాయి శ్రీనివాస్ తెలిపారు.

నిర్మాత మిర్యాల రవీందర్‌రెడ్డి చెబుతూ, 'అన్ని వర్గాల ప్రేక్షకులకు నచ్చే చిత్రం చేసినందుకు చాలా గర్వంగా ఉంది. ఇలాంటి సినిమాను భవిష్యత్‌లో చేస్తానో లేదో తెలియదు. మంచి సందేశం ఉన్న ఈ సినిమాను చూసిన ప్రతి ఒక్కరు బాగా ఎంజాయ్ చేస్తున్నారు. ఈ చిత్రాన్ని 'జైలవకుశ' విడుదల వరకు థియేటర్‌లో కొనసాగించే ఓపిక నాకుంది. అప్పటి వరకు ఆదరించాలని కోరుతున్నా' అని చెప్పారు.

'ఇందులో మహిళలకు సంబంధించి ఉన్న స్ట్రాంగ్ మెసేజ్ అందరికి రీచ్ అయ్యింది. ఎమోషన్స్, సెంటిమెంట్, డ్రామా సీన్స్ బాగా క్యారీ అయ్యాయి. లుక్ పరంగా, క్యారెక్టర్ పరంగా బోయపాటిగారు నన్ను కొత్త చూపించారు. ఆయనతో మళ్ళీ పనిచేయాలనుకుంటున్నాను. సినిమాను ఇంకా పెద్ద హిట్ చేయాలని ప్రేక్షకులను కోరుకుంటున్నా' అని రకుల్ ప్రీత్ సింగ్ తెలిపారు.

ఈ కార్యక్రమంలో నందు, శివనారాయణ, ప్రభు, రూప, శ్రావణ్, సురేష్, హరి తదితరులు పాల్గొని తమ పాత్రలను, చిత్రాన్ని ఆదరిస్తున్న ప్రేక్షకులకు మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలిపారు.


ప్రియాంక చోప్రా

డాడ్.. నువ్వే నా హీరో..

ఎంతటి స్టార్ అయినప్పటికీ భావోద్వేగాల విషయంలో ఆమె కూడా సాధారణ మహిళే. తండ్రిని కోల్పోయిన తనయగా తన ఆవేదనను వ్యక్తం చేసిన తీరు ప్రతి ఒక్కరి మనసు పొరల్ని స్పృశించక మానదు. తండ్రిపై ఉన్న మమకారాన్ని, ఆయన ఇచ్చిన ధైర్యాన్ని, తన స్థాయికి కారణమైన స్ఫూర్తిని గుర్తు చేసుకుంటూ గ్లోబల్ స్టార్ హీరోయిన్ ప్రియాంక చోప్రా బుధవారం ఓ ట్వీట్ చేశారు. తన తండ్రి అశోక్ చోప్రా జయంతి సందర్భంగా ట్విట్టర్ వేదికగా ఓ ఫ్యామిలీ ఫొటోతోపాటు 'హ్యాపీ బర్త్‌డే నాన్నా.. నువ్వెప్పటికీ నా హీరోవే. నిన్ను చాలా మిస్సవుతున్నా' అని ట్వీట్ చేసింది. ప్రియాంక ఇప్పుడే కాదు తాను గెలిచినప్పుడు లేదా ఓడిపోయినప్పుడు కూడా ముందుగా తన తండ్రినే గుర్తు చేసుకుంటూ ఉంటారు. ఎప్పటికప్పుడు తన తండ్రితో దిగిన ఫొటోలను, ఆయన జ్ఞాపకాలను అభిమానులతో పంచుకుంటూనే ఉంటుంటారు. బుధవారం అశోక్ చోప్రా జయంతి నేపథ్యంలో తండ్రితో దిగిన కొన్ని ఫొటోలను ఇన్‌స్టాగ్రామ్ ద్వారా ప్రియాంక నెటిజన్లతో షేర్ చేసుకున్నారు. 2008 నుంచి క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న అశోక్ చోప్రా 2013లో కన్ను మూశారు. తండ్రి గుర్తుగా ప్రియాంక తన కుడి చేతికి 'డాడీస్ లిటిల్ గర్ల్' అని టాటూ కూడా వేయించుకున్నారు. నిర్మాతగా ప్రియాంక ప్రస్తుతం సిక్కిం భాషలో 'పహూనా' చిత్రాన్ని నిర్మిస్తున్నారు. అలాగే నటిగా 'ఏ కిడ్ లైక్ జాక్', 'ఈజ్ నాట్ ఇట్ రొమాంటిక్?' వంటి హాలీవుడ్ చిత్రాల్లోనూ నటిస్తూ బిజీగా ఉన్నారు. ఇదిలా ఉంటే, తాజాగా డిస్ట్రిబ్యూషన్ రంగంలోకి కూడా ప్రియాంక అడుగిడారు. ఓ పక్క నటిగా రాణిస్తూనే, మరో పక్క నిర్మాతగా, గాయనిగా, డిస్ట్రిబ్యూటర్‌గా కూడా తన మార్క్ ప్రత్యేకతను చాటుకునే ప్రయత్నం చేస్తున్నారు.

నా ఫెయిల్యూర్ లవ్‌స్టోరీ స్ఫూర్తితో..


సందీప్‌రెడ్డి వంగా

'నిజ జీవితంలో చాలా మందికి బ్రేకప్ లవ్‌స్టోరీలుంటాయి. ఆ ప్రేమ కథలో ఉండే డార్క్ మూడ్‌పై సినిమా తీయాలనుకున్నాను. ఆ ఆలోచన నుంచి వచ్చిందే 'అర్జున్‌రెడ్డి' కథ' అని చెబుతున్నారు దర్శకుడు సందీప్ రెడ్డి వంగా. విజయ్ దేవరకొండ, షాలిని జంటగా సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో రూపొందిన 'అర్జున్‌రెడ్డి' ఈ నెల 25న విడుదల కానుంది. ఈ సందర్భంగా దర్శకుడు బుధవారం మీడియాతో మాట్లాడుతూ, 'నేను ఫిజియోథెరపిస్ట్‌ని. ఫిల్మ్ మేకింగ్‌లో పీజీ కూడా చేశాను. నాగార్జున నటించిన 'కేడీ' సినిమాకు అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేశా. 'మళ్ళీ మళ్ళీ ఇది రాని రోజు' చిత్రానికి స్క్రిప్ట్ సైడ్ వర్క్ చేశా. నా జీవితంలో చూసిన సంఘటనలను స్ఫూర్తి పొంది ఈ స్క్రిప్ట్ రాసుకున్నా. నేను కూడా లవ్ ఫెయిల్యూరే. ఇందులో నా అనుభవాలు కూడా ఉంటాయి. బ్రేకప్ లవ్ స్టోరీలో డార్క్ మూడ్‌లో ఎవరూ సినిమా తీయలేదు. ఆ యాంగిల్‌లో సినిమా చేయాలనిపించి ఇది చేశాను. ఈ చిత్ర కథను ముందుగా శర్వానంద్‌కు చెప్పా. కానీ వర్కౌట్ కాకపోవడంతో విజయ్ దేవరకొండతో చేశా. విజయ్ నటించిన 'పెళ్ళి చూపులు' కంటే ముందే ఈ సినిమా చేయాల్సింది. ఆ సినిమా కోసం వెయిట్ చేశాం. దీనికితోడు ఈ సినిమాను రియల్ లొకేషన్లలో చిత్రీకరించాం. ఆ లొకేషన్లను వెతకడంతోపాటు, పర్మిషన్స్ కోసం చాలా టైమ్ పట్టింది. సినిమా పోస్టర్స్ చూసి ఈ చిత్ర కంటెంట్, డైలాగ్‌ల విషయంలో ఇటీవల బాగా ప్రచారం సాగింది. ప్రస్తుతం సమాజంలో జరిగే సంఘటలనే ఇందులో చూపించడం, మనం వాడే భాషనే ఇందులో వాడాను. చాలా ఓపెన్‌గా, రియాలిటీకి దగ్గరగా ఉంటుంది.

26 లిప్‌కిస్‌లుంటాయి. ఆ సన్నివేశంలో హీరోహీరోయిన్లు కళ్ళు మూసుకునే ఉంటారు. ఆ పోస్టర్‌ను చూసి ఆ ఫీల్‌ను క్యాచ్ చేస్తారనుకున్నా. కానీ కొందరు అందులోనూ అశ్లీలతను వెతికారు. అవేవి నాకు వల్గర్‌గా, బోల్డ్‌గా అనిపించడం లేదు. సెన్సార్ బోర్డ్ కొన్ని పదాలకు అభ్యంతరం చెప్పి మ్యూట్ చేసింది. నా దృష్టిలో అవేమి తప్పుపట్టాల్సిన పదాలు కావు. ఆ పాత్ర ఉన్న పరిస్థితుల్లో అలానే మాట్లాడుతుంది. సినిమా అంతా ఒక ఎమోషనల్ మూడ్‌లో సాగుతుంది. పాత్రలన్నీ ఎమోషనల్‌గా ఉంటాయి. సినిమా మూడు గంటలు సాగినా ఎక్కువ సేపు అనే ఫీలింగ్ కలగదు. ప్రేక్షకులు కూడా ఆ ఎమోషన్‌తో క్యారీ అవుతారు. బేసిక్‌గా నేను తెలంగాణ కాబట్టి, ఆ నేటివిటి, డైలాగ్‌లు ఇందులో ఉంటాయి.

మెడికో అర్జున్‌రెడ్డి పాత్రలో విజయ్ దేవరకొండ అద్భుతంగా నటించారు. అతని నటన మతిపోయేలా ఉంటుంది. షాలిని థియేటర్ ఆర్టిస్టు. థియేటర్ ఆర్టిస్టులు నటనకు స్కోప్ ఉంటే చాలు ఎలాంటి పాత్రనైనా చేస్తారు. ఆమెకు ఇందులో లిప్ లాక్‌లుంటాయని ముందు చెప్పలేదు. తను కూడా అభ్యంతరం చేయలేదు. సినిమా కంటెంట్‌పై, ఆర్టిస్టుల నటనపై చాలా నమ్మకంతో ఉన్నా. కచ్చితంగా సినిమా పెద్ద హిట్ అవుతుందని నమ్ముతున్నాం. నెక్స్ట్ రెండు కథలు రెడీగా ఉన్నాయి. ఓ పెద్ద హీరో నుంచి కాల్ కూడా వచ్చింది. ఈ చిత్ర ఫలితంపై నా తదుపరి సినిమా ఆధారపడి ఉంటుంది' అని అన్నారు.

ఎన్టీఆర్ సరసన..!


అను ఇమ్మాన్యుయేల్

'స్వప్న సంచారి', 'యాక్షన్ హీరో బిజు' వంటి చిత్రాలతో మాలీవుడ్ ప్రేక్షకులను అలరించిన అను ఇమ్మాన్యుయేల్ 'మజ్ను' చిత్రంతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైంది. తొలి తెలుగు చిత్రంతోనే నటిగా మంచి మార్కుల్ని సొంతం చేసుకుంది.

ఆ తర్వాత 'కిట్టు ఉన్నాడు జాగ్రత్త' చిత్రంతో ప్రేక్షకుల ఆదరణతోపాటు దర్శక, నిర్మాతల మనసుల్ని దోచిన అనుకి తెలుగునాట ఆఫర్ల మీద ఆఫర్లు వస్తున్నాయి. ఇందులో భాగంగా ఇప్పటికే గోపీచంద్ సరసన 'ఆక్సిజన్' చిత్రంలో నటించడం ఓ విశేషమైతే, పవన్‌కళ్యాణ్ సరసన ఓ చిత్రంలోను, అల్లు అర్జున్‌కి జోడీగా 'నా పేరు సూర్య' చిత్రంలోనూ నటించే అవకాశాల్ని అందిపుచ్చుకోవడం మరో విశేషం. ఇదిలా ఉంటే, తాజాగా ఎన్టీఆర్ సరసన నటించే లక్కీఛాన్స్‌నూ తన ఖాతాలో వేసుకుందని సమాచారం. ఎన్టీఆర్, త్రివిక్రమ్ కాంబినేషన్‌లో రూపొందబోయే చిత్రంలో అనుని కథానాయికగా ఎంపిక చేసినట్టు తెలుస్తోంది. ఎన్టీఆర్ ప్రస్తుతం 'జై లవకుశ' చిత్రంలో నటిస్తున్న విషయం విదితమే. అలాగే పవన్‌కళ్యాణ్‌తో త్రివిక్రమ్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న ఓ చిత్రం ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటోంది. ఇందులోనూ అను ఓ కథానాయికగా పవర్‌స్టార్ సరసన నటిస్తున్న విషయం విదితమే. ఈ చిత్రానికి 'రాజు వచ్చినాడు' అనే టైటిల్‌ను చిత్రయూనిట్ పరిశీలిస్తోందట.

డిఫరెంట్ థ్రిల్లర్


తాతినేని సత్య, సచిన్ జోషి, శివప్రసాద్ గుడిమిట్ల

సచిన్ జోషి, ఇషా గుప్తా జంటగా తాతినేని సత్య దర్శకత్వంలో వై కింగ్ మీడియా అండ్ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై రైనా జోషి నిర్మించిన చిత్రం 'వీడెవడు'. ఈ సినిమా వచ్చే నెలలో విడుదల కానుంది. ఈ సందర్భంగా మంగళవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ప్రముఖ నిర్మాత సి.కళ్యాణ్ మాట్లాడుతూ, 'విభిన్న కథా నేపథ్యంతో వస్తున్న చిత్రమిది. టైటిల్ ఆసక్తికరంగా ఉంది. ఇంటలిజెంట్ స్క్రీన్‌ప్లేతో దర్శకుడు సత్య ఈ చిత్రాన్ని బాగా తీర్చిదిద్దాడు. తెలుగు, తమిళంలో సెప్టెంబర్ 8న విడుదలవుతున్న ఈ చిత్రం పెద్ద విజయం సాధించాలి' అని అన్నారు. 'మంచి థ్రిల్లర్ చిత్రమిది. నా పాత్ర పాజిటివ్, నెగటివ్ రెండు షేడ్స్‌లో ఉంటుంది. ఇదొక ఛాలెంజింగ్ రోల్ అని చెప్పొచ్చు. యూనిక్ స్క్రీన్‌ప్లేతో సినిమా సాగుతుంది. లవ్, యాక్షన్, స్పోర్ట్స్ బ్యాక్‌డ్రాప్.. ఇలా అన్ని రకాల అంశాల మేళవింపుగా ఉంటుంది. తెలుగు ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది' అని హీరో సచిన్ జోషి తెలిపారు. దర్శకుడు తాతినేని సత్య చెబుతూ, 'నేను తెలుగులో చేసిన స్ట్రెయిట్ చిత్రమిది. బినేంద్ర మీనన్ సినిమాటోగ్రఫీ, థమన్ సంగీతం, రఘు కులకర్ణి ఆర్ట్ సినిమాకు హైలైట్‌గా నిలుస్తుంది. టీమ్ అంతా బాగా సపోర్ట్ చేశారు. సచిన్ జోషి అద్భుతంగా నటించారు. థ్రిల్లర్ నేపథ్యంలో తెరకెక్కించిన ఈ చిత్రంలో అన్ని అంశాలుంటాయి. ఆదరించాలని కోరుకుంటున్నా' అని చెప్పారు. 'సెప్టెంబర్ 2న ప్రీ రిలీజ్ వేడుకను నిర్వహించి సెప్టెంబర్ 8న సినిమాను గ్రాండ్‌గా విడుదల చేయబోతున్నాం' అని ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ శివప్రసాద్ గుడిమిట్ల తెలిపారు.

అయినప్పటికీ..


గురీందర్ చద్దా

దర్శకురాలు గురీందర్ చద్దా తెరకెక్కించిన హాలీవుడ్ 'వైస్రాయ్స్ హౌస్' చిత్రాన్ని హిందీలో 'పార్టిషన్ : 1947' పేరుతో ఇటీవల ప్రపంచ వ్యాప్తంగా విడుదల చేశారు. ఈ హిందీ వెర్షన్ చిత్రాన్ని తమ దేశంలో ప్రదర్శించకుండా పాకిస్తాన్ బ్యాన్ చేసింది. దీనిపై గురీందర్ చద్దా ట్విట్టర్‌లో స్పందించారు. 'దేశ విభజన నేపథ్యంలో నేను తెరకెక్కించిన 'పార్టిషన్: 1947' చిత్రాన్ని పాకిస్థాన్‌లో నిషేధించడం బాధాకరం. అయినప్పటికీ పాక్‌ను ఎప్పటికీ నా పూర్వీకులు ఉన్న దేశంగానే భావిస్తాను' అని ట్వీట్‌లో పేర్కొన్నారు. గురీందర్ ట్వీట్‌కు నెటిజన్లు సపోర్ట్ చేస్తూ సోషల్ మీడియాలో విశేషంగా స్పందించారు.

రైతును ముంచారు

కేంద్రం ఉత్తర్వులు బుట్టదాఖలు

- కొత్త ఖమ్మం, వరంగల్ మార్కెట్‌లలోనే రూ. 81.66కోట్ల నష్టం
- కొత్త మార్కెట్ ఫీజుకూ భారీగా గండి
- కొత్త నష్టపరిహారం కోసం కోర్టు మెట్లెక్కుతున్న రైతులు



నవతెలంగాణ-ఖమ్మం ప్రతినిధి

గిట్టుబాట ధర కోసం ఖమ్మం మార్కెట్‌లో రైతుల ఆందోళన, ఆ రైతులకు బేడీలు వేసి కోర్టుకు తీసుకెళ్లిన ఘటన దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఈ ఘటన జరిగిన వెంటనే తెలంగాణ, ఏపీల్లో మిర్చికి మద్దతు ధర, నియమ నిబంధనలు రూపొందిస్తూ కేంద్రం సర్క్యులర్(నెం.1-15016బై27-2017ఎంపీఎస్)ను జారీచేసింది. మార్కెట్ ఇన్‌టర్‌వెన్షన్ స్కీమ్ కింద రూ.5000 కనీస మద్దతు ధర ఇస్తామని అందులో పేర్కొంది. ఆ సర్క్యులర్ మే ఒకటో తేదీనే తెలంగాణ అగ్రికల్చర్ ప్రొడక్షన్ కమిషనర్ అండ్ సెక్రటరీ సి.పార్థసారధికి కేంద్ర ప్రభుత్వ డైరెక్టర్ శశిభూషన్ నుంచి అందింది. ఈ సర్క్యులర్ ప్రకారం ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి రైతుకు కనీస మద్దతు ధర దక్కేలా పంటను కొనుగోలు చేయాలి. మరీ పంట నాసిరకంగా ఉంటే రూ.1250 బోనస్ చెల్లించాలి. కానీ, రాష్ట్ర సర్కారు అలా చేయలేదు. వాస్తవానికి రూ. 7 వేలకు దగ్గరగా జెండా పాట చూపిస్తున్న మార్కెట్ అధికారులు ఆ తర్వాత వ్యాపారుల దోపిడీకి ధర రూ.1500కి పతనమవుతున్నా దీనిని మాత్రం మంత్రికానీ పాలక వర్గాలు కానీ పట్టించుకోలేదు. పైగా, రాష్ట్రంలో ఒక్క చోటకూడా కౌంటర్ ఏర్పాటు చేయలేదు. ఫలితంగా రైతులకు రూ.100కోట్ల నష్టం వాటిల్లింది. తెలంగాణలో మిర్చి మార్కెట్‌కు పుట్టిల్లుగా చెప్పుకునే ఖమ్మం, వరంగల్ మార్కెట్‌ల పరిధిలోనే ఏకంగా రూ.81.66కోట్ల నష్టాన్ని రైతులు చవిచూశారు. ఇలా ఒక్కరైతులకే కాక మార్కెట్ కమిటీద్వారా రావాల్సిన ఆదాయానికి కూడా రూ.81.66లక్షల మేర గండిపడింది.

ఖమ్మం, వరంగల్ మార్కెట్‌లలో రూ.81.66కోట్లు నష్టపోయిన రైతులు


కేంద్ర వ్యవసాయశాఖ ఆదేశాల మేరకు రాష్ట్రంలో మే నెలలోనే కౌంటర్లు ఏర్పాటుచేసి మిర్చిని కొనుగోలుచేయాలి. ఎక్కడా ఆ పని చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ముందుకు రాలేదు. దీంతో అయినకాడికి అమ్ముకున్న రైతులు తీవ్ర-నష్టాల పాలయ్యారు. ఒక్క ఖమ్మం మార్కెట్‌లోనే మేనెలలో రూ.193 కోట్లా 10 లక్షల 22 వేల 8 వందల రూపాయల విలువచేసే 4 లక్షలా 20 వేల 868 క్వింటాళ్ల మిర్చి కొనుగోళ్లు జరిగాయి. జూన్‌లో 71 కోట్ల 93 లక్షలా 75 వేల విలువచేసే లక్షా 99 వేల 90 క్వింటాళ్ల మిర్చి అమ్మకాలు జరిగాయి. జులైలో 49 కోట్ల 28 లక్షల 25 వేల 5 వందల రూపాయల విలువ చేసే లక్షా 40 వేల 206 క్వింటాళ్ల మిర్చి కొనుగోలు చేశారు. వరంగల్ మార్కెట్‌లో 110 కోట్ల 52 లక్షల 17వేల 352 క్వింటాళ్ల విలువచేసే 2 లక్షలా 34 వేల 504 క్వింటాళ్ల మిర్చి కొనుగోళ్లు జరిగాయి. జూన్‌లో 37 కోట్ల 30 లక్షల 20 వేల 168 రూపాయల విలువైన 86వేల 628 క్వింటాళ్ల అమ్మకాలు జరిగాయి. జులై నెలలో 8 కోట్లా 24 లక్షల 33 వేల 582 రూపాయల విలువ చేసే 22,778క్వింటాళ్ల మిర్చి కొనుగోళ్లు జరిగాయి. ఈరెండు మార్కెట్లతోపాటు రాష్ట్రంలోని మొత్తం 186మార్కెట్లలో ఎక్కడా కేంద్రం చెప్పిన ధరకు మిర్చి కొనుగోలుచేయలేదు. ఖమ్మం మార్కెట్‌లో మేనెలలో రూ.412 తక్కువగా కేంద్రం చెప్పిన ధరకు తగ్గించి కొనుగోళ్లుచేశారు. జూన్‌లో రూ.1387లు తక్కువగా ధరచెల్లించి కొనుగోళ్లుచేశారు. జులైనెలలో రూ. 1485 తక్కువ ధరకు మిర్చి కొనుగోళ్లుచేసి రైతులను నిలువునా శ్రమదోపిడీచేశారు. ఈమూడునెలల్లో వరుసగా 65 కోట్లా 77 లక్షల 41వేల 356 రూపాయల నష్టం వాటిల్లింది. వరంగల్ మార్కెట్‌లో మే, జూన్, జులై నెలల్లో 7,60,164 క్వింటాళ్ల మిర్చి అమ్మకాలు జరిగాయి. కేంద్రం విడుదల చేసిన మార్గదర్శకాలను అమలుచేయకపోవడం ఫలితంగా మే,జూన్, జులై నెలల్లో రూ.15 కోట్లా 88లక్షలా 78 వేల 898 నష్టం వాటిల్లింది.

తీవ్రంగా నష్టపోయాం...బృహస్పతి, రైతు, చిమ్మపూడి గ్రామం, ఖమ్మం జిల్లా



రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కౌంటరు ద్వారా మిర్చి కొనుగోలు చేసినప్పుడు అమ్ముకుందామని మా ఊర్లోని రైతులు, నేనూ ఆశతో ఎదురు చూశాం. ఒక్క కౌంటరూ పెట్టలేదు. టార్పాలిన్ కవర్ల కింద దాచిన మిర్చి వానలకు తడిసి రంగు మారింది.

దిక్కులేక రూ.1,700 చొప్పున 97 క్వింటాళ్లు, రూ.3,250 చొప్పున 43 క్వింటాళ్లు అమ్మేశా. నేను



నష్టపోవటానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే కారణం. నష్టపరిహారం కోసం ప్రభుత్వాలపై న్యాయపోరాటం చేస్తాం.


ఆదేశాలు రాలేదు : సంతోష్‌కుమార్, మార్కెటింగ్ శాఖ అధికారి, ఖమ్మం జిల్లా



కేంద్రం ఇచ్చిన మార్గదర్శకాలను అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాలేదు. నేటికీ కౌంటర్ ఏర్పాటు చేయలేదు. మార్కెట్‌లో మిర్చికి గిట్టుబాటు ధర అందేలా చూస్తాం.

కేసీఆర్ మెడలు వంచే శక్తి
టీ-మాస్ ఫోరానిదే

- నిజమైన తెలంగాణ సాధనే లక్ష్యం
- సమస్య ఎక్కడుంటే టీ-మాస్ బస్సు అక్కడ: నల్లగొండ టీ-మాస్ ఆవిర్భావ సభలో తమ్మినేని



నవతెలంగాణ-నల్లగొండ ప్రతినిధి

రాష్ట్రంలో నియంతృత్వ పాలన సాగిస్తున్న కేసీఆర్ మెడలు వంచే శక్తిగా టీ-మాస్ ఫోరం ఆవిర్భవించిందని, సామాజిక తెలంగాణే లక్ష్యంగా పోరాడుతుందని పలువురు వక్తలు చెప్పారు. సమస్య ఎక్కడ ఉంటే టీ-మాస్ బస్సు అక్కడ ఉంటుందని భరోసానిచ్చారు. నల్లగొండలోని మార్కెట్ యార్డులో టీ-మాస్ ఆవిర్భావ సభ బుధవారం జరిగింది. ఈ ఆవిర్భావ సభలో 184 సంఘాలు పాల్గొన్నాయి. టీ-మాస్ ఫోరం రాష్ట్ర స్టీరింగ్ సభ్యులు తమ్మినేని వీరభద్రం మాట్లాడుతూ...'రాష్ట్రంలో నియంతృత్వ పాలన నడుస్తుంది. విడి విడిగా పోరాడితే ఏదీ సాధించలేం. ఐక్యత అవసరం. చలిచీమలు ఏకమైతే ఎంతటి విష సర్పానికైనా చావు తప్పదు. గడ్డిపోచలతో యెంటు పేనితే ఏనుగునైనా బంధించగలం. అట్లనే కేసీఆర్ మెడలు వంచే శక్తిగా టీ-మాస్ ఫోరం ఎదుగుతుంది. వచ్చిన తెలంగాణ నిజమైన తెలంగాణ కాదు. నిజమైన తెలంగాణ అంటే సామాజిక తెలంగాణ. ఆర్థిక, సామాజిక, రాజకీయ, సాంస్కృతికంగా సమన్యాయం సాధించేందుకే సామాజిక, ప్రజా సంఘాలన్నీ ఐక్య వేదికగా ఏర్పడ్డాయి' అని అన్నారు. విద్య, వైద్యం, ఉపాధి అన్ని అందరికీ అందాలన్నారు. ప్రాజెక్టులు, పరిశ్రమలకు వ్యతిరేకం కాదని, వాటి పేరిట ప్రజల వద్ద ఉన్న ఆర్థిక వనరుల్ని ధ్వంసం చేయడం సరైన పద్ధతి కాదని అన్నారు. కేవలం నోటిఫికేషన్లు ఇచ్చి ఉద్యోగాలిచ్చామని చెప్పడం మోసం చేయడమేనన్నారు. కోర్టులు కొట్టేశాలా నోటిఫికేషన్లు ఇచ్చి నిరుద్యోగుల జీవితాలతో ఆడుకుంటున్న పరిస్థితి ఉందన్నారు. ఇలాగైతే నిరుద్యోగులు ప్రగతి భవన్‌ను ముట్టడిస్తారని హెచ్చరించారు. సమాన పనికి సమాన వేతనం రూ.18 వేలు ఇవ్వాలని సుప్రీం కోర్టు చెప్పినప్పటికీ ఆశాలు, అంగన్‌వాడీలు ఇతర ఉద్యోగులకు వేతనాలు పెంచడంలేదన్నారు. జ్యోతిరావుపూలె, అంబేద్కర్, మార్క్స్ ఆలోచన విధానంతో లాల్-నీల్ జెండాలు ఐక్యమయ్యాయని ప్రొఫెసర్ కంచె ఐలయ్య అన్నారు. సర్వమానవ సమానత్వం సాధించడం కమ్యూనిజంతోనే సాధ్యమవుతుందన్నారు. టీ-మాస్ ఫోరంలో విప్లవ సంఘాలు కూడా చేరాలని పిలుపునిచ్చారు. పల్లెపల్లెకు పాట-పార్లమెంట్‌కు బాట అనే నినాదంతో భావవ్యాప్త పోరాటం సాగాలన్నారు. దేశంలో బీజేపీ ఆవుపాలన కొనసాగుతుండగా రాష్ట్రంలో కేసీఆర్ గంగిరెద్దు పాలన నడుస్తుందన్నారు. తెలంగాణ కోసం పోరాడని బిడ్డంటూ లేరని ప్రజాయుద్ధనౌక గద్దర్ అన్నారు. ఇప్పుడు తెలంగాణలో భోగాలను కొందరే అనుభవిస్తున్నారన్నారు. త్యాగాల తెలంగాణ ఎలా ఉంది... సామాజిక తెలంగాణ ఎలా ఉండాలనే విషయాల్ని వివరిస్తూ ఆయన ఆటా-మాటా-పాట ద్వారా వివరించారు. సామాజిక తెలంగాణ సాధించేందుకు ఏకమైన 200 ప్రజా, సామాజిక సంఘాలు ఐక్యంగా ముందుకు సాగాలని ఆకాంక్షించారు. భూమిని నమ్ముకున్న రైతన్నలు ఆత్మహత్యలు ఎందుకు చేసుకుంటున్నరో కేసీఆర్ సమాధానం చెప్పాలని నిలదీశారు. టీ-మాస్ స్టీరింగ్ కమిటీ సభ్యులు జేబీ రాజు మాట్లాడుతూ... కేసీఆర్ పాలన ఒట్టి భ్రమల పాలన అని అన్నారు. సభలో టీ-మాస్ ఫోరం రాష్ట్ర స్టీరింగ్ కమిటీ సభ్యులు జాన్‌వెస్లీ, కిల్లె గోపాల్, ఆర్.శ్రీరాంనాయక్, పైళ్ల ఆశయ్య, లెల్లెల బాలకృష్ణ, తెలంగాణ మేధావుల కన్వీనర్ ప్రొఫెసర్ విశ్వేశ్వర్‌రావు, ప్రొఫెసర్ ప్రభంజన్‌యాదవ్, ఎఎల్ మల్లయ్య, నారి ఐలయ్య, వైద్యం వెంకటేశ్వర్లు, దర్శనం నర్సింహ్మ, శంకర్‌నాయక్, పాలడుగు నాగార్జున, ఎండీ సలీమ్ పాల్గొన్నారు.

కార్పొరేట్ లోగుట్టు

(మొదటిపేజీ తరువాయి)

ఆవేదనను వెలిబుచ్చారు. సాక్ష్యాలన్నీ తుడిచేసి, నేరస్తులను స్వేచ్ఛగా వదిలేం దుకు అవకాశమిచ్చే ఈ చర్య తెలివి తక్కువ పనేనని ఆయన అభిప్రాయపడ్డారు.

అంత సులువేమీ కాదు...

ఒక ప్రయివేటు లిమిటెడ్ కంపెనీ మూసివేయడం అంత సులువైన పనేం కాదని సీనియర్ చార్టర్డ్ అకౌంటెట్లు చెబుతున్నారు. ఏదైనా ఒక కంపెనీని మూసి వేయాలంటే అందుకు తగిన కారణాలను, దస్త్రాతలను రిజిస్టర్ ఆఫ్ కంపెనీస్(ఆర్‌వోసీ)కి అందించాల్సి ఉంటంది. బదులుగా కంపెనీ ప్రమోటర్లు కూడా ఆర్‌వోసీకి కొన్ని పత్రాలను సమర్పించాల్సి ఉంటుంది. తాము ప్రభుత్వానికి చెల్లించాల్సిన ఆదాయపు పన్ను, సర్వీసు ట్యాక్స్, ఎక్సైస్ సుంకంతో పాటు ఉద్యోగులకు, ముడి సరుకు సప్లయి చేసిన వారికి ఇతరులకు పన్నులు, బకాయిలన్నింటినీ చెలించినట్టుగా పత్రాలను సమర్పించాల్సి ఉంటుంది. దీనిని చార్టర్డ్ అకౌంటెట్లు ధ్రువీకరించితేనే ఏదైన కంపెనీ రద్దుకు వీలు పడుతుంది. ఇదంతా చాలా సమయం పట్టే దీర్ఘకాలిక ప్రక్రియ అని సీనియర్ సీఏలు చెబుతున్నారు. ఇక వేళ ప్రభుత్వం ఒక్క కలం పోటుతో వీటిని డీరిజిస్టర్ చేస్తే అవి న్యాయపరంగా మరణించినట్టవుతుందని వారు చెబుతున్నారు. దీంతో ఆ కంపెనీల బకాయిలను గురించి ప్రశ్నించే అవకాశమే లేకుండా పోతుందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రద్దు చేసిన ఒక్కో కంపెనీలో భారీగానే లావాదేవీలు జరిగినట్టుగా అందుబాటులోకి రాని రికార్డుల రూపంలో తెలుస్తోంది. రద్దు నిర్ణయంతో ఒక్కో కంపెనీకి కనీసం రూ.100 కోట్ల మేర మేలు జరిగిందనుకుంటే మొత్తంగా రద్దు చేసిన డొల్ల కంపెనీల రూపంలో రూ.10 లక్షల కోట్ల ప్రజాధనం బడాబాబుల జేబుల్లోకి చేరిపోయినట్లయిందని వారు చెబుతున్నారు. ఫలితంగా బ్యాంకుల ఎన్‌పీఏలు పేరగడంతో పాటు పన్నుల రూపంలో వీటిని తిరిగి ప్రజల నుంచే సర్కారు వసూలు చేయక తప్పదని వారు విశ్లేషిస్తున్నారు.

స్వయం ఉపాధి నిధులను లబ్దిదారులకు అందజేయండి :అజయ్ మిశ్రా

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

స్వయం ఉపాధి పథకాలకు ఎంపికైన లబ్దిదారులకు వెంటనే నిధులను విడుదల చేయాలని ఎస్సీ అభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. ప్రధానంగా 2015-16 సంవత్సరానికి సంబంధించిన నిధులను 15 రోజుల్లో లబ్దిదారులకు అందజేయాలన్నారు. బుధవారం సచివాలయంలో ఆయన జిల్లా జాయింట్ కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా అజయ్ మిశ్రా మాట్లాడుతూ నల్లగొండ, ఖమ్మం, సూర్యాపేట, మహబూబ్‌నగర్ జిల్లాల్లో స్వయం ఉపాధి నిధులను అందజేయడంలో వెనుకబడి ఉన్నారని, నిర్దేశించిన సమయంలోగా లబ్దిదారులకు నిధులు అందజేయాలని తెలిపారు.

'ప్రజాభిప్రాయం' రణరంగం

నవతెలంగాణ-పెద్దపల్లి ప్రతినిధి

కాళేశ్వరం ప్రాజెక్టుపై పెద్దపల్లిలో బుధవారం చేపట్టిన ప్రజాభిప్రాయ సేకరణ సభ రణరంగంగా మారింది. టీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు బాహాబాహికి దిగారు. సభా స్థలిలోనే కుర్చీలతో ఒకరినొకరు కొట్టుకున్నారు. దాడిని నిరసిస్తూ మాజీ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఆందోళనకు దిగారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారుతుండటంతో పోలీసులు లాఠీచార్జి చేశారు. ఇరు పార్టీల కార్యకర్తలను చెదరగొట్టారు. కాంగ్రెస్ నాయకులను అరెస్టు చేశారు. ఘటనకు కారణమైన టీఆర్ఎస్ నాయకులను, కార్యకర్తలను వదిలి... మిగతావారిని అరెస్టు చేయడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమయ్యాయి. తీవ్రంగా గాయపడిన ముగ్గురిని కరీంనగర్ ఆస్పత్రికి తరలించారు. మిగతా జిల్లాల్లో ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమాలు టీఆర్ఎస్ సభల్లా జరిగాయి. పెద్దపల్లి జిల్లా కేంద్రానికి సమీపంలోని రెడ్డి ఫంక్షన్‌హాల్‌లో జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ ఎస్ ప్రభాకర్‌రెడ్డి అధ్యక్షతన, ఇరిగేషన్, రెవెన్యూ, పర్యావరణ పరిరక్షణ మండలి అధికారుల ఆధ్వర్యంలో మంగళవారం ప్రజాభిప్రాయ సేకరణ సభ నిర్వహించారు. పెద్దపల్లి ఎంపీ బాల్కసుమన్, ఐడీసీ చైర్మెన్ ఈద శంకర్‌రెడ్డి, ఎమ్మెల్సీ భానుప్రసాద్‌రావు, ఎమ్మెల్యేలు పుట్ట మధుకర్, దాసరి మనోహర్‌రెడ్డితో పాటు రామగుండం, మంథనికి చెందిన ప్రజాప్రతినిధులు, రైతులు, మహిళలు పాల్గొన్నారు. బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే, సీపీఐ రాష్ట్ర కార్యవర్గసభ్యులు గుండా మల్లేష్, మాజీ మంత్రి, టీపీసీసీ ఉపాధ్యక్షులు శ్రీధర్‌బాబు కూడా హాజరయ్యారు. సభలో మొదట ఇన్‌చార్జి కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మేడిగడ్డ వద్ద కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మిస్తోందని, దానికి అనుసంధానంగా పెద్దపల్లి జిల్లాలో మూడు చోట్ల పంపుహౌజ్‌లు, బ్యారేజ్‌ల నిర్మాణం చేపడుతుందని, అందులో భాగంగానే అభిప్రాయాలు సేకరిస్తున్నామని చెప్పారు. ఎమ్మెల్యేల అనుచరులైన కొందరు ప్రజాప్రతినిధులు, టీఆర్ఎస్ కార్యకర్తలు తమ అభిప్రాయాలు తెలిపారు. అదే సమయంలో మంథని మండలం ఉప్పట్లకు చెందిన ప్రాజెక్టు ముంపు బాధితుడు, రైతు సంఘం నాయకులు శ్రీనివాస్ మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టు వల్ల పర్యావరణం దెబ్బతింటుందని, బ్యారేజ్‌లు, పంపుహౌజ్‌ల నిర్మాణాల వల్ల రైతులు నష్టపోతారని వాపోయారు. వెంటనే టీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు 'సీఎం జిందాబాద్' అని నినదించారు. ప్రతిగా కాంగ్రెస్ నాయకులూ 'సీఎం డౌన్ డౌన్' అంటూ నినాదాలు చేశారు. దీంతో సభలో ఉద్రిక్తత నెలకొంది. వేదికపై మాట్లాడుతున్న శ్రీనివాస్‌ను ఆపేసి వెళ్లాలని అధికారులు సూచించారు. దీంతో శ్రీనివాస్ అక్కడే బైటాయించాడు. ఈ క్రమంలోనే సభలో ఉద్రిక్త వాతవరణం మొదలైంది. టీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకుల మధ్య మాటామాటా పెరిగింది. ఇరు పార్టీల కార్యకర్తలు కుర్చీలు, బెంచీలను ఒకరిపై ఒకరు విసురుకున్నారు. పిడిగుద్దులు గుద్దుకున్నారు. ముగ్గురు కాంగ్రెస్ నాయకులకు తీవ్ర గాయాలయ్యాయి. డీసీపీ విజయేందర్‌రెడ్డి, ఏసీపీ సింధుశర్మ రెండు వందల మంది పోలీసులలో రంగంలోకి దిగి పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు యత్నించారు. సర్దుమణగకపోవడంతో లాఠీచార్జి చేశారు. ఈ గొడవతో రైతులు, మహిళలు, యువకులు సభ నుంచి వెళ్లిపోయారు. గొడవ జరుగుతుండగానే ఎంపీ బాల్క సుమన్, ఎమ్మెల్యే పుట్ట మధుకర్ తమ చుట్టూ భారీ సంఖ్యలో కార్యకర్తలను భద్రతగా ఏర్పాటు చేసుకుని మధ్యలో కూర్చున్నారు.

కాంగ్రెస్ ఆందోళన

గొడవకు కారణమైన టీఆర్ఎస్ నాయకులను వదిలేసి తమపై పోలీసులు లాఠీచార్జి చేశారని మాజీ మంత్రి శ్రీధర్‌బాబు, కాంగ్రెస్ నాయకులు ఆందోళనకు దిగారు. దీంతో శ్రీధర్‌బాబు, ఇతర నాయకులను పెద్దపెల్లి సీఐ మహేశ్ ఆధ్వర్యంలో అరెస్టు చేశారు. పెద్దపల్లి పోలీసుస్టేషన్‌కు తరలించారు. 'ప్రాజెక్టుకు వ్యతిరేకంగా అభిప్రాయం చెప్తావా' అంటూ వేదిక పైనుంచి దిగి వస్తున్న శ్రీనివాస్‌ను టీఆర్ఎస్ కార్యకర్తలు విచక్షణా రహితంగా కొట్టారు. తీవ్ర గాయాలైన ముగ్గురు కాంగ్రెస్ నాయకులను కరీంనగర్ ఆస్పత్రికి తరలించారు. అరెస్టయిన కాంగ్రెస్ నాయకులను సాయంత్రం వరకు స్టేషన్‌లోనే ఉంచారు. దీనిపై కాంగ్రెస్ జిల్లావ్యాప్తంగా ఆందోళనకు దిగింది. సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్‌లో నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణలో రైతులెవ్వరూ పాల్గొనలేదు. అక్కడంతా టీఆర్ఎస్ శ్రేణుల హంగామే. కలెక్టర్ మానిక్కరాజ్ కణ్ణన్, జేసీ వెంకటేశ్వర్లు, రెవెన్యూ శాఖ జిల్లా, డివిజన్ స్థాయి అధికారుల సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఐదు మండలాల పరిధిలో భూమి కోల్పోనున్న రైతులు రావాల్సి ఉండగా ఎవ్వరూ రాలేదు. ప్రాజెక్టులో ఎవరి భూమి ఎంత పోతుందనే దానిపైనా, ఏయే గ్రామాల నుంచి గ్రావిటీ కెనాల్ పోతుందన్న దానిపైనా అధికారుల నుంచి స్పష్టమైన సమాధానం రాలేదు. కామారెడ్డి జిల్లాలో ప్రతిపాదిత ప్యాకేజీ 22 పనుల్లో భాగంగా ముంపు, పర్యావరణంపై స్థానిక లక్ష్మీదేవి గార్డెన్స్‌లో కలెక్టర్ సత్యనారాయణ అధ్యక్షతన ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. మొత్తం 75 మంది అభిప్రాయాలు తెలిపారు. 106 మంది వినతులు అందజేశారు. సభలో టీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలే ఎక్కువగా ఉండటం గమనార్హం. నల్లగొండ జిల్లాలోని చిట్యాల, నార్కట్‌పల్లి మండలాల్లోని రైతులతో చిట్యాలలోని రాజరాజేశ్వరి ఫంక్షన్‌హాల్‌లో జాయింట్ కలెక్టర్ నారాయణరెడ్డి అధ్యక్షతన ప్రజాభిప్రాయ సేకరణ జరిగింది. భువనగిరి-యాదాద్రి జిల్లాలోని రామన్నపేట మండల రైతులు కూడా పాల్గొన్నారు. పలువురు రైతులు తమ ఆవేదన, అనుమానాలను వెలిబుచ్చారు. ఎమ్మెల్యే వేముల వీరేశం ముందస్తు వ్యూహం ప్రకారం రైతుల కన్నా ఎక్కువగా టీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులే అభిప్రాయాలను చెప్పేలా చూశారు.

'నేరెళ్ల'పై న్యాయం చేయండి

నవతెలంగాణ-న్యూఢిల్లీబ్యూరో

రాజన్నసిరిసిల్ల జిల్లా నేరెళ్లలోని దళితులపై, వెనుకబడిన వర్గాలపై చిత్రహింసలకు పాల్పడిన ఎస్పీతో పాటు ఇతర పోలీసులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని రాష్ట్రపతి రామ్‌నాథ్‌కోవింద్‌కు అఖిలపక్షం, జేఏసీ నేతలు విజ్ఞప్తి చేశారు. ఈ ఘటనపై స్వతంత్ర విచారణ జరిపించడంతో పాటు బాధితులకు తగు నష్టపరిహారం చెల్లించేలా జోక్యం చేసుకోవాలని విన్నవించారు. అలాగే దళితులను చిత్రహింసలకు గురిచేసిన వారిపై ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కింద కేసు నమోదు చేసేలా చర్యలు చేపట్టాలని కోరారు. సీపీఐ రాజ్యసభ ఎంపీ డి రాజా నేతృత్వంలో కాంగ్రెస్ అధ్యక్షులు ఉత్తమ్‌కుమార్, టీడీపీ అధ్యక్షులు ఎల్ రమణ, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డి, జేఏసీ కన్వీనర్ ప్రొఫెసర్ కోదండరామ్, తదితరులు బుధవారం రాష్ట్రపతి రామ్‌నాథ్‌కోవింద్‌ను రాష్ట్రపతి భవన్‌లో కలిశారు. నేరెళ్లలో జరిగిన ఘటన, బాధితుల పట్ల రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి, పోలీసుల క్రూర చర్యలను వివరిస్తూ ఓ వినతిపత్రం సమర్పించారు. రాష్ట్రపతితో సమావేశనంతరం అఖిలపక్ష బృందం నేతలు మీడియాతో మాట్లాడారు. 'తెలంగాణలో జరుగుతున్న దళితుల, గిరిజనుల, బీసీల మానవ హక్కుల ఉల్లంఘనను రాష్ట్రపతికి వివరించాం' అని కాంగ్రెస్ అధ్యక్షులు ఉత్తమ్‌కుమార్ తెలిపారు. నేరెళ్ల ఘటన జరిగి చాలా వారాలవుతున్నా రాష్ట్ర ప్రభుత్వం ఘటనకు కారకులైన వారిపై చర్యలు తీసుకోవడం లేదని రాష్ట్రపతి దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. 'బాధితులు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కింద ఫిర్యాదు చేసినప్పటికీ.. రాష్ట్ర ప్రభుత్వం ఎఫ్ఐఆర్ కూడా నమోదు చేయలేదు. ఈ ఘటనలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తి ఉదాసీనంగా వ్యవహరించింది. ప్రజల ప్రాణాల కంటే లారీలకే ఎక్కువ విలువ కడుతోంది. ఈ ఇసుక అక్రమ మాఫియాలో సీఎం బంధువులకు భాగస్వామ్యం ఉంది' అని ఆరోపించారు. కేసీఆర్ ముఖ్యమంత్రి అయ్యాక రాష్ట్రంలో పెద్దఎత్తున ఇసుక అక్రమ రవాణా జరుగుతోందని టీడీపీ అధ్యక్షులు ఎల్ రమణ ఆరోపించారు. ఇసుక మాఫీయాకు కేసీఆర్ కుటుంబం వెన్నుదన్నుగా ఉందని అన్నారు. 'ప్రాణం లేని లారీలను దగ్ధం చేస్తే 30 మందిని అరెస్టు చేశారు. ఎనిమిది మందిపై థర్డ్‌డిగ్రీ ప్రయోగించారు. ఇంతటి ఘోరం జరిగినా కేసీఆర్ స్పందించలేదు. పైగా దళితులకు బొర్డులు ఉన్నాయా అని అవహేళన చేశారు' అని ఆగ్రహం వ్యక్తం చేశారు. నేరెళ్ల ఘటనలో ఎస్పీని సస్పెండ్ చేసి రాష్ట్ర ప్రభుత్వం చేతులు దులుపుకోవాలని యత్నిస్తోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డి విమర్శించారు. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను రాష్ట్రపతికి తెలియజేశామని తెలిపారు. 'అఖిలపక్ష బృందం నేతలు చెప్పిందంతా రాష్ట్రపతి సానుకూలంగా విన్నారు. మేం సమర్పించిన వినతిపత్రం పరిశీలించి చర్యలు చేపడతామని అన్నారు' అని చెప్పారు. హోంశాఖ నుంచి ఇసుక మాఫియాపై సమాచారం సేకరించి తగు విధంగా చర్యలు చేపట్టాలని కోరామని చాడ వివరించారు. దళితులపై క్రూరంగా దాడి చేసిన వారిపై ఇప్పటి వరకు చర్యలు లేవని జేఏసీ కన్వీనర్ ప్రొఫెసర్ కోదండరామ్ అన్నారు. 'బాధితులకు సంపూర్ణ న్యాయం జరగడంతో పాటు ఇసుక మాఫియాపై నియంత్రణ విధించే వరకు పోరాటం కొనసాగిస్తాం' అని ఆయన చెప్పారు. ఈ ఘటనపై కోర్టులో కేసు సైతం వేశామని వివరించారు. ఈ ఘటనను జాతీయస్థాయిలోకి తీసుకొచ్చిన ప్రయత్నాలు ఓ కొలిక్కి వచ్చినట్టుగా భావిస్తున్నామని చెప్పారు.

పక్కా ప్రణాళికతోనే

(మొదటిపేజీ తరువాయి)

సూచనలను పరిగణనలోకి తీసుకొని తదుపరి విచారణ తేదీ సెప్టెంబరు 13 నాటికి తాజా దర్యాప్తు నివేదికను సమర్పించాల్సిందిగా ఈ రెండు దర్యాప్తు సంస్థలను ధర్మాసనం ఆదేశించింది. 2013 ఆగస్టు 20న పూణెలో ఉదయం వాకింగ్‌కు వెళ్ళిన దభోల్కర్‌ను గుర్తుతెలియని వ్యక్తులు అతి సమీపం నుంచి కాల్పులు జరిపి హత్య చేశారు. 2015 ఫిబ్రవరి 16న పన్సారేపై ఇద్దరు వ్యక్తులు కాల్పులు జరపగా.. తీవ్ర గాయాలైన ఆయన అదే నెల 20న మృతిచెందారు. రెండు కేసుల్లోనూ కోర్టు పర్యవేక్షణలో దర్యాప్తు జరిపించాల్సిందిగా వారి బంధువులు పిటిషన్ దాఖలు చేశారు.

భారత్‌పై స్వైన్‌ఫ్లూ పంజా

(మొదటిపేజీ తరువాయి)

22,186 స్వైన్‌ఫ్లూ కేసులు నమోదయ్యాయి. 2016లో 1,786 కేసులు నమోదు కాగా 265 మంది చనిపోయారు. ఈ ఏడాది మహారాష్ట్రలో హెచ్1ఎన్1 ఇన్‌ఫెక్షన్ (స్వైన్‌ఫ్లూ) కారణంగా అత్యధికంగా (437 మంది) మృతి చెందారు. ఆ తర్వాత వరుస క్రమంలో.. గుజరాత్ (269 కేసులు) రాజస్థాన్‌లో 69 మంది మృతి చెందినట్టు అధికార వర్గాలు ధ్రువీకరిం చాయి. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో మహారాష్ట్ర,గుజరాత్, రాజస్థాన్‌లో స్వైన్‌ఫ్లూ కేసులు ఎక్కువవుతున్నా..అక్కడి పాలకులు ప్రత్యేక శ్రద్ధచూ పటంలేదని స్థానిక ప్రజాసంఘాలు మండిపడుతున్నాయి.

ఓబీసీ ఉపవర్గీకరణపై కమిషన్

(మొదటిపేజీ తరువాయి)

తర్వాత 12 వారాల్లోగా దానిపై రిపోర్ట్ అందజేస్తారన్నారు. 11 రాష్ట్రాలు ఇప్పటికే ఓబీసీ ఉపవర్గీకరణ చేశాయన్నారు. ఉపవర్గీకరణ వల్ల అన్ని కులాలకు సమాంతరంగా లబ్ది చేకూరుతుందన్నారు.అలానే ఏడాదికి క్రీమిలేయర్ పరిధిని కూడా రూ.ఆరు లక్షల నుంచి ఎనిమిది లక్షలకు పెంపునకు కేంద్రక్యాబినెట్ పచ్చజెండా ఊపింది.

గులాబీ గేమ్

(మొదటిపేజీ తరువాయి)

మాట్లాడారు కూడా. ఈ నేపథ్యంలో అభ్యర్థులను మారిస్తేనే టీఆర్ఎస్‌పార్టీని ప్రజలు ఆదరించే అవకాశం ఉందని ముఖ్యమంత్రి గుర్తించారు. అందుకే అభ్యర్థుల వేటలో సీఎం పడ్డారని తెలిసింది. అదేవిధంగా పార్టీ మారిన ఎమ్మెల్యేల్లో కొందరు గెలిచే అవకాశం లేదని సర్వేలో తేలినట్లు సమాచారం. దీంతో ఫిరాయిం పుదారులతో రాజీనామా చేయించి, ఎన్నికలకు వెళ్లాలన్న ఆలోచన కూడా సీఎం మానుకున్నారని సమాచారం. ఫలితం ఎలా ఉంటుందన్న భయంతోనే టీడీపీ ఎమ్మెల్యేలను చేర్చుకుని, టీడీపీఎల్పీనే టీఆర్ఎస్‌పార్టీలో విలీనం అయినట్టుగా అసెంబ్లీ బులిటిన్ విడుదల చేయడం గమనార్హం. అయితే ప్రతిపక్షాలు మాత్రం పార్టీ మారిన ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించాలని కోరుతున్నా ముఖ్యమంత్రి కేసీఆర్ మౌనంగా ఉంటున్నారు. మిగతా అన్ని అంశాలు మాట్లాడుతున్నా ఫిరాయింపు ఎమ్మెల్యేల ప్రస్తావన తేవడానికి భయపడుతున్నారని ప్రతిపక్షాలు ఎద్దేవా చేస్తున్నాయి. ఇప్పుడు తమ పార్టీలోనే వారే రాజీనామాలు చేసి ఎన్నికలకు పోదామని అనడంతో సీఎం కేసీఆర్ మండిపడ్డారని తెలిసింది. రాజీనామాలు తప్ప, మీకు మరో ఏ సమస్యా లేదా అని మహబూబ్‌నగర్ నేతలను మందలించినట్టు తెలిసింది. గతంలో ఇదేవిధంగా నల్లగొండ, నిజామాబాద్ జిల్లాల ఎమ్మెల్యేలు రాజీనామా డిమాండ్లు చేసి, తర్వాత వెనక్కుతగ్గారు. తాజాగా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన పలువురు టిఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్యేలు, నేతలు కాంగ్రెస్‌నేతలకు సవాళ్లు విసిరారు. మంత్రి జూపల్లి కృష్ణారావుపై వంశీచంద్‌రెడ్డి చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో బాలరాజు రాజీనామా డిమాండ్ చేశారు. ఇంకా ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి కూడా రాజీనామాకు సిద్ధమని ప్రకటించారు. వంశీచంద్‌రెడ్డి సిద్ధమని చెప్పినా అధికారపార్టీ నేతలు మౌనంగా ఉండిపోయారు. ఒక్కరోజులోనే వెనక్కితగ్గడానికి సీఎం మందలింపే కారణమని తెలుస్తోంది. అలాంటిదేమీ లేదని, సీఎం తమను వారించలేదని అంటున్నారు. రాజీనామాల డిమాండ్ల అంశం ముందుకు వస్తే ఫిరాయింపుదారుల రాజీనామాలు తెరపైకి వచ్చే అవకాశం ఉంది. ఇందులో ఎక్కడోచోట దెబ్బతిన్నా మొదటికే మోసం వస్తుందని భయపడే, రాజీనామాల డిమాండ్లపై సీఎం ఆగ్రహించి ఉంటారని ప్రచారం జరుగుతున్నది.

ప్రభుత్వానికి వ్యతిరేకంగా మూడు ముఠాలు

- టీఆర్ఎస్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ప్రభుత్వానికి వ్యతిరేకంగా రాష్ట్రంలో మూడు ముఠాలు పని చేస్తున్నాయని టీఆర్ఎస్ఎల్పీ ఆరోపించింది. ఏ అభివృద్ధి కార్యక్రమం చేపట్టినా.. దాన్ని అడ్డుకోవడానికి ప్రయత్నిస్తున్నాయని విమర్శించింది. ఈ మేరకు బుధవారం ఆ పార్టీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్, ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్ బుధవారం టీఆర్ఎస్ఎల్పీలో విలేకరులతో వేర్వేరుగా మాట్లాడారు. ప్రభుత్వంపై ఢిల్లీలో కోదండరామ్ ఇష్టమొచ్చినట్టుగా అబద్ధాలు ప్రచారం చేస్తూ బద్నాం చేస్తున్నారని ఆరోపించారు. తీర్చే శక్తి ఉంది కాబట్టే..అభివృద్ధి కోసం అప్పులు తెస్తున్నామని, మిగిలిన రాష్ట్రాలకు అప్పులు లేవా.? అని ప్రశ్నించారు. దేశంలో వ్యాపారం నిర్వహించే అంబానీ సోదరులకు కూడా భారీ అప్పు ఉందన్నారు. అమెరికా దేశం కూడా 19 ట్రిలియన్ డాలర్ల అప్పుల్లో ఉందని తెలిపారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్న కర్నాటక రాష్ట్రానికి కూడా భారీ స్థాయిలో అప్పులున్నాయన్న సంగతి తెలుసుకోవాలన్నారు. వచ్చిన తెలంగాణ విఫలమైందని చెప్పడానికే.. కోదండరామ్ తాపత్రయపడుతున్నారని విమర్శించారు. నిబంధలనకు విరుద్ధంగా మహారాష్ట్రకు జాతీయ రహదారులను కేటాయిస్తున్న కేంద్రం, మహబూబ్‌నగర్ జిల్లాకు మాత్రం కేటాయించడం లేదన్నారు.

సమాన పనికి సమానవేతనం

- ఇదే మా డిమాండ్.. సమస్యలు పరిష్కరించకుంటే సమ్మెకే: కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నేతలు పాలడుగు భాస్కర్, జె వెంకటేశ్



నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

ఎన్నికల సందర్భంగా ప్రభుత్వమిచ్చిన హామీ ప్రకారం తెలంగాణలోని ప్రభుత్వ శాఖలు, సంస్థల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులందరినీ రెగ్యులరైజ్ చేయాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర నేతలు పాలడుగు భాస్కర్, జె వెంకటేశ్ డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకుంటే అవసరమైతే సమ్మెకు వెనుకడబోమని హెచ్చరించారు. ప్రభుత్వమిచ్చిన హామీలను నెరవేర్చాలని, సమస్యలు పరిష్కరిం చాలని కోరుతూ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్, డైలివైజ్ తదితర ఉద్యోగులు బుధ వారం 'చలో సెక్రటేరియేట్' కార్యక్రమం నిర్వహించారు. జీహెచ్ఎంసీ కార్యాల యం నుంచి సెక్రటేరియేట్ వైపు ర్యాలీగా వెళ్తేందుకు ప్రయత్నించిన సంఘం నేతలు, ఉద్యోగులను పోలీసులు అడ్డుకున్నారు. శాంతియుతంగా నిరసన తెలుపు తామని ఆ సంఘం నేతలు పోలీసులను కోరినా వారు వినలేదు. ఉద్యోగులను బలవంతంగా పోలీస్ వ్యాన్లు, బస్సుల్లోకి ఎక్కించారు. ఈ సందర్భంగా పోలీ సులకు, ఉద్యోగులకు మధ్య తోపులాట చోటుచేసుకున్నది. సుమారు 250 మంది ని అరెస్టు చేసిన పోలీసులు, వారిని నగరంలోని వివిధ పోలీస్‌స్టేషన్లకు తరలిం చారు. అంతకుముందు ఉద్యోగులను ఉద్దేశించి పాలడుగు భాస్కర్, జె వెంకటేశ్ మాట్లాడారు. సుప్రీంకోర్టు తీర్పునను సరించి పర్మినెంట్ ఉద్యోగులతో సమానంగా కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు వేతనం చెల్లించాలని, ఉద్యోగభద్రత కల్పిం చాలని డిమాండ్ చేశారు. జీవోనెంబర్ 16 అమలుకు ఎదురవుతున్న ఆటం కాలను తొలగించాలని కోరారు. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు తలుచు కుంటే పరిపాలన వ్యవస్థ స్థంభించి పోతుందనే విషయాన్ని గుర్తు పెట్టాలని ప్రభు త్వాన్ని హెచ్చరించారు. కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్దీకరణ, జీవోనెంబర్16 అమలును హైకోర్టు నిలుపుదల చేసినా ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేదని విమర్శించారు. సీఎం కేసీఆర్ మాత్రం తాము క్రమబద్దీకరిస్తుంటే కోర్టులు కొట్టేస్తుందనీ, దీనికి ప్రభుత్వం ఏం చేయాలంటూ నిస్సహాయత వ్యక్తం చేయడం సరికాదని అన్నారు. తెలంగాణలో కాంట్రాక్టు వ్యవస్థను రద్దు చేస్తామని, ఖాళీ పోస్టులను భర్తీ చేస్తామని చెప్పారనీ, కానీ ఏ ఒక్కటీ అమలుకు నోచుకోలేదని అన్నారు. నిరుద్యోగులకు, కాంట్రాక్టు ఉద్యోగులకు మధ్య ప్రభుత్వం చిచ్చుపెట్టే ప్రయత్నం చేస్తుందని మండిపడ్డారు. కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, నిరుద్యోగులు అన్నదమ్ములవలే కలిపి పోరాడి ఉద్యోగాలు సాధించుకోవాలని, ప్రభుత్వ కుట్రల్లో చిక్కుకోవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల రాష్ట్ర నాయకులు జె కృష్ణారెడ్డి, ఎం పద్మశ్రీ, కుమార్, రాజేశ్వర్, సైదులు, కె సురేష్, దామోదర్, అనసూయ, రవీందర్, అన్నపూర్ణ, కమర్‌అలీ తదితరులు ఉన్నారు.

సెన్సెక్స్ ▲ 276	31,568
నిఫ్టీ ▲ 87	9,852
డాలరుకు రూపాయి విలువ	64.11
బంగారం(10.గ్రా)	రూ. 29,582
వెండి (కేజీ)	రూ. 42,600





కోడిగుడ్లు			
హైదరాబాద్	320	విజయవాడ	320
ఒక్కగుడ్డుకు	3.80	చెన్నై	355
వరంగల్	322	ముంబయి	365



మార్కెట్లోకి బుగాట్టీ రూ.20 కోట్ల కారు!



న్యూయార్క్: ఇప్పటి వరకు ఖరీదైన కార్లుగా చలామణి అవుతున్న కార్లను తలదన్నేలే బుగాట్టీ సంస్థ చిరాన్ కారును మార్కెట్లోకి తీసుకువచ్చింది. దీని ధరల అక్షరాల రూ. 19.21 కోట్లు. ఇప్పటి వరకు కేవలం మోటార్ షోలకే పరిమితమవుతూ వచ్చిన ఈ కారును ఇక మార్కెట్లోకి అందుబాటులోకి తెచ్చినట్టుగా సంస్థ పేర్కొంది. దీని అత్యధిక వేగం గంటకు 420 కిలోమీటర్లు.. ! విలాసవంతమైన కార్లకు చిరునామాగా నిలిచే బుగాట్టీ ఈ మోడల్ తొలి కారును అమెరికాలోని పెబల్ బీచ్‌లోని ఒక కస్టమర్‌కు డెలివరీ చేసింది. ప్రపంచ వ్యాప్తంగా తాము కేవలం ఈ మోడల్‌కు చెందిన 500 కార్లను మాత్రమే విక్రయిస్తామని సంస్థ తెలిపింది. వీటిల్లో సగానికిపైగా కార్లకు ఇప్పటికే బుకింగ్‌లు పూర్తయినట్టుగా సంస్థ వివరించింది. ఈ కారు 1.600 ఎన్ఎం టార్క్ వద్ద 1500 బీహెచ్‌పీ శక్తిని విడుదల చేస్తుంది. అత్యంత సౌకర్యవంతమైన ఇంటీరియర్‌తో దీనిని తీర్చిదిద్దారు. దీనిని 8లీటర్ డబ్ల్యూ16 ఇంజిన్‌తో తీర్చిదిద్దారు. దీనిలో రెండు దశల టర్బో చార్జర్ ఇంజిన్ ఉంది. ఈ టెక్నాలజీని బుగాట్టీ తొలిసారి వినియోగించినట్లు కంపెనీ వర్గాలు తెలిపాయి.

విపణిలోకి అత్యాధునిక బజాజ్ సీటీ100



నోడెట్‌లైన్: ద్విచక్ర వాహన తయారీ సంస్థ బజాజ్ తమ పాపులర్ బైకు సీటీ100లో సరికొత్త వెర్షన్‌ను మార్కెట్లోకి విడుదల చేసింది. ఈ కొత్త బైకును ఎలక్ట్రిక్ స్టార్ట్‌తో అప్‌గ్రేడ్ చేసింది. దీని ప్రారంభ ధర రూ. 38,806 (ఎక్స్ ఫోరూం మహారాష్ట్ర)గా పేర్కొనగా.. రూ.42,000 (ఎక్స్ షోరూం ఢిల్లీ)గా తెలిపింది. కాగా బజాజ్ సీటీ 100 అల్లాయ్, సీటీ 100 బీ బైకుల అమ్మకాలు యథావిధిగా కొనసాగుతాయని తెలిపింది. దీంట్లో ప్రత్యేకతలు ఇలా ఉన్నాయి.. విభిన్నమైన స్ప్రింగ్ ఇన్ స్ప్రింగ్ సస్పెన్షన్ (ఎస్ఎన్ఎస్) టెక్నాలజీ, 102 సీసీ సింగిల్-సిలిండర్, 4 స్ట్రోక్ ఇంజిన్, 7.6 బీహెచ్‌పీ, 8.24 ఎన్ఎం టార్క్, ఫ్యూయల్ గేజ్, ఫ్లెక్సిబుల్ సైడ్ ఇండికేటర్స్ వంటి తదితర ఫీచర్లతో దీనిని ప్రవేశపెట్టింది.

విదేశాలకు విస్తరిస్తాం..



నవతెలంగాణ, వాణిజ్యవిభాగం: ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ సంస్థ ఇండియన్ బ్యాంకు విస్తరణ ప్రణాళికలను రూపొందించినట్టు బ్యాంకు ఎండీ అండ్ సీఈవో కిశోర్ ఖరాటే తెలిపారు. ఇండియన్ బ్యాంకు (1907) ఏర్పాటు చేసి 111 ఏండ్లు పురస్కరించుకున్న సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రస్తుతం దేశంలో ఇండియన్ బ్యాంక్‌కు 2,700 శాఖలుండగా, దాంట్లో దక్షిణాది రాష్ట్రాల్లో 60శాతంతో 1,620 శాఖలకు చేరిందన్నారు. తెలుగు రాష్ట్రాలో 350 శాఖలకు విస్తరించినట్టుగా ఆయన వివరించారు. ప్రస్తుతం శ్రీలంక, సింగపూర్‌లో ఇండియన్ బ్యాంక్‌కు శాఖలుండగా.. ఈ సేవలను మరింత విస్తరించాలని నిర్ణయించినట్టుగా కిశోర్ ఖరాటే పేర్కొన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జూన్‌తో ముగిసిన త్రైమాసికంలో బ్యాంకు నికర వడ్డీ ఆదాయం 21.16శాతం పెరిగి..రూ.372.4 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసినట్టుగా తెలిపారు.

బ్యాంకుల ఏకీకరణకు' ప్రత్యామ్నాయం!'

కొత్త వ్యవస్థ ఏర్పాటుకు క్యాబినెట్ సై

- సభ్యులుగా జైట్లీ, నితిన్ గడ్కరీ



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ బ్యాంకుల ఏకీకరణకు సంబంధించిన అంశాలను పరిశీలించేందుకు గాను ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయాలని సర్కారు నిర్ణయించింది. బుధవారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఇందుకు సంబంధించిన ప్రతిపాదనకు మోడీ క్యాబినెట్ సమ్మతి తెలిపినట్టుగా ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ తెలిపారు. దేశంలోని బలమైన, పోటీతత్వంతో కూడిన బ్యాంకుల ఏర్పాటునకు గాను ఈ నిర్ణయం దోహదం చేయగలదని తాము భావిస్తున్నట్టుగా జైట్లీ వివరించారు. సర్కారు ఏర్పాటు చేయనున్న ప్రత్యామ్నాయ వ్యవస్థ ఆయా బ్యాంకుల నుంచి వచ్చిన ప్రతిపాదనలను ఆర్థిక స్థితిగతుల బట్టి విశ్లేషించి వాటి ఏకీకరణఖు గాను సూత్రప్రాయంగా అనుమతులను జారీ చేస్తుందని ఆయన వివరించారు. దేశం మొత్తంగా బ్యాంకుల విలీనం జరిపి ఒక నిర్దష్టమైన సంఖ్యలో మాత్రమే విత్త సంస్థలు ఉండాలని తమ సర్కారు భావించడం లేదని ఆయన వివరించారు. ఆయా విత్త సంస్థల విలీనంపై నిర్ణయమనేది ఆయా బ్యాంకు బోర్డుల వాణిజ్య పరిశీలనల మేరకే జరుగుతుందని ఆయన విశ్లేషించారు. ఈ ప్రత్యామ్నాయ వ్యవస్థలోకి సభ్యులను ప్రధాన మంత్రి నిర్ణయిస్తారని తెలుస్తోంది. అందుబాటులో ఉన్న సమాచారం మేరకు ఈ వ్యవస్థలో ఆర్థిక మంత్రి జైట్లీతో పాటుగా, రవాణా శాఖా మంత్రి నితిన్ గడ్కరి ఉండనున్నట్టుగా తెలుస్తోంది. ప్రస్తుతం దేశ వ్యాప్తంగా భారతీయ స్టేట్ బ్యాంక్ కాకుండా దాదాపు 20 ప్రభుత్వ రంగ బ్యాంకులు పని చేస్తున్నాయి. ప్రభుత్వం నియమించే ప్రత్యామ్నాయ వ్యవస్థ నుంచి సూత్రప్రాయంగా అనుమతులు లభించగానే చట్ట ప్రకారం, మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ పరిమితులకు లోబడి బ్యాంకులు ఏకీకరణ దిశగా అడుగులు వేస్తాయని జైట్లీ వివరించారు. చిట్టచివరిగా భారతీయ రిజర్వు బ్యాంకుతో సంప్రదింపుల మేరకు సర్కారు విలీనపు పథకాలను నోటిఫై చేయనున్నట్టుగా సర్కారు ఒక ప్రకటనలో తెలిపింది.

రూ.2,000 నోటు రద్దు యోచనే లేదు..

న్యూఢిల్లీ: అతిపెద్ద కరెన్సీ నోటుగా చలామణిలో ఉన్న రూ.2000 నోటు రద్దుపై వస్తున్న ఊహాగానాలకు బుధవారం సర్కారు చెక్ చెప్పింది. రద్దు విషయంపై ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ స్పందించారు. రూ.2వేల నోటును రద్దు చేసే ప్రతిపాదనేదీ కేంద్రం వద్ద లేదనితేల్చి చెప్పారు. కొత్త రూ.200 నోటును ఎప్పట్నుంచి తీసుకొచ్చేది ఆర్‌బీఐ నిర్ణయం తీసుకుంటుందని పేర్కొన్నారు. తక్కువ నగదు విలువ కలిగిన కరెన్సీ కొరత దష్ట్యా రూ.200 నోటును తీసుకొచ్చేందుకు ఆర్‌బీఐకి ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని పేర్కొన్నారు. అయితే, ఆ నోట్లు ఎప్పటి నుంచి ముద్రించాలి, ఎప్పటి నుంచి చలామణిలోకి తీసుకురావాలనే వివరాలను ఆర్‌బీఐనే చూసుకుంటుందని తెలిపారు. గతేడాది నవంబర్ 9న చలామణిలో ఉన్న రూ.500, రూ.1000 నోట్లను ప్రభుత్వం రద్దు చేసి రూ.500, రూ.2000 నోట్లను తీసుకొచ్చిన సంగతి తెలిసిందే.

ఇన్ఫీలోకి నందన్ రీఎంట్రీ..!

- నాన్‌ఎగ్జిక్యూటివ్ చైర్మెన్‌గా రంగ ప్రవేశం!
- అమెరికా పర్యటన అర్థాంతరంగా రద్దు
- బెంగుళూరులో బస చేసి పరిస్థితి సమీక్ష



మూర్తి ఆరోగ్యం అనుకూలించకేనా..!

కంపెనీ సహవ్యవస్థాపకులు నారాయణమూర్తి ఇన్వెస్టర్లతో బుధవారం నిర్వహించ తలపెట్టిన సమావేశం వాయిదా పడింది. మూర్తి అనారోగ్య కారణాలరీత్యా బుధవారం సాయంత్రం 6.30 గంటలకు జరపాల్సిన సమావేశాన్ని ఈ నెల 29కి వాయిదా వేశారు. ఇన్ఫోసిస్ వ్యవస్థాపకులు నారాయణ మూర్తి ఆరోగ్యం బాగులేక పోవడం.. సంస్థలో సంక్షోభం అంతకంతకు పెరిగిపోతున్న కారణంగానే నిలేకని తిరిగి సంస్థలోకి అడుగు పెట్టే దిశగా యోచిస్తున్నట్టుగా సమాచారం. ఇందులో భాగంగానే ఆయన ఇప్పటికే వ్యవస్థాపక సభ్యులకు బోర్డుకు మధ్య నెలకొన్న విబేధాలను సర్దుమానిపే పనిని ప్రారంభించినట్టుగా తెలుస్తోంది.

బెంగళూరు: ఐటీ దిగ్గజం ఇన్ఫోసిస్‌లో నెలకొన్న సంక్షోభానికి తెర దించేలా వేగంగా అడుగులు పడుతున్నాయి. ఇందుకు గాను సంస్థ వ్యవస్థాపక సభ్యులలో ఒకరైన నందన్ నిలేకని చురుకైన పాత్ర పోషిస్తున్నట్టుగా సమాచారం. చైర్మెన్, ఎండీగా విశాల్ సిక్కా రాజీనామాతో ఇన్ఫీ ప్రతిష్ట ఇటు దేశీయంగాను.. అటు విదేశాల్లోనూ.. దిగజారుతూ వస్తోంది. ఈ నేపథ్యంలో తలెత్తిన పరిణామాలకు ఫుల్‌స్టాప్ చెప్పేందుకు గాను నిలేకని తిరిగి సంస్థ పాలనలోకి అడుగుపెట్టనున్నట్టుగా వినవస్తోంది. ఇన్ఫీ బోర్డులో నాన్-ఎగ్జిక్యూటివ్ చైర్మెన్‌గా ఆయన తిరిగి రంగ ప్రవేశం చేస్తారని కంపెనీలోని అభిజ్ఞ వర్గాలు చెబుతున్నాయి. ఇందుకోసమే ఆయన తన రెండు నెలల అమెరికా పర్యటనను అర్థాంతరంగా రద్దు చేసుకొని బెంగుళూరులోనే బస చేస్తున్నట్టు సమాచారం. కంపెనీలో సంక్షోభానికి చరమగీతం పాడి ఇన్ఫీని తిరిగి గాడిలో పెట్టాలని నిలేకని సీరియస్‌గా యోచిస్తున్నట్టుగా సమాచారం. 2002 నుంచి 2007 వరకు ఇన్ఫీ సీఈవోగా బాధ్యతలు నిర్వర్తించిన అనుభవం నిలేకనికి ఉంది.

సిక్కా రాజీనామా వార్తలు వెలువడిన మరుసటి రోజు నుంచే నిలేకని రంగంలోకి దిగి నిరంతరాయంగా సంస్థను నిలబెట్టే ప్రయత్నాలు చేస్తున్నట్టుగా తెలుస్తోంది.

ఆ నలుగురికి పదవీ గండమే..

ఇన్ఫీ బోర్డులోకి నిలేకని తిరిగి రంగ ప్రవేశం వార్తల నేపథ్యంలో సంస్థలో వ్యవస్థాపకులకు వ్యతిరేకంగా వ్యవహరిస్తూ వచ్చిన వారిపై ఒత్తిడి అంతకంతకు పెరుగుతోంది. నిలేకని గనుక బోర్డులోకి వస్తే నలుగురికి పదవీ గండం ఏర్పడే అవకాశాలు ఉన్నట్టుగా తెలుస్తోంది. ఇన్‌చార్జి చైర్మెన్ ఆర్. శేషశాయి. కో-చైర్మెన్ రవి వెంకటేశన్, ఆడిట్ కమిటీ చైర్మెన్ రూపా కుద్వా, నామినేషన్ కమిటీ చైర్మెన్ జెఫ్ లెహమన్ పదవీ గండం తప్పకపోవచ్చని వారు చెబుతున్నారు. అయితే సంస్థను చక్కబెట్టేందు కోసం నిలేకని తాత్కాలికంగా అత్యున్నత హోదాలో కూర్చొని క్రియాశీలకంగా వ్యవహరించనున్నట్టుగా తెలుస్తోంది. సమర్థవంతుడైన కొత్త సీఈవోను ఎంపిక చేసిన తరువాత ఆయన తిరిగి ఆ బాధ్యతల నుంచి తప్పుకోంటారని కంపెనీ వర్గాల ద్వారా తెలుస్తోంది. నందన్ నిలేకనికి అప్పగించే బాధ్యతలపై మరో 48 గంటల్లో స్పష్టత వచ్చే అవకాశం ఉన్నట్లు సమాచారం. నిలేకని ఇన్ఫోసిస్‌లోకి తిరిగి రానున్నారన్న వార్తలు అటు స్టాక్‌మార్కెట్‌లో కూడా ఉత్సాహం నింపాయి.

రెండో రోజూ వరుసలాభాలు..

దన్నుగా రియాల్టీ, బ్యాంకింగ్ షేర్లు

చెన్నై: రియాల్టీ, బ్యాంకింగ్ షేర్ల దన్నుతో వరుసగా రెండో రోజూ స్టాక్ మార్కెట్లు లాభాల్లో ముగిశాయి. దీంతో పాటు ఇన్ఫోసిస్ చైర్మెన్‌గా నందన్ నీలేకని బ్యాధతలు చేపట్టవచ్చన ఊహగానాలు ఊపందుకోవడంతో బుధవారం ఇన్ఫీ షేర్ల కొనుగోళ్లకు మదుపర్లు ఆసక్తి చూపారు. ఈ నేపథ్యంలో ప్రధాన సూచీలు రికార్డు స్థాయిలను నమోదు చేశాయి. మరోవైపు అంతర్జాతీయంగా సానుకూల వాతవారణం నెలకొనడం కూడా కలిసొచ్చింది. ఈ నేపథ్యంలో బీఎస్ఈ సెన్సెక్స్ 276.16 పాయింట్లు లాభపడి 31,568.01 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 86.95 పాయింట్లు పెరిగి 9,852.5 వద్ద స్థిరపడింది. బీఎస్ఈలో రంగాల వారిగా రియాల్టీ సూచీ 3.48 శాతంతో అత్యధికంగా లాభపడింది. ఇదే క్రమంలో లోహ 1.81శాతం, బ్యాంకింగ్ 1.39శాతం, పీఎస్‌యూ 1.2శాతం చొప్పున పెరిగాయి. మరోవైపు కన్స్యూమర్ డురెబుల్స్ సూచీ 0.75శాతం, ఎఫ్ఎంసీజీ 0.04శాతం చొప్పున పడిపోయాయి. అదానీ పోర్ట్స్ 2.79శాతం, భారతీ ఎయిరటెల్ 2.41శాతం, టాటా స్టీల్ 2.28శాతం, డాక్టర్ రెడ్డీస్ 2.25శాతం చొప్పున అధిక లాభాలను గడించిన వాటిలో ముందు వరుసలో ఉన్నాయి. మరోవైపు హెచ్‌యూఎల్ 1.05శాతం, సన్‌పార్మా 0.45శాతం, ఐటీసీ 0.28శాతం, పవర్ గ్రిడ్ 0.21శాతం, ఎంఅండ్ఎం 0.13శాతం చొప్పున అధిక నష్టాలను చవి చూసిన వాటిలో ముందు వరుసలో నిలిచాయి.

28న మరోదఫా చర్చలు..

మున్సిపల్ కార్మిక సంఘాల జేఏసీతో సర్కారు భేటీ



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

మున్సిపల్ కార్మికుల న్యాయమైన డిమాండ్లపై రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. పలు డిమాండ్లపై ప్రభుత్వం సూత్రప్రాయంగా అంగీకరించింది. జీహెచ్ఎంసీ తరహాలో మున్సిపాలిటీ కాంట్రాక్టుల కార్మికుల వేతనాలను ఏజెన్సీలతో సంబంధం లేకుండా నేరుగా చెల్లించేందుకు అంగీకారం తెలిపింది. బకాయిలు లేకుండా ప్రతి నెలా చెల్లించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చింది. గ్రేటర్ హైదరాబాద్ చుట్టూ ఉన్న కొత్త మున్సిపాల్టీలు, నగర పంచాయతీలు బోడుప్పల్, ఫిర్జాదీగూడ, పెద్ద అంబర్‌పేటల్లో మున్సిపల్ కార్మికులకు వేతనాలను పెంచుతామని తెలిపింది. పర్మినెంట్ కార్మికులతోపాటు కాంట్రాక్టు వారికీ రక్షణ పరికరాలను అందజేస్తామని హామీనిచ్చింది. బుధవారం సచివాలయంలో రాత్రి 9.15 గంటల వరకు ప్రభుత్వానికి, మున్సిపల్ కార్మిక సంఘాల జేఏసీ నేతలకు సుదీర్ఘంగా చర్చలు జరిగాయి. హైదరాబాద్‌లో మున్సిపల్ కార్మికులకు గతంలో పెంచిన రూ 1,500 వేతనాన్ని వెంటనే కార్మికులకు ఇచ్చేందుకు అంగీకరించింది. మున్సిపల్ కార్మికులు మరణిస్తే వారి అంత్యక్రియలకు ప్రభుత్వం రూ.20వేలు చెల్లించేందుకు ఆమోదం తెలిపింది.పీఎఫ్, ఈఎస్ఐ పకడ్బందీగా అమలు చేయనున్నట్టు పేర్కొంది. రెండు పడక గదుల ఇండ్ల కేటాయింపుల్లో మున్సిపల్ కార్మికులకు ప్రాధాన్యత ఇస్తామని హామీ ఇచ్చింది. జీవో 14 ప్రకారం మున్సిపల్ కార్మికులు అనారోగ్య కారణంగా మరణిస్తే వారి కుటుంబ సభ్యుల్లో ఒకరికి వారసత్వ ఉద్యోగం ఇచ్చేలా చూస్తామని జేఏసీ నేతలకు మున్సిపల్ శాఖ కార్యదర్శి నవీన్ మిట్టల్ హామీ ఇచ్చారు. పలు డిమాండ్లపై అంగీకారం తెలిపిన ప్రభుత్వం వాటి అమలుపై మాత్రం స్పష్టత ఇవ్వలేదు. ఈ నేపథ్యంలో ఈనెల 28న మరో దఫా చర్చలు జరపాలని నిర్ణయించారు. మున్సిపల్ కార్మిక సంఘాల జేఏసీ ఈనెల 3న ప్రభుత్వానికి ఇచ్చిన సమ్మె నోటీస్ ఇచ్చిన సంగతి విదితమే. ఈ నేపథ్యంలో ఈనెల 21న మొదటి దఫాల చర్చలు జరిగాయి. బుధవారం రాత్రి పలు డిమాండ్లపై సానుకూలంగా స్పందించినట్టు జేఏసీ నేతలు పేర్కొన్నారు. ఈ చర్చల్లో పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ స్పెషల్ సెక్రటరీ నవీన్‌మిట్టల్, డీఎంఏ డైరెక్టర్ టికె శ్రీదేవి, ఇతర అధికారులతోపాటు తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ కార్మిక సంఘాల జేఏసీ (సీఐటీయూ, ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ, ఐఎఫ్‌టీయూ, బీఎంఎస్, హెచ్ఎంఎస్, ఎఐయూటీయూసీ, టీఎన్‌టీయూసీ) నేతలు పాలడుగు భాస్కర్, కమర్ అలీ, జె వెంకటేష్, కె ఏసురత్నం, ఎంకె బోస్, రామారావు, శంకర్, అజూర్ షరీఫ్, వి కృష్ణ, ఏ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

శాశ్వతంగా భూవివాదాల పరిష్కారం

సర్వేకు తేదీల ఖరారు

- ఉన్నతస్థాయి సమీక్షలో సీఎం కేసీఆర్
- 3600 బృందాల ఏర్పాటు
- ఆన్‌లైన్ వివరాల ఆధారంగానే
- పెట్టుబడి పథకం అమలుకు నిర్ణయం



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రవ్యాప్తంగా భూముల సర్వే రికార్డుల ప్రక్షాళన తేదీలను ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు ఖరారు చేశారు. భూ సర్వే రికార్డుల ప్రక్షాళనలో భాగంగా రైతు సంఘాలు ఏర్పాటు, రైతు సదస్సుల నిర్వహణ తేదీలను సైతం ప్రకటించారు. శాశ్వతంగా భూవివాదాలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అత్యంత పారదర్శకంగా, సరళంగా ఉండాలని సూచించారు. భూమి రికార్డుల నిర్వహణ, రిజిస్ట్రేషన్ విధానం పకడ్బందిగా ఉండేలా చూడాలని చెప్పారు. బుధవారం హైదరాబాద్‌లోని ప్రగతిభవన్‌లో ఉన్నతస్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా భూముల సర్వే, రైతు సంఘాల ఏర్పాట్లు, సదస్సుల నిర్వహణపై సుదీర్ఘంగా చర్చించారు. సెప్టెంబర్ 1 నుంచి 9 వరకు గ్రామరైతు సంఘాల సమన్వయ సమితులు ఏర్పాటు చేయనున్నారు. సెప్టెంబర్ 10 నుంచి 15 వరకు మండల స్థాయిలో రైతు సమన్వయ సమితులు, సదస్సులు నిర్వహించనున్నారు. ఈ సమావేశంలో ఉపముఖ్యమంత్రులు మహమూద్ అలీ, పోచారం శ్రీనివాసరెడ్డి, జోగు రామన్న, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు నిరంజన్‌రెడ్డి, డిప్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్‌రెడ్డి, ప్రభుత్వ విప్ గొంగిడి సునిత, కార్పొరేషన్ చైర్మన్లు భూమ్‌రెడ్డి, కిషన్‌రావు, సుభాష్‌రెడ్డి, ఎమ్మెల్యేలు ఎర్రబెల్లి దయాకర్‌రావు, కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, మర్రి జనార్ధన్‌రెడ్డి, మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, బాజిరెడ్డి గోవర్ధన్‌రెడ్డి, సుధీర్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన సలహాదారు రాజీవ్ శర్మ, రమణాచారి, రెవెన్యూ శాఖప్రత్యేక ప్రధాన కార్యదర్శి బీఆర్ మీనా, ఐఎఎస్ అధికారులు శాంతికుమారి, స్మితా సబర్వాల్, వాకాటి కరుణ, ప్రియదర్శిని, నదీమ్ అహ్మద్, భూపాల్‌రెడ్డి, కలెక్టర్లు రఘునందన్‌రావు, శ్రీధర్, లోకేశ్‌కుమార్, పీసీసీఎఫ్ ఝా, జయేశ్ రంజన్, దేవదాసు, జేసీలు సుందర్ అబ్నార్, ధర్మారెడ్డి పాల్గొన్నారు. మొత్తం 3600 బందాలతో రికార్డుల ప్రక్షాళన చేపట్టాలని సీఎం ఆదేశించారు. రెవెన్యూ అధికారి, వ్యవసాయ అధికారి, రైతు సంఘం సమన్వయంతో భూరికార్డుల సవరణ చేపట్టాలని ఈ సందర్భంగా సీఎం సూచించారు. నెలరోజుల పాటు గ్రామ సభలు నిర్వహించి భూరికార్డుల సవరణ చేయాలని చెప్పారు. సీఎం, మంత్రులు, ప్రజాప్రతినిధులు ఒక్కో యూనిట్ బాధ్యత తీసుకుని భూరికార్డుల ప్రక్షాళన కార్యక్రమం పర్యవేక్షించాలని నిర్ణయించారు. డిసెంబర్ నాటికి రికార్డులు సరిచేసి వివరాలు ఆన్‌లైన్‌లో పొందుపరచాలని అభిప్రాయపడ్డారు. ఆన్‌లైన్‌లో ఉన్న వివరాల ఆధారంగానే ఏడాదికి ఎకరాకు రూ.8 వేలు పెట్టుబడి పథకాన్ని ప్రభుత్వం అమలు చేయాలని ఈ సమావేశంలో నిర్ణయించారు. వ్యవసాయాన్ని మాత్రమే నమ్ముకున్న రైతు అప్పుల్లో కూరుకుపోతున్నారు. ఏ మాత్రం గిట్టుబాటు ఉండటం లేదు. బతకడమే కష్టంగా ఉంది. భార్యకు కనీసం చీర కూడా కొనలేదు. పిల్లలకు స్కూల్ ఫీజు కట్టలేడు. ఇతర పనులేమీ లేకుండా కేవలం వ్యవసాయంపై ఆధారపడిన రైతులది దురవస్థ. పరువు కోసం తెల్లబట్టలేసుకుని తిరుగుతారు. కాని పరిస్థితి ఏమి బాగుండదని ముఖ్యమంత్రి తన ప్రసంగం సందర్భంగా వ్యాఖ్యానించారు. ఆ పరిస్థితుల నుంచి రైతులను గట్టెక్కించడానికే ఎకరాకు రూ. 8 వేల పెట్టుబడి పథకమని చెప్పారు. భూరికార్డుల ప్రక్షాళనకు అనుసరించాల్సిన పద్దతులపై రంగారెడ్డి జిల్లా కలెక్టర్ రఘునందన్‌రావు నేతృత్వంలో ఏర్పడిన కమిటీ చేసిన అధ్యయనంపై కూడా చర్చ జరిగింది.

ముఖ్యాంశాలు

1. ఒక్కో రెవెన్యూ గ్రామాన్ని ఒక యూనిట్‌గా పరిగణిస్తారు. రాష్ట్రం మొత్తాన్ని 1100 యూనిట్లుగా నిర్ణయించారు. 3,600 బృందాలను సర్వే కోసం వినియోగిస్తారు.
2. ఎలాంటి వివాదాలు లేని భూములు దాదాపు 85 నుంచి 95 శాతం ఉంటాయని, ఈ రికార్డులను ముందుగానే సరిచూస్తారు. పేరు మార్పిడి, క్రయవిక్రాలు జరిగిన వివరాలను సేకరిస్తారు. రికార్డులకు తుదిరూపం ఇస్తారు. ఆ రికార్డులను ఆన్‌లైన్‌లో పెడతారు. రెండోదశలో వివాదాస్పద భూములకు సంబంధించిన పరిష్కార మార్గాలను చూపుతారు. కోర్టు వివాదాలు ఉంట కోర్టు తీర్పులకనుగుణంగా యాజమాన్య హక్కులు కల్పిస్తారు.

ఎనిమిది దశాబ్దాల తరువాత సర్వే: సీఎం

1932-36 మధ్య నిజాం కాలంలో భూసర్వే జరిగిందని ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నారు. ఆ తరువాత మళ్లీ జరగలేదని చెప్పారు. ఈ ఎనిమిది దశాబ్దాల కాలంలో అనేక మార్పులు జరిగాయని అభిప్రాయపడ్డారు. అటవీ, ప్రభుత్వ, దేవాదాయ, ప్రజోపయోగ కార్యక్రమాల కోసం వినియోగిస్తున్న భూమి, ప్రభుత్వ భవనాల కింద ఉన్న భూమి, చెరువులు, కుంటల కింద ఉన్న భూమి తదితర అన్ని వివరాలు సేకరించాలని సీఎం ఆదేశించారు. వ్యవసాయ భూములు వ్యవసాయేతర అవసరాల కోసం బదలాయించిన జరిగిన ఆ వివరాలు, ప్రభుత్వం సేకరించిన భూవివరాలు, ప్రభుత్వం అసెన్ చేసిన భూవివరాలు నమోదు చేయాలన్నారు.

గ్రామ కంఠాన్ని కూడా నిర్ధారించాలని సూచించారు. మొదటి దశలో వివాదాలు లేని భూములు, ఆ తరువాత మిగతా వాటి సంగతి తేల్చాలని చెప్పారు. బ్యాంకులు అవలంబిస్తున్న కోర్ బ్యాంకింగ్ విధానం లాంటిది భూరికార్డుల నిర్వహణలో అనుసరించాలని సూచించారు. ఎటీఎం ద్వారా ఏ బ్యాంకులో, ఏ ప్రదేశంలో డబ్బులు విత్‌డ్రా చేసుకున్నా, వెంటనే ఆన్‌లైన్‌లో తెలిసిపోతుంది, వినియోగదారుడికి మెసేజ్ వస్తుంది, అలాగే భూరికార్డులు కూడా ఉండాలని చెప్పారు. పాస్‌పుస్తకాల్లో ఎక్కడ ఏ మార్పు జరిగినా అంతటా తెలిసిపోవాలని, ప్రతిది పారదర్శకంగా ఉండేలా చర్యలు అవసరమని తెలిపారు. ఇందుకోసం మండలానికో ఐటీ అధికారిని నియమించాలన్నారు. రిజిస్ట్రేషన్లు కూడా పారదర్శకంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

క్రయవిక్రయాలు జరిపే రైతులిద్దరూ రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వెళ్లాలి, వారి పుస్తకాలు ఇవ్వాలి, రిజిస్ట్రార్ రెండు పాసుపుస్తకాలు తీసుకుని అమ్మినవారి నుంచి భూమిని తొలగించి, కొన్నవారి పాస్‌పుస్తకంలో ఎంటర్‌చేయాలని చెప్పారు. ఈ రెండింటిని తహసీల్దార్‌కు పంపాలి, నాలుగు పనిదినాల్లో వివరాలు నమోదు కావాలన్నారు. పాస్‌పుస్తకాలపై అటెస్టేషన్ చేయాలని, పేరు మార్చాలన్నారు. అనంతరం అది తిరిగి సబ్‌రిజిస్ట్రార్‌కు పంపాలని, రిజిస్ట్రార్ తన రికార్డుల్లో నమోదు చేసుకున్న తరువాత, వాటిని కొరియర్ ద్వారా రైతులకు చేర్చాలని సూచించారు. పైరవీలకు తావు ఉండకూడదన్నారు. పహాణీల నిర్వహణ సరళంగా ఉండాలన్నారు. స్టాంపుల చట్టాలను, రిజిస్ట్రేషన్ చట్టాలను క్షుణ్ణంగా అధ్యయనం చేసి అవసరమైన మార్పులు చేయాలని ఆదేశించారు. భవిష్యత్తులో ప్రతి మండలానికి ఒక రిజిస్ట్రేషన్ కార్యాలయం ఏర్పాటు చేసుకోవాలన్నారు. వీలైతే తహసీల్దార్‌కు రిజిస్ట్రేషన్ చేసే అధికారం ఇచ్చే అవకాశాలు పరిశీలించాలని కోరారు. రెవెన్యూ కోర్టులు కూడా ఇన్ని ఉండాలా ? కేవలం కలెక్టర్ వద్ద ఒక్క కోర్టు మాత్రమే నిర్వహించాలా ? అనే విషయంలో కూడా నిర్ణయం తీసుకోవాలని చెప్పారు. ప్రభుత్వ భూములను అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయకుండా నిషేధిత జాబితా కూడా తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. ఆ భూములను రిజిస్ట్రేషన్‌ను అంగీకరించి విధంగా సాఫ్ట్‌వేర్‌ను రూపొందించాలని చెప్పారు. కాళేశ్వరం ద్వారా 40 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందని చెప్పారు. పాలమూరు, సీతారామ ప్రాజెక్టుల నిర్మాణం జరుగుతుందన్నారు. ఉచిత విద్యుత్ మూలంగానే రైతులు భూగర్భ జలాలను గరిష్ట స్థాయిలో ఉపయోగించుకోవాలని సూచించారు. భూరికార్డులను సరిచేసే కార్యక్రమం సెప్టెంబరు 15న ప్రారంభం కావాలన్నారు.

ఫోటో జర్నలిస్టుల స్థితిగతులు మారాలి: స్పీకర్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

వార్తా ప్రపంచంలో జర్నలిస్టుల కంటే అధ్వాన్నంగా ఉన్న ఫోటో జర్నలిస్టుల స్థితిగతులు మారాల్సిన అవసరం ఉందని శాసనసభ స్పీకర్ ఎస్.మధుసూదనాచారి అన్నారు. ఈ రంగంలో యాజమాన్యం, విలేకరుల తర్వాత ఫోటోలు అందించే ఫోటో జర్నలిస్టులదే కీలక పాత్ర ఉంటుందని, అయినా వారికి సరైన ప్రాధాన్యత, గుర్తింపు దక్కకపోవడం విచారకరమన్నారు. తెలంగాణ రాష్ట్ర ఫోటో జర్నలిస్టుల సంఘం నిర్వహించిన 2017 వార్తా ఛాయా చిత్రాల పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరచిన ఫోటో జర్నలిస్టులకు బుధవారం బషీర్‌బాగ్‌లోని దేశోద్ధారక భవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో స్పీకర్ ముఖ్య అతిథిగా హాజరై బహుమతులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోటీలకు ఎంపికైన ఒక్కొక్క చిత్రాన్ని పరిశీలిస్తే ఆనందం, అభిమానంతో పాటు అలోచింపజేసే విధంగా ఉన్నాయన్నారు. ఎంతో సహనంతో కూడిన వృత్తి ధర్మాన్ని ఫోటో జర్నలిస్టులు పాటిస్తూ మానవ శరీరంలో అత్యంత వేగంగా పనిచేసే మెదడు కంటే వేగంగా స్పందిస్తూ ఫోటోలను తీయడం చిన్న విషయం కాదన్నారు. పెరుగుతున్న పోటీ ప్రపంచంలో తమ ప్రాణాలను సైతం లెక్క చేయకుండా వార్తా ఛాయా చిత్రాలను తీస్తున్న జర్నలిస్టులకు సరైన గుర్తింపు, ప్రాధాన్యత లభించి, వారి జీవన స్థితిగతుల్లో మార్పు రావాల్సిన అవసరం ఉందని, అందుకోసం అవకాశం ఉన్నప్పుడల్లా తమ సహాయ సహకారాలు అందించడానికి సిద్ధంగా ఉన్నానని స్పీకర్ హామీ ఇచ్చారు. ఐజేయూ కార్యదర్శి దేవులపల్లి అమర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఫోటో జర్నలిస్టుల సంఘం ఏటా ఇలాంటి పోటీలను నిర్వహించడం అభినందనీయమన్నారు. అయితే పోటీల్లో అవార్డులను గెలుచుకోనివారు నిరుత్సాహ పడాల్సిన అవసరంలేదని, గెలిచిన వారు గెలవని వారు అందరూ సమానంగా తమ ప్రతిభను కనబర్చారని చెప్పారు. తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు సంఘం ప్రధాన కార్యదర్శి విరాహత్ అలీ మాట్లాడుతూ పోటీల్లో ఉన్న ఒక్కొక్క ఫోటో ఒక్కొక్క భావాన్ని చూపుతుందని, ఒక్కక్క ఫోటోకు ఒక పుస్తకాన్ని రాయవచ్చాన్నారు. ఫోటో జర్నలిస్టుల్లో ఉన్న ప్రతిభను వెలికితీసి వారిని ప్రోత్సహిస్తున్న తెలంగాణ రాష్ట్ర ఫోటో జర్నలిస్టుల సంఘం అధ్యక్షులు అనుమల గంగాధర్ అధ్యక్షత వహించగా ప్రధాన కార్యదర్శి కెఎన్.హరి మాట్లాడుతూ గడిచిన రెండు దశాబ్దాలుగా సంఘం ఆధ్వర్యాన ఇలాంటి పోటీలను నిర్వహిస్తున్నామని, గత ఏడాది 80 ఎంట్రీలు రాగా ఈ సారి రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి 105 ఎంట్రీలు వచ్చాయన్నారు. స్పీకర్ గత ఏడాది 2016 విజేతలకు బహుమతులు అందజేయగా సంఘం కార్యవర్గ సభ్యులు వసంత్ కుమార్ కార్యక్రమానికి తొలుత స్వాగతం పలికారు.





జాగ్రత్తలు పాటిస్తే 'పండు'గే..

జామకు పేదవాడి యాపిల్ అనే పేరుంది. అందరికీ అందుబాటులో ఉండే ఈ పండులో పోషకాలు పుష్కలం. ఆరోగ్య రక్షణకు ఇదెంతో దోహదపడుతుంది. అందుకే.. దీనికి దేశీయ మార్కెట్‌లో మంచి గిరాకీ ఉంది. అంతర్జాతీయంగా సుమారు 40 దేశాల్లో దీనికి డిమాండ్ ఉంది. సరైన జాగ్రత్తలు పాటిస్తే రైతన్నలకు దీని సాగు లాభదాయకమే.

జామను సంప్రదాయ పద్ధతిలో సాగు చేపట్టినప్పుడు చెట్లు బాగా పెద్దగా పెరిగి సరైన దిగుబడి ఇవ్వలేకపోతున్నాయి. ఈ పద్ధతిలో ఎకరానికి ఎకరానికి 4నుంచి 5 టన్నుల దిగుబడి మాత్రమే వస్తుంది. కాబట్టి ప్రస్తుత సాగు పద్ధతిలో మార్పు చేయాల్సి అవసరముంది. ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా అధిక, అత్యధిక సాంద్రతలో మొక్కలు నాటి సాగు చేసే పద్ధతి ఊపందుకుంది. ఈ అత్యధిక సాంద్ర పద్ధతినే 'మెడో' అంటారు. ఈ పద్ధతిలో మొక్క పరిమాణాన్ని అవసరం మేరకు నియంత్రించాలి. వెలుతురు బాగా ప్రసరించేలా చూడటం వల్ల కొమ్మ కత్తిరింపులు, సస్యరక్షణ చర్యలు, కోత తదితర పనులు తేలిక అవుతాయి.

రకాలు: వాణిజ్య రకాలైన అలహాబాద్, సఫేద్, లక్నో 49, అధిక సాంద్రత, అత్యధిక సాంద్రత విధానానికి బాగా అనుకూలం.

మొక్కల సాంద్రత: మెడో పద్ధతిలో ఎకరానికి 200 మొక్కలు 2 x1 మీ దూరంలో నాటుతారు. అదే మన సంప్రదాయ పద్ధతిలో 6 x 6 మీ దూరంలో ఎకరానికి 112 మొక్కలు నాటేవారు. అధిక సాంద్రత పద్ధతిలో కింద తెలిపిన దూరాన్ని పాటించి నాటుకోవచ్చు.

దూరం	మొక్కలు (ఎకరానికి)	మూడేండ్లలో దిగుబడి
3 x 3 మీ	888	10 నుంచి 12 టన్నులు
3 x 3మీ	444	7నుంచి 8 టన్నులు
6 x 3మీ	222	5నుంచి 6 టన్నులు
2 x 1మీ	2వేలు	16 నుంచి 20 టన్నులు

మొక్కలు నాటే కాలం: సంవత్సరంలో ఎప్పుడైనా నాటుకోవచ్చు. ఒకటిన్నర అడుగుల పరిమాణంలో పొడవు, వెడల్పు, లోతు ఉండే గోతులు తీసి 10 నుంచి 15కిలోల పశువుల ఎరువు, 500గ్రాముల సూపర్ ఫాస్ఫేట్ కలిపి గుంతల్లో నింపుకోవాలి.

పెరుగుదల నియంత్రణ: మొక్క కాండంపై 30 నుంచి 40 సెం.మీటర్ల వరకు పక్క కొమ్మలు పెరగనివ్వకూడదు. సుమారు 40సెం.మీటర్ల ఎత్తు వద్ద ప్రధాన కాండాన్ని కత్తిరించాలి. 20 రోజుల తర్వాత కత్తిరించిన దగ్గర కొత్త చిగర్లు వస్తాయి. అందులో నాలుగు కొమ్మలు ఉంచి నాలుగు కొమ్మలు తీసేయాలి. ఈ కొమ్మలు 3,4 నెలలు పెరిగిన తర్వాత 50 శాతం కత్తిరించాలి. మళ్లీ కొత్త చిగుర్లు వచ్చినప్పుడు పైన తెలిపిన విధంగా ఎంపిక చేసుకొని మిగిలిన వాటిని కత్తిరించాలి. కొత్తగా వచ్చే కొమ్మల మీద పూత, పిందె ఏర్పడతాయి. ఈ విధంగా చేయడం వల్ల మొక్కలు కావాల్సిన అకారం సంతరించుకుంటాయి. రెండో సంవత్సరం కూడా కొమ్మ కత్తిరింపులు చేయాలి. దాంతో మొక్కలన్నీ 2.5 మీటర్ల ఎత్తు, 2మీటర్ల వెడల్పు వరకు నియంత్రించుకోవచ్చు.

ప్రతి సంవత్సరం ఎండిన కొమ్మలను అడ్డంగా ఉన్న కొమ్మలను తీసేయాలి. గత సంవత్సరం కాపు కాసిన కొమ్మలను నాలుగింట మూడో వంతు కత్తిరిస్తే పక్క కొమ్మలపై కాపు బాగా వస్తుంది. కాయలను చిన్న కొమ్మలతో పాటు కోయడం ద్వారా ఇదే రకమైన ఫలితాన్ని పొందొచ్చు.

కాపు నియంత్రణ: సాధారణంగా జామలో సంవత్సరానికి రెండుసార్లు కాపు వస్తుంది. ఈ విధంగా వచ్చి దిగుబడిలో కాయ సైజు, నాణ్యత తగ్గిపోతుంది. వాణిజ్య రీత్యా సంవత్సరం మొత్తంలో చలికాలంలో పంట తీసుకోవడం వల్ల కాయ నాణ్యత దిగుబడి బాగుంటుంది. కాపును నియంత్రించేందుకు కొన్ని పద్ధతులు అవలంబించాలి.

పండ్ల కోత: జామ నాణ్యత నిల్వగుణం కాపు తీసుకునే కాలంపై ఆధారపడి ఉంటుంది. వర్షకాలం కంటే శీతాకాలం పంటలో జామ నాణ్యత బాగా ఉంటుంది. పూత తర్వాత 4నుంచి 5 నెలలకు జామ కోతకొస్తుంది. కోతకొచ్చినప్పుడు ఆకుపచ్చ రంగు నుంచి లేత ఆకుపచ్చ రంగులోకి మారుతుంది. ఒక చెట్టులో అన్ని కాయలు ఒకేసారి పక్వదశకు రానందున జామ కాయలను పలుమార్లు కోయాల్సి వస్తుంది. వర్షాకాలపు పంటలో రెండు నుంచి మూడు రోజుల వ్యవధిలో, శీతాకాలపు పంటలో నాలుగు నుంచి ఐదు రోజుల వ్యవధిలో కాయలు తెంపాలి. తొడిమెతోపాటు రెండు ఆకులు ఉండేటట్టు కోసినట్టయితే కాయ తాజాగా ఉంటుంది. దూరం ప్రాంతాలకు ఎగుమతి చేయడానికి కూడా వీలుంటుంది.

దిగుబడి: శీతాకాలం కాపు సెప్టెంబరు నుంచి జనవరి వరకు కోతకొస్తుంది. మంచి యాజమాన్య పద్ధతిలో నాటిన తోటలు రెండో సంవత్సరంలో కాపుకొస్తాయి. నాటిన మూడో సంవత్సరం నుంచి లాభదాయకమైన దిగుబడులు వస్తాయి. లేత ఆకుపచ్చ రంగులో ఉన్న కాయలు తెంపాలి. అధిక సాంద్రతలో జామ సాగు చేసేటప్పుడు చెట్టుకు 10 నుంచి 15 కిలోల చొప్పున ఎకరానికి 8 నుంచి 10 టన్నులు, అత్యధిక సాంద్రతలో సాగు చేసినప్పుడు 16 నుంచి 20 టన్నుల దిగుబడి పొందొచ్చు.



- కె. భవ్యశ్రీ, సీనియర్ రీసెర్చ్ ఫెల్లో, ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం



వర్షాకాలం- కోళ్లఫారం



వర్షాకాలంలో వాతావరణ మార్పు కారణంగా కోళ్లు ఒత్తిడికి గురవుతాయి. దీంతో గుడ్ల ఉత్పత్తి సన్నగిల్లుతుంది. కోళ్లకు వ్యాధి నిరోధక శక్తి తగ్గుతుంది. అవి రోగాల బారిన పడి మరణిస్తాయి. ఈ నేపథ్యంలో కోళ్ల ఫారాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. పలు జాగ్రత్తలు పాటిస్తే గుడ్ల ఉత్పత్తి పెరుగుతుంది. బ్రాయిలర్ కోళ్ల మాంసం దిగుబడి ఆశాజనకంగా ఉంటుంది. కోళ్ల మరణాలు తగ్గుతాయి.

- ✓ తేమ, వర్షపు జల్లుల వల్ల గోదాముల్లో ఉన్న ముడి సరుకులు, దాణా బస్తాలు చెమ్మగిల్లి తడిసే అవకాశం ఉంది. నిల్వ ఉన్న సరుకులు బూజు పట్టొచ్చు. ఇవి తడవకుండా జాగ్రత్త తీసుకోవాలి. దాణా నమూనాలను తరచూ పరీక్షిస్తూ ఉండాలి.
- ✓ షెడ్లలోకి నీరు, వర్షపు జల్లులు పడకుండా వెంటిలేటర్లకు గోనె సంచులు కట్టాలి.
- ✓ కలుషిత నీటి వల్ల కోళ్లలో 'ఈ–కోలై' సమస్య వస్తుంది. తాగే నీటిని క్లోరినేషన్ చేసి కోళ్లకు అందించాలి. నీటి తొట్లను 'ఐడోఫోర్' తదితర మందులతో శుభ్రం చేయాలి.
- ✓ వర్షాకాలం లిట్టర్‌లో తేమ శాతం పెరగడం వల్ల కాక్సిడియాసిస్, ఈ–కోలై, న్యూమోనియా, సాల్మొనెల్లోసిస్ తదితర వ్యాధులు సంక్రమిస్తాయి. తేమ శాతం పెరగకుండా ఫారాల పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్త వహించాలి.
- ✓ కేజ్ సిస్టంలో కోడి ఎరువు మురుగు నీటితో కలిసిపోకుండా చూడాలి. తక్కువ గాలి, వెలుతురు వీటికి తోడై ఫారాల్లో అమోనియా శాతం పెరిగి కోళ్లు రోగాల బారిన పడతాయి. వ్యాధి సోకిన కోళ్లు సరిగా మేత తినవు. ఎదగవు, బరువు తూగవు. వీటికి శ్వాస కోశ వ్యాధులు వ్యాపిస్తాయి. కాబట్టి లిట్టర్ పొడిగా ఉండేలా చూడాలి. సున్నం కలిపి దున్నుతుండాలి.
- ✓ వర్షాకాలంలో షెడ్లలో గాలి, వెలుతురు ఎక్కువగా ఉండేలా చూడాలి. ఈ కాలంలో పగటి సమయం రాత్రి కంటే తక్కువగా ఉండటం వల్ల కోళ్లు మేత ఎక్కువగా తింటాయి. షెడ్లలో లైటింగ్ ఎక్కువగా ఉండటం వల్ల గుడ్ల ఉత్పత్తి మెరుగుపడుతుంది. మబ్బులు పట్టిన సమయంలో లైటింగ్ ఏర్పాటు చేయాలి.
- ✓ లేయర్ కోళ్లలో గుడ్ల దిగుబడి, బ్రాయిలర్స్‌లో బరువు తూగడానికి ఖనిజ లవణాల మిశ్రమాన్ని దాణాలో కలిపి ఇవ్వాలి.

- డాక్టర్ జె.సాయి ప్రసన్న, అసిస్టెంట్ ప్రొఫెసర్, పశువైద్య కళాశాల పశు జన్యుశాస్త్ర, ప్రజనన విభాగం, కోరుట్ల-9441512274

ఖమ్మం గుమ్మానికి ఉద్యాన తోరణం

రిపోర్ట్

వాణిజ్య పంటల సాగులో ఖమ్మం జిల్లాకు ప్రత్యేక గుర్తింపు ఉంది. పండ్ల తోటల సాగుకు ఇక్కడ అవకాశాలు మెండుగా ఉన్నాయని ఇటీవల తేలింది. రాష్ట్ర ఉద్యాన శాఖ నిర్వహించి పరిశోధనలో ఈ విషయం వెల్లడైంది. 'పండ్ల తోటల సాగు విస్తీర్ణంలో ఖమ్మం ఉమ్మడి జిల్లా తెలంగాణ రాష్ట్రంలోనే ద్వితీయ స్థానంలో ఉందని ఆ శాఖ గుర్తించింది. గత నెలలో రాష్ట్రప్రభుత్వ ఆదేశాను సారం జిల్లా వ్యాప్తంగా ఉద్యాన శాఖ సిబ్బందితో సమగ్ర సర్వే నిర్వహించారు. బహువార్షిక పంటలు సాగు చేస్తున్న జిల్లా రైతుల వివరాలను క్రోడీకరించారు. జిల్లాలో 42,502 ఎకరాల్లో ఉద్యాన పంటల సాగు ఉన్నట్టు గుర్తించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా ఉద్యాన పంటల సాగులో రాష్ట్రంలోనే రెండో స్థానంలో ఉందని తేల్చారు. రాష్ట్రంలో ఖమ్మం జిల్లాను మించి ఉద్యానపంటలు సాగుచేస్తున్న జిల్లాగా (68,000ఎకరాల్లో) నల్లగొండ మొదటి స్థానంలో నిలిచింది. ప్రధానంగా ఉద్యాన పంటలతో పాటు పలు అంతర పంటలసాగులోనూ ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రత్యేకతను చాటుకుంది. ఇక్కడ ఉద్యాన పంటల సాగుకు అనుకూల వాతావరణం కలిగి ఉందని అధికారులు వెల్లడించారు. సముద్ర మట్టానికి ఉండాల్సిన ఎత్తులో ఈ ప్రదేశం ఉండటంతో గాలిలో తేమ, చల్లని వాతావరణం, తదితర అంశాలన్నీ అనుకూలంగా ఉందని అంటున్నారు. పండ్ల తోటల సాగుకు ఖమ్మం జిల్లా అనుకూలంగా ఉందని, ఇక్యకడ వనరులు పుష్కలంగా ఉన్నాయని సమగ్ర సర్వే ద్వారా వెల్లడైంది. ఈ ప్రాంత రైతులు ఆధునిక పద్ధతిలో సాగు చేస్తే లాభాలు మెండుగా వచ్చే అవకాశాలు ఉన్నాయని వ్యవసాయ శాస్త్రవేత్తలు కూడా సూచిస్తున్నారు.

సత్తుపల్లి, ఖమ్మం, వైరా, పాలేరు, మధిర నియోజకవర్గాల్లో ప్రస్తుతం ఉద్యాన పంటలసాగుకు అను కూలంగా ఉన్నాయని సర్వేలో తేలింది. ప్రస్తుతం ఈ ప్రాంతాల్లో సాగు కూడా ఆశాజనకంగానే ఉంది. ఎక్కువగా పండ్ల తోటలు సాగు చేయటానికి అవకా శాలు ఉన్నాయి. ఆయిల్ ఫామ్, నిమ్మ, జామ తోటలకు అను కూలత ఎక్కువ. మధిర నియోజక వర్గంలో నిమ్మ, జామ, ఆయిల్ పామ్, బత్తాయి యాపిల్ బేర్ తదితర పంటలు పండించటానికి అనువైన నేలలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు.



జామసాగుకు పెరుగుతున్న మద్దతు

జామ సాగుకు ఇక్కడ అనుకూల పరిస్థితులు ఎక్కువగా ఉన్నాయి. తోటలు సాగుచేసే రైతులకు కూడా మంచి భవి ష్యత్తు ఉంటుందని ఉద్యాన శాఖ అధికారులు చెబుతున్నారు. ఇటీవల ఇతర పండ్ల కంటే జామకు ఎక్కువ డిమాండ్ ఉంటోంది. ఆరోగ్యానికి ఎంతో మేలు కలిగించే ఈ పండును తినేవారి సంఖ్య గణనీయంగా పెరగటమే ఇందుకు కారణం . ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ నుంచి జిల్లాలకు జిల్లా నుంచి ఎక్కు వగా జామకాయల ఎగుమతి జరుగుతోంది. టన్ను రూ. 25వేల నుంచి రూ. 30వేల వరకు నూజివీడు, విజయవాడలో ఇక్కడి రైతులు విక్రయిస్తున్నారు.

సత్తుపల్లి నియోజకవర్గంలోని బుగ్గపాగులో ప్రభుత్వం ఫుడ్ ప్రాసెసింగ్ పార్క్ ఏర్పాటు చేస్తున్న విషయం తెలిసిందే. దీని ద్వారా మామిడి, జామ ప్రాసెసింగ్ యూనిట్లకు ఎక్కువ పంట అవసరం అవుతుంది. జామలో 'అర్క కిరణ్ లాంటి ప్రాసెసింగ్‌కి అనువైన రకాన్ని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హార్టికల్చర్ (బెంగుళూరు) రూపొందించింది. ఈ రకం జామ తెలంగాణతో పాటు ఖమ్మం జిల్లాకు ఎంతో అనుకూలమైనదని శాస్త్రవేత్తలు గుర్తించారు. ఈరకం జామ గుజ్జు లేత గులాబీ రంగులో ఉండటం ప్రాసెసింగ్‌కి ఎంతో అను కూలంగా ఉంటుంది. తమిళనాడులో ప్రస్తుతం ఈరకం గుజ్జు టన్ను ధర రూ. 60వేల వరకు పలుకుతోంది.

ప్రభుత్వం ద్వారా రైతులకు రాయితీ

జాతీయ ఉద్యాన మిషన్ ద్వారా పండ్ల తోటలు పెంచే రైతులకు ప్రభుత్వం మూడేండ్ల పాటు రాయితీ అందిస్తుంది. ఈ రాయితీని ఉద్యాన శాఖ ద్వారా రైతుల ఖాతాల్లో నేరుగా జమ చేస్తుంది. ఒక్కో హెక్టారుకు ప్రభుత్వం అందించే రాయితీ వివారలను రాష్ట్ర ఉద్యానవన శాఖ ఇటీవల విడుదల చేసింది.

సర్వేతో సాగు చేసే పంటలపై అవగాహన సర్వే ఆధారంగా జిల్లాలో ఏయే ప్రాంతాల్లో ఎలాంటి పండ్ల తోటలు పెంచటానికి అనుకూల వాతావరణం ఉందన్న విషయంపై ఉద్యాన అధికారులకు స్పష్టమైన అవగాహన ఏర్పడింది.

ప్రభుత్వ నిబంధనల మేరకు ఉద్యాన పంటల సాగును చేపట్టే వారికి ప్రభుత్వం నుండి అందించే ప్రోత్సాహక రాయితీలు ఇలా ఉన్నాయి.

పంటపేరు	హెక్టార్‌కు మొక్కలు	మొదటి సంవత్సరం	రెండో సంవత్సరం	మూడో సంవత్సరం	మొత్తం సబ్సిడీ
మామిడి	400	రూ.9840	రూ.3280	రూ.3280	రూ.16400
నిమ్మ	278	రూ.9601	రూ.3200	రూ.3200	రూ.16001
జామ	1111	రూ.17600	రూ.5866	రూ.5866	రూ.29,332
యాపిల్‌బేర్	400	రూ.8400	రూ.2800	రూ.2800	రూ.14000
సీతాఫలం	1600	రూ.25,440	రూ.8480	రూ.8440	రూ.42400
కొకో	500	రూ.7800	రూ.2600	రూ.2600	రూ.13000
ఆయిల్‌ఫాం	143	రూ.12000	రూ.5000	రూ.5000,5000	రూ.27000

పండ్ల తోటలు పెంచే వారికి ప్రోత్సాహం



పండ్ల తోటల పెంపకానికి రైతులు ముందుకొస్తే వారిని అన్ని విధాలా ఆదుకుంటాం. ప్రధానంగా ప్రభుత్వ పరంగా వచ్చే రాయితీలు అందిస్తాం. చాలా రకాల పంటలకు ఇక్కడి నేలలు అనుకూలంగా ఉన్నాయి. మెట్ట ప్రాంతాల్లో యాపిల్‌బేర్ సాగు చేయటానికి రైతులు ముందుకొస్తున్నారు. జామ తోటలకు జిల్లాలో మంచి భవిష్యత్తు ఉంది. ఇప్పుడు అన్ని పండ్లకు కూడా మంచి మార్కెటింగ్ సౌకర్యం కూడా ఉంది. రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

-ఆర్. శ్రీనివాసరావు, జిల్లా ఉద్యాన శాఖ అధికారి, ఖమ్మం

సమగ్ర సర్వే ప్రకారం పంటల వివరాలు ఇలా.....

పంటపేరు	ఎకరాలు (విస్తీర్ణం)	సాగుచేస్తున్న రైతుల సంఖ్య
మామిడి	35,469	12,039
జామ	504	124
యాపిల్ బేర్	64	25
జీడిమామిడి	231	114
సపోట	71	18
నిమ్మ	1,858	692
ఆయిల్‌పామ్	3,626	746
కొబ్బరి	218	86
బొప్పాయి	205	66
కరివేపాకు	167	59

- వనం నాగయ్య, 9490099343

రైతుల సందేహాలు | నిపుణుల సమాధానాలు

'కాప్టాన్'తో ఆకుమాడు నివారణ

బంతి ఆకులను పాముపొడ ఆశించింది. కాపాడుకోవడమెలా?

- రాములు, పాలకుర్తి (జనగాం జిల్లా)

ఈ పురుగు లార్వాలు బంతి ఆకులపై భాగాన పత్రహరితాన్ని తింటూ తెల్లటి వంకరటింకర సొరంగాలు ఏర్పరుస్తాయి. దీని నివారణకు లీటరు నీటిలో 2 మి.లీటర్ల ట్రైజోఫాస్ కలిపి పిచికారీ చేయాలి. ఆ తర్వాత మళ్లొకసారి లీటరు నీటిలో 3.5 మి.లీ పేడ సంబంధిత (బయోనీమ్) మందును కలిపి పిచికారీ చేయాలి.

టమాటలో ఆకులు మాడి ఎండిపోతున్నాయి. నివారణ ఎలా?

- శ్రీనివాస్, చందుర్తి (రాజన్న సిరిసిల్ల జిల్లా)

చల్లని వాతారణంలో ఆకుమాడు తెగులు ఎక్కువగా ఆశిస్తుంది. ఆకులు, కాండం, కాయల మీద మొదలు గోధుమ రంగుతో కూడిన మచ్చలు ఏర్పడతాయి. తర్వాత ఆకులు మాడి ఎండిపోతాయి. దీని నివారణకు లీటరు నీటికి 3 గ్రాముల కాప్టాన్ లేక మాంజోజెబ్ లేదా ఒక మి.లీటరు ప్రొపి కొనజోల్ మందును కలిపి 15 రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలి.

సీతాఫలం ఆకులపై నల్లటి మచ్చలు వస్తున్నాయి. ఏం చేయాలి?

- వీరభద్ర, జీవాంగి (బషీరాబాద్, వికరాబాద్ జిల్లా)

ఆకులపై వచ్చే నల్లటి మచ్చలు ఏర్పడి నష్టాన్ని కలుగజేస్తాయి. నివారణకు లీటరు నీటిలో ఒక గ్రాము కార్బండజిమ్ కలిపి పిచికారీ చేయాలి.

పత్తిలో మెగ్నీషియ లోపం నివారణ ఎలా?

- రమేష్, తిమ్మాజిపేట (వరంగల్ జిల్లా)

లీటరు నీటిలో 10 గ్రాముల మెగ్నీషియం సల్ఫేట్‌ని కలిపి పైరు వేసిన 45 , 75 రోజుల తర్వాత రెండుసార్లు పిచికారీ చేయాలి.

బీరలో మేలైన రకాలు ఏవి?

- లక్ష్మణ్, ముత్తారం (పెద్దపల్లి జిల్లా)

జగిత్యాల లాంగ్, జైపూర్‌లాంగ్, పూసాసస్దర్, అర్కసుజాత, అర్కసుమీత్

సేకరణ: మోత్కూరి యాదయ్య

మరో ఐదురోజుల్లో మోస్తరు వర్షాలు

వ్యవసాయం.. వాతావరణం

గడిచిన మూడు రోజుల్లో రాష్ట్రంలో చాలాచోట్ల తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిశాయి. అక్కడక్కడ భారీ వర్షాలు పడ్డాయి. పగటి ఉష్ణోగ్రతలు 24-31 డిగ్రీల సెల్సియస్, రాత్రి ఉష్ణోగ్రతలు 19-24 డిగ్రీల సెల్సియస్ నమోదయ్యాయి. హైదరాబాద్ వాతావరణ కేంద్రం అందించిన సమాచారం ప్రకారం రాబోయే ఐదు రోజుల్లో రాష్ట్రంలో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే సూచనలున్నాయి. పగటి ఉష్ణోగ్రతలు 25 నుంచి 34 డిగ్రీల సెల్సియస్ మధ్య, రాత్రి ఉష్ణోగ్రతలు 20 నుంచి 26 డిగ్రీల సెల్సియస్ మధ్య నమోదయ్యే అవకాశం ఉంది.

పొలాలను పరిరక్షించుకోండిలా..

వరి : నారుమడిలో కాండం తొలిచే పురుగు ఉధృతి పెరిగే సూచనలు ఉన్నాయి. నారు పీకే వారం రోజుల ముందు కార్బోపురాన్ 3జీ గుళికలు సెంటు మడికి 160 గ్రాముల చొప్పున ఇసుకలో కలిపి వేయాలి. వరి నాట్లు వేసే ముందు దమ్ము చేసిన తర్వాత ఆఖరి దుక్కిలో ఎకరానికి 150 కిలోల సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ లేదా 50 కిలోల డీఏపీతోపాటు 15 నుంచి 20 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ కలిపి వేయాలి. జింకు ధాతు లోపం ఉన్న పొలాల్లో ఎకరానికి 10 కిలోల జింక్ సల్ఫేట్‌ని 20 కిలోల ఇసుకలో కలిపి దమ్ము చేసిన తర్వాత వేయాలి. దీర్ఘకాలిక వరి రకాలు (140 నుంచి 160 రోజుల్లో కోతకు వచ్చేవి) వేస్తే ఒక చదరపు మీటరుకు 33 కుదుర్లు ఉండేలా నాటాలి. స్వల్పకాలిక రకాలకు (100 నుంచి 130 రోజుల్లో కోతకు వచ్చేవి) వేస్తే ఒక చదరపు మీటరుకు 44 కుదుర్లు ఉండే విధంగా నాటు వేయాలి. నాటు వేసిన నాలుగు రోజుల్లో ఎకరానికి ఒక లీటరు బ్యూటాక్లోర్ లేదా 35 గ్రాముల ఆగ్జాడైఆర్జిల్(టాప్‌స్టార్) లేదా 400 మి.లీటర్ల ప్రిటిలాక్లోర్ లేదా 4 కిలోల లోండాక్షపవర్ టీ గుళికలు 20 కిలోల ఇసుకలో కలిపి పొలంలో నీరు పల్చగా ఉండేటట్టు చూసుకుని వేయాలి. కలుపు మందు వేసిన రెండు నుంచి మూడు రోజుల వరకు పొలంలోంచి నీరు బయటకు పోకుండా చూడాలి. 40 రోజులు లేదా ఆపైన వయసుగల నారు వేసే పరిస్థితుల్లో ఒక చదరపు మీటరుకు 44 కుదుర్లు, ఒక్కొక్క కుదురుకు 4 నుంచి 5 మొక్కలు ఉండేలా నాటుకోవాలి. ముదురు నారు వేసేవారు కొనలు తుంచి నాటుకోవాలి. ముదురు నారు నాటిన పరిస్థితుల్లో నత్రజని ఎరువును సిఫార్సు చేసిన దానికి 25శాతం అదనంగా వాడాలి. నత్రజని ఎరువుని 70 శాతం నాటిన వారం రోజుల్లో మిగిలిన 30శాతం అంకురం ఏర్పడే దశలో వేయాలి. నాటిన 20 నుంచి 25 రోజుల మధ్య ఎకరానికి 10 కిలోల కార్బోపురాన్ 3జీ గుళికలు లేదా 8 కిలోల కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 4జి గుళికలు లేదా 4 కిలోల క్లోర్ అట్రానీలిప్రోల్ గుళికలు చొప్పున 20 కిలోల ఇసుకలో కలిపి వేస్తే కాండం తొలిచే పురుగులు, ఆకుచుట్టు పురుగులను నివారించొచ్చు. గత వారం వాతావరణం పరిస్థితుల దృష్ట్యా వరిలో ఆకునల్లి ఉధృతి కనిపించింది. నివారణకు లీటరు నీటికి 5 మి.లీటర్ల డైకోఫాల్ లేదా ఒక మి.లీటరు స్పిరోమైసిఫెన్ కలిపి పిచికారి చేయాలి.

మొక్కజొన్న: నేలలో తేమనుబట్టి పైరు 45నుంచి 50 రోజుల దశలో ఎకరానికి 50 కిలోల యూరియా, 15 నుంచి 20 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ కలిపి పైపాటుగా వేయాలి. ప్రస్తుతం మొక్కజొన్న పీచు దశలో ఉంది కాబట్టి నీట ఎద్దడి లేకుండా చూడాలి.

పత్తి: ప్రస్తుతం వర్షాలను ఉపయోగించుకొని పైపాటుగా పైరు 55 నుంచి 60 రోజుల దశలో ఎకరానికి 50 కిలోల యూరియా, 15 నుంచి 20కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ కలిపి వేయాలి. పత్తిలో రసం పీల్చే పురుగులు గమనించడమైంది. నివారణకు మోనోక్రోటోఫాస్, నీరు 1:4 నిష్పత్తిలో లేదా ఇమిడాక్లోప్రిడ్, నీరు 1:20 నిష్పత్తిలో కలిపి లేత కాండంపై మెత్తని బ్రష్‌తో విత్తిన 45, 60 రోజులకు పూయాలి. సాధ్యమైనంత తరచుగా పైపాటు, అంతరకృషి చేసినట్టయితే కలుపు నివారణతోపాటు నేలలో తేమను కొంత వరకు కాపాడుకోవచ్చు.

కంది/పెసర/మినుము: ప్రస్తుత వాతావరణ పరిస్థితులు ఈ పంటలలో రసం పీల్చే పురుగుల ఉధృతి పెరిగే సూచనలున్నాయి. నివారణకు లీటరు నీటికి 1.6 మి.లీ మోనోక్రోటోఫాస్ లేదా 1.5 గ్రాముల ఎసిఫేట్ కలిపి పిచికారీ చేయాలి.

ప్రొ కబడ్డీలో నేడు
యూపీ X తెలుగు టైటాన్స్
రాత్రి 8 గంటలకు
వేదిక : లక్నో
స్టార్‌స్పోర్ట్స్‌లో ప్రసారం



కిదాంబి శ్రీకాంత్

మొదలైంది సైనా వేట

'ఇది కఠినమైన మ్యాచ్ అని నా భావన. సబ్రినా వర్ధమాన క్రీడాకారిణే అయినా అలవోక విజయం సాధించటం సంతోషంగా ఉంది. తొలి మ్యాచ్ ఎప్పుడూ కష్టంగానే ఉంటుంది. కానీ పరిస్థితులకు ఒక్కసారి అలవడితే.. అంతా సవ్యంగానే సాగిపోతుంది'
– సైనా నెహ్వాల్

అగ్రశ్రేణి బ్యాడ్మింటన్ క్రీడాకారిణి సైనా నెహ్వాల్ ప్రపంచ చాంపియన్‌షిప్స్‌లో పసిడి వేట మొదలెట్టింది. 2015లో సిల్వర్‌తో మెరిసిన సైనా.. ఈ సారి అలవోక విజయంతో ప్రీ క్వార్టర్స్‌లోకి ప్రవేశించింది. తెలుగు తేజాలు కిదాంబి శ్రీకాంత్, బి. సాయిప్రణీత్‌లు సైతం ప్రీ క్వార్టర్స్‌లో అడుగుపెట్టారు. బ్యాడ్మింటన్ ప్రపంచ చాంపియన్‌షిప్స్ సింగిల్స్ విభాగంలో భారత షట్లర్లు వరుసగా మూడో రోజు సులువైన విజయాలతో అదరగొట్టారు.

అలవోక విజయంతో ప్రీ క్వార్టర్స్‌లో అడుగు

- కిదాంబి శ్రీకాంత్, సాయిప్రణీత్‌లు ముందంజ
- 2017 బ్యాడ్మింటన్ ప్రపంచ చాంపియన్‌షిప్స్

నవతెలంగాణ-గ్లాస్గో

మాజీ వరల్డ్ నెం.1, 2015 సీజన్ సిల్వర్ మెడలిస్ట్ సైనా నెహ్వాల్ అలవోక విజయంతో వరల్డ్ చాంపియన్‌షిప్స్ మెడల్ వేట మొదలుపెట్టింది. స్విట్జర్లాండ్ షట్లర్‌పై రెండో రౌండ్లో వరుస గేముల్లో గెలుపొందిన సైనా నెహ్వాల్ ప్రీ క్వార్టర్స్‌లో కాలుమోపింది. అర్ధ గంటలో ముగిసిన మ్యాచ్‌లో సైనా దూకుడుగా ఆడింది. క్వార్టర్‌ఫైనల్స్ దారిలో వరల్డ్ నెం.3 సంగ్‌జీ హ్యాన్ (దక్షిణ కొరియా)తో సైనా నెహ్వాల్ తేల్చుకోనున్నది. పురుషుల సింగిల్స్‌లో స్టార్ షట్లర్, తెలుగు తేజం కిదాంబి శ్రీకాంత్, బి. సాయిప్రణీత్‌లు సైతం రెండో రౌండ్లో అలవోక విజయాలు నమోదు చేసుకున్నారు. మెడల్ రేసులో దూసుకెళ్తోన్న శ్రీకాంత్, సాయిప్రణీత్‌లు ప్రీ క్వార్టర్స్‌కు చేరుకుని మరో అడుగు ముందుకేశారు.

సైనా సులువుగా.. : అగ్రశ్రేణి క్రీడాకారిణీ సైనా నెహ్వాల్ 21-11, 21-12తో సబ్రినా జాకెట్ (స్విట్జర్లాండ్)పై గెలుపొందింది. 33 నిమిషాల్లో ముగిసిన మ్యాచ్‌లో సైనా ఆధిపత్యం చెలాయించింది. తొలి గేమ్‌లో 4-0తో దూసుకెళ్లిన సైనా విరామ సమయానికి 11-6తో ఆధిక్యంలో నిలిచింది. 9-13తో సబ్రినా పోరాడినా.. సైనా వరుసగా ఐదు పాయింట్లు సాధించి తొలి గేమ్‌ను ముగించింది. ఇక రెండో గేమ్‌లోనూ సైనా 5-2తో ముందంజలో నిలిచినా, బ్రేక్ టైమ్‌కు 11-7తో సబ్రినా పోటీలో నిలిచింది. కానీ ద్వితీయార్థంలో రెచ్చిపోయిన సైనా 21-12తో గేమ్‌ను ముగించి ప్రీ క్వార్టర్స్‌కు చేరుకున్నది. మరో మ్యాచ్‌లో వర్ధమాన తార తన్వీ లాడ్ 9-21, 19-21తో వరల్డ్ నెం.2 సంగ్ జీ హ్యాన్ (కొరియా) చేతిలో పోరాడి ఓడింది. పురుషుల సింగిల్స్‌లో వరల్డ్ నెం.8 కిదాంబి శ్రీకాంత్ 21-9, 21-17తో అండర్స్ ఆంటోన్సెన్ (డెన్మార్క్)పై ఏకపక్ష విజయం సాధించాడు. బి. సాయిప్రణీత్ 14-21, 21-18, 21-19తో ఆంటోనీ (ఇండోనేషియా)పై హోరాహోరీ పోరులో గట్టెక్కాడు. మహిళల డబుల్స్‌లో అశ్విని పొన్నప్ప, సిక్కి రెడ్డి జంటకు చుక్కెదురైంది. రెండో సీడ్, డెన్మార్క్ జంటతో జరిగిన హోరాహోరీ మ్యాచ్‌లో పొన్నప్ప, సిక్కి రెడ్డిలు ఓటమిపాలయ్యారు. 75 నిమిషాల పాటు నువ్వా నేనా అన్నట్టు సాగిన మ్యాచ్‌లో 22-24, 21-17, 15-21తో క్రిస్టినా, కమిలా (డెన్మార్క్) చేతిలో పరాజయం పాలయ్యారు.

క్వార్టర్స్ దారిలో కఠిన ప్రత్యర్థి

తొలి రౌండ్‌లో బై లభించగా, రెండో రౌండ్లో అలవోక విజయం సాధించింది సైనా నెహ్వాల్. కానీ క్వార్టర్స్‌కు చేరుకునే దారిలో హైదరాబాదీ షట్లర్ ముందు కఠిన ప్రత్యర్థి నిలుచున్నది. వరల్డ్ నెం.3, రెండోసీడ్ దక్షిణ కొరియా షట్లర్ సంగ్ జి హ్యాన్‌తో ప్రీ క్వార్టర్స్‌లో సైనా నెహ్వాల్ తలపడాల్సి ఉంది. కొరియా అమ్మాయితో ముఖాముఖి పోరులో సైనా నెహ్వాల్ 7-2తో తిరుగులేని ఆధిపత్యంతో కనిపిస్తుంది. కానీ సైనా నెహ్వాల్ ఫామ్ కోల్పోయి ర్యాంకింగ్స్‌లో టాప్-10లో చోటు కోల్పోయింది. మరోవైపు సంగ్ జి హ్యాన్ భీకర ఫామ్‌లో కొనసాగుతోంది. ఈ ఏడాది ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో కొరియా అమ్మాయిని వరుస గేముల్లో ఓడించిన సైనా.. తాజా పోరులోనూ అదే పునరావృతం చేయాలని చూస్తోంది.

షోకాజ్ నోటీసులు

- సెప్టెంబర్ 19న వ్యక్తిగతంగా హాజరు కావాలని ఆదేశం
- లోధా సిఫారసుల అమలుపై సుప్రీంకోర్టు



అమితాబ్ చౌదరి

నవతెలంగాణ-న్యూఢిల్లీ

భారత క్రికెట్ బోర్డు (బీసీసీఐ) సమూల ప్రక్షాళన అంశంలో అత్యున్నత న్యాయస్థానం మరోసారి క్రికెట్ బోర్డు పెద్దలపై కన్నెర్రజేసింది. తుది తీర్పు వెలువరిస్తూ అమలుకు ఇచ్చిన గడువు ముగిసి ఆరు మాసాలైనా.. ఇంకా సంస్కరణల పర్వం ఆరంభం కాకపోవటంపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. లోధా సిఫారసులు ఎందుకు అమలు కావటం లేదో వ్యక్తిగతంగా కోర్టుకు హాజరై వివరించాలని బీసీసీఐ తాత్కాలిక అధ్యక్ష, కార్యదర్శులు సి.కె. ఖన్నా, అమితాబ్ చౌదరి సహా కోశాధికారి అనిరుధ్ చౌదరిలకు షోకాజ్ నోటీసులు జారీ చేసింది. సెప్టెంబర్ 19న జరిగే తదుపరి విచారణ సందర్భంగా కోర్టుకు హాజరై వివరణ ఇవ్వాలని జస్టిస్ దీపక్ మిశ్రా నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం ఆదేసింది.

' ఒక్క సిఫారసూ అమలు చేయకపోవటమే అసలు సమస్య. షోకాజ్ నోటీసు జారీ చేసి, నేరుగా హాజరు కావాలని ఆదేశిస్తున్నాం. పాలకుల కమిటీ రాజ్యాంగ ముసాయిదా సిద్ధం చేస్తే బాగుంటుందని అనుకుంటున్నాం. జులై 24 తీర్పు అనుసరించి బీసీసీఐ నూతన రాజ్యాంగం రూపొందించండి' అని జస్టిస్ దీపక్ మిశ్రా, జస్టిస్ ఏ.ఎం. ఖాన్‌విల్కర్, జస్టిస్ డి.వై చంద్రచూడ్‌లతో కూడిన ధర్మాసనం పేర్కొన్నది. ఇక ఇటీవల జరిగిన బీసీసీఐ ప్రత్యేక సర్వ సభ్య సమావేశానికి సీఈవో రాహుల్ జోహ్రీని అనుమతించకపోవటాన్ని సైతం కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. సిఫారసుల అమలుకు అడ్డుపడుతున్న బీసీసీఐ ఆఫీస్ బేరర్లను తొలగించి, సీఈవో రాహుల్ జోహ్రీ నాయకత్వంలోని అధికారుల బృందానికి బీసీసీఐ వ్యవహారాలు అప్పగించాలనే ప్రతిపాదనను ఆమోదించాలని ఈ సందర్భంగా పాలకుల కమిటీ తరఫున గోపాల్ సుబ్రమణియం ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు.

దబాంగ్‌పై స్టీలర్స్ గెలుపు

యోధా-తలైవాస్ మ్యాచ్ టై



లక్నో: దబంగ్ ఢిల్లీపై హర్యానా స్టీలర్స్ 27-25తో గెలుపొందింది. దబంగ్ ఆటగాళ్ళలో ఫజల్ 8 పాయింట్లు, మిరాజ్ నీలేష్‌లు చెరో అయిదు పాయింట్లు సాధించినా ప్రయోజనం లేకపోయింది. స్టీలర్స్‌లో దీపక్ సుర్జీత్ వికాస్‌లు వరసగా 7,5,4 రైడ్ పాయింట్లతో విజయంలో కీలక పాత్ర పోషించారు. నీరజ్ కుమార్ 3 టాకిల్స్‌తో ఫరవాలేదనిపించాడు. యూపీ యోధా, తమిళ్ తలైవాస్ మధ్య జరిగిన మరో మ్యాచ్ టై గా ముగిసింది. రిషాంక్ 14 రైడ్ పాయింట్లతో మెరిపించాడు. తలైవాస్‌లో అజయ్ 10 పాయింట్స్, అమిత్ 6 టాకిల్స్ రాణించారు.

టెస్టుల్లో చావుదెబ్బ తిన్నా, పరిమిత ఓవర్ల ఫార్మాట్‌లో కనీస పోటీ ఇస్తుందనే నమ్మకం శ్రీలంకపై ఉంచారు. కానీ తొలి వన్డేలో దారుణ ఓటమితో ఆతిథ్య శ్రీలంక ఎన్నడూలేనంత ఒత్తిడి ఎదుర్కొంటుంది. వరుస ఓటములు, అభిమానుల నిరసన, కీలక ఆటగాళ్ల ఫామ్ లేమితో లంకేయులు రెండో వన్డేలో కనీస పోటీ కోసం పోటీపడుతున్నారు. సూపర్ ఫామ్‌లో ఉన్న కోహ్లిసేన మరింత నిర్దాక్షిణ్యంగా పల్లెకెలెను సొంతం చేసుకునేందుకు సిద్ధమవుతోంది.

15 శ్రీలంకపై గత 19 వన్డేల్లో భారత్ ఏకంగా 15 మ్యాచుల్లో గెలుపొందింది

పోటీ ఉంటుందా?

నేడు శ్రీలంకతో భారత్ రెండో వన్డే



ధోని

విరాట్ కోహ్లి

- భీకర ఫామ్‌లో కోహ్లిసేన
- కనీస పోటీ కోసం లంక ఆరాటం

నవతెలంగాణ-పల్లెకెలె

పరిమిత ఓవర్ల ఫార్మాట్‌లో అపరిమిత ఆధిపత్యాన్ని కొనసాగించేందుకు కోహ్లిసేన ఉవ్విళ్లూరుతోంది. వరుస ఓటములతో శ్రీలంక విపరీతమైన ఒత్తిడిలో కూరుకుపోగా, ప్రయోగాల వేళ అద్భుత ఫలితాలు రాబడుతూ టీమ్ ఇండియా ఉత్సాహంతో కనిపిస్తోంది. సీనియర్ స్పిన్నర్ల స్థానంలో యువ స్పిన్నర్లు, మిడిల్ ఆర్డర్‌లో కొత్త వారితో ప్రయోగం చేస్తోన్న కోహ్లిసేన ఈ దిశగా సక్సెస్ సాధించినట్టే కనిపిస్తోంది. దంబుల్లాలో మెరుపు విజయం సాధించిన భారత్.. పల్లెకెలెలోనూ అదే దూకుడుపై కన్నేసింది. రెండో వన్డేలోనూ ఆతిథ్య జట్టును చితకబాది సిరీస్‌లో 2-0 ఆధిక్యం సాధించాలని చూస్తోంది. రెండో వన్డేకు వర్షం ముప్పు పొంచి ఉన్నా.. అది మ్యాచ్ రద్దు అయ్యే పరిస్థితి లేదు. దీంతో పల్లెకెల్‌లోనూ పరుగుల పసందు ఖాయం.

అతడిని ఆపగలరా? : టీమ్ ఇండియా గబ్బర్ 'శిఖర్ ధావన్' నేటి మ్యాచ్‌లోనూ ప్రత్యేకంగా నిలువనున్నాడు. శ్రీలంకపై అతడి అద్భుత రికార్డు నేపథ్యంలో నేడు శ్రీలంక అతడిని ఆపగలదా? అనేది ఆసక్తికరంగా మారింది. వరుస సెంచరీలతో దూసుకెళ్తోన్న ధావన్ ద్వీపదేశంపై తిరుగులేని రికార్డు కల్గి ఉన్నాడు. తొలి వన్డేలో అనూహ్యంగా రనౌట్ అయిన రోహిత్ శర్మ నేడు భారీ స్కోరుపై కన్నేశాడు. అజింక్య రహానె స్థానంలో మిడిల్ ఆర్డర్‌లో చోటు దక్కించుకున్న లోకేశ్ రాహుల్ సత్తా చాటాలని ఎదురుచూస్తున్నాడు. సీనియర్ ఆటగాడు ఎం.ఎస్ ధోని సైతం అవకాశమొస్తే ఆఖర్లో ధనాధన్ ఆడేలా ఉన్నాడు. వరుస విమర్శల నేపథ్యంలో ధోని ఇన్నింగ్స్‌ను ప్రపంచం నిశితంగా చూడనున్నది. కెప్టెన్ కోహ్లి సహా కేదార్ జాదవ్, పాండ్యలు ఎప్పట్లాగే ఫామ్‌ను కొనసాగించనున్నారు. బౌలింగ్ విభాగంలో బుమ్రా, భువనేశ్వర్‌లకు తోడు పాండ్య సీమ్ బాధ్యతలు పంచుకోనుండగా.. స్పిన్ విభాగంలో అక్షర్ పటేల్, యుజ్వేందర్ చాహల్ మరోమారు మాయ చేయనున్నారు. చైనామన్ కుల్‌దీప్ యాదవ్‌కు మళ్లీ బెంచ్‌కు పరమితం కానున్నాడు.

757
శ్రీలంకపై పది వన్డేల్లో శిఖర్ ధావన్ బాదిన పరుగులు 757. ఏకంగా 84.11 సగటుతో ధావన్ లంకపై తిరుగులేని రికార్డు కొనసాగిస్తున్నాడు.

మధ్యాహ్నం 2.30 నుంచి సోనీసిక్స్‌లో ప్రసారం..

కనీసం పోటీ ఇచ్చేనా? : ఆతిథ్య శ్రీలంక విజయం కోసం ఆడటం అటుంచితే, కనీస పోరాట పటిమ చూపేనా అని క్రికెట్ అభిమానుల్లో సందేహం నెలకొన్నది. బ్యాట్‌తో, బంతితో ఆ జట్టు పేలవ ప్రదర్శన మరీ దారుణంగా ఉన్నది. తొలి వన్డేలో లంక బౌలర్లు ఒక్క వికెట్ కూడా కూల్చలేకపోయారు. ఇక ఓపెనర్లు శుభారంభం అందించినా.. మిడిల్ ఆర్డర్‌లో మాథ్యూస్ మినహా ఎవ్వరూ రాణించలేక పోయారు. కానీ పల్లెకెల్‌లో దీటుగా ఆడాలని శ్రీలంక కృతనిశ్చయంతో కనిపిస్తున్నా.. కోహ్లిసేన ముందు వారి నిలిచేందుకు అనుమానమే. తుది జట్టులోనూ శ్రీలంక పలు మార్పులు చేయనున్నది. బంతితో లసిత్ మలింగ బాధ్యత తీసుకోవాలని జట్టు మేనేజ్‌మెంట్ కోరుకుంటోంది.

వర్షం ముప్పు!

పల్లెకెలె పిచ్ సీమ్‌కు సహకరించనున్నది. అలాగని ఇక్కడ స్పిన్నర్లకు పట్టు దొరకదనే పరిస్థితి లేదు. ఫ్లడ్‌లైట్ల వెలుతురులో టర్న్ సైతం కీలక పాత్ర పోషించనున్నది. మ్యాచ్‌కు వరుణుడు అంతరాయం కలిగించే ప్రమాదం పొంచి ఉన్నది.



తుది జట్లు (అంచనా) :

భారత్ : రోహిత్ శర్మ, శిఖర్ ధావన్, విరాట్ కోహ్లి, లోకేశ్ రాహుల్, ఎం.ఎస్ ధోని, కేదార్ జాదవ్, హార్దిక్ పాండ్య, అక్షర్ పటేల్, యుజ్వేందర్ చాహల్, భువనేశ్వర్ కుమార్, జశ్‌ప్రీత్ బుమ్రా.

శ్రీలంక : నిరోశన్ డిక్‌వెల్లా, దనుష్క గుణతిలక, కుశాల్ మెండిస్, ఉపుల్ తరంగ, ఎంజెలో మాథ్యూస్, చమర కపుగెదర, మిలింద సిరివర్ధనన్, వహిందు హసరంగ, అఖిల ధనుంజయ, లసిత్ మలింగ, విశ్వ ఫెర్నాండో.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State Editor : S.Veeraiah.Tel Tel/2014/59462.